

అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



రాజ్యసభకు కమల్ హాసన్

ప్రధాని మౌనం వీడాలి

లోపలి పేజీల్లో

కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు 44 మంది ఎమ్మెల్యేలు సిద్ధం



సంపుటి 08, సంచిక: 179 | గురువారం | 29-05-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్

- త్రిపుర హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఎంఎస్.రామచంద్రరావు
- మద్రాస్ హైకోర్టుకు జస్టిస్ టి.వినోద్‌కుమార్ బదిలీ
- సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు



**న్యూఢిల్లీ :** తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌ని సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం ఆయన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటి వరకు తాత్కాలిక న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ సుజయ్ పాల్ కల్‌కత్తా హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ఆయన స్థానంలో పూర్తి స్థాయి చీఫ్ జస్టిస్‌గా అపరేశ్ కుమార్ సింగ్ రానున్నారు.అలాగే తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తడకమల్ల వినోద్‌కుమార్‌ను మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సిఫార్సు చేసింది. త్రిపురతో పాటు రాజస్థాన్, జార్ఖండ్, మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను బదిలీ చేయాలని సిఫార్సు చేస్తూ సోమవారం సుప్రీం చీఫ్ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల కొలీజియం సమావేశంలో తీర్మానించారు.

**రాంచీ నుంచి...**

జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 1965 జూలై 7న జన్మించారు. ఆయన బిఎ (ఆనర్స్) పూర్తి చేసి, ఢిల్లీ యూనివర్సిటీ నుంచి ఎల్ఎల్‌బి పట్టభద్రుడయ్యారు. 1990లో న్యాయవాదిగా ఎన్‌రోల్ అయ్యి, పట్నా హైకోర్టులో 1990 నుంచి 2000 సంవత్సర వరకు ప్రాక్టీస్‌చేశారు. జార్ఖండ్ రాష్ట్రం ఆవిర్భావం తరువాత 2001 నుంచి 2012 వరకు జార్ఖండ్ హైకోర్టులో న్యాయవాదిగా పని చేశారు. 2012 జనవరి 24న జార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఆయనను 2014 జనవరి 16న పూర్తి స్థాయి న్యాయమూర్తిగా నియమించారు. 2022 డిసెంబర్ 20 నుంచి 2023 ఫిబ్రవరి 19వరకు జార్ఖండ్ హైకోర్టు యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌గా పనిచేశారు. ఆయన జార్ఖండ్ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా తరువాయి 2లో

## ఉద్యోగాల భర్తీని అడ్డుకుంటున్నారు

- తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరో చోట పదవులిచ్చుకున్నారు
- విద్యార్థులకు మాత్రం ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారు
- కోర్టుల్లో కేసులు వేస్తున్నారు
- అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతున్నది
- గత బిఆర్ఎస్ ప్రభుత్వంపై సిఎం రేవంత్‌రెడ్డి మండిపాటు
- ఎస్‌సి గురుకులాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకుఅవార్డులు ప్రదానం



ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది వాస్తవం కాదా? కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేసింది. మొదటి ఏడాదిలోనే ఇన్నిఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదే. గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశాం. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు, రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారు. - సిఎం



ప్రజాపక్షం/హైదరాబాద్

బిఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుందని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కెసిఆర్ కుటుంబ సభ్యులకు మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని విమర్శించారు. హైదరాబాద్‌లోని బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఎస్‌సి గురుకులాల్లో పదవతరగతి, ఇంటర్ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ గత పదేళ్లలో ఉద్యోగాల భర్తీకి ఎందుకు నోటిఫికేషన్లు ఇవ్వలేదని బిఆర్ఎస్ నేతలను నిలదీశారు. పిజిలు చేసిన విద్యార్థులు ఎంతో విలువైన కాలాన్ని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. చదువుకున్న పిల్లలకు తాము ఉద్యోగాలు ఇస్తున్నామని, తమ ప్రభుత్వం హయాంలో మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు. ఒక్క ఏడాదిలోనే 59 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. గత 15 ఏళ్లుగా గ్రూప్1 పరీక్షలు నిర్వహించలేదన్నారు. తమ హయాంలో 563 గ్రూప్1 పోస్టులు భర్తీ చేస్తున్నామని వివరించారు. గ్రూప్1లో 89 శాతం పోస్టులు ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు దక్కాయని వివరించారు. ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుండా పదేళ్లు నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడింది తరువాయి 2లో



## 14 పంటలకు ఎంఎస్‌పి పెంపు

- వరికి రూ.69పెంచడంతో కనీస మద్దతు ధర రూ.2,369కు చేరిక
- పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర తృణధాన్యాలు, పత్తికి పెరిగిన ఎంఎస్‌పి
- ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ తీర్మానం


**న్యూఢిల్లీ :** నైరుతీ రుతుపవనాలు ప్రవేశించడంతో కేంద్ర మంత్రివర్గం ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో పంటల మద్దతు ధరలు పెంచింది. పంట రుణాలపై వడ్డీ రాయితీ పథకం కొనసాగించాలని నిర్ణయించింది. వరిధాన్యం,పప్పుధాన్యాలు, నూనెగింజలు, ఇతర తృణధాన్యాల కనీస మద్దతు ధరలు (ఎంఎస్‌పి) క్వింటాలుకు రూ. 69లు పెంచాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) నిర్ణయించింది. మద్దతు ధరల పెంపుతోపాటు పంట రుణాలపై వడ్డీ రాయితీ పథకాన్ని కూడా కొనసాగించాలని తీర్మానించింది. ఈ నిర్ణయంవల్ల క్వింటాలు సాధారణ రకం వరిధాన్యం మద్దతుధర రూ. 2,369లకు, ఏ గ్రేడు వరిధాన్యం మద్దతు ధర క్వింటాలుకు రూ.2,389లు వంతున పెరిగాయి. ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన సిసిఇఎ సమావేశం బుధవారంనాడు జరిగింది. వరిధాన్యం మద్దతు ధర క్వింటాలుకు మూడు శాతం పెంచగా, పప్పుధాన్యాలకు మద్దతు ధరను 5.96 శాతానికి, నూనెగింజలు, ఇతర తృణధాన్యాలకు క్వింటాలు ధరను తొమ్మిదీశాతానికి పెంచారు. కాగా పత్తి పంటకు మద్దతు ధరను రూ.589 పెరడంతో దీని క్వింటాలు ధర రూ.7,710 (మధ్యతరహా) పెరిగింది. పొడుగ్గా ఉండే పత్తికి మద్దతు ధర క్వింటాలుకు రూ.8,110లు పెరిగింది. సాధారణ వాతారణ పరిస్థితులకు భిన్నంగా నైరుతీ రుతుపవనాలు చాలా ముందుగా దేశంలోకి ప్రవేశించిన పూర్వరంగంలో 2025–26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌కుగాను కేంద్రమంత్రివర్గ కమిటీ ఈ మద్దతు ధరలు ప్రకటించింది. వ్యవసాయమంత్రిత్వశాఖ చేసిన ప్రతిపాదన మేరకు మంత్రివర్గ కమిటీ ఈ నిర్ణయం తీసుకుందని కేంద్ర సమాచార, ప్రసారాలశాఖామంత్రి అశ్వనీవైష్ణవ్ సమావేశానంతరం మీడియాకు చెప్పారు. ఈ నిర్ణయం ద్వారా ఖరీఫ్‌లో వరినాట్లు, నూనెగింజలు, పప్పుధాన్యాల పంటసాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడానికి వీలు కలుగుతుందని, రైతులకు ప్రోత్సాహకరంగా ఉంటుందని ఆయన అన్నారు. మనదేశంలోని మొత్తం వార్షిక ఆహార ఉత్పత్తిలో 50 శాతం ఆహార ఉత్పత్తి రుతుపవనాల ప్రభావిత వర్షపాతంమీద ఆధారపడే జరుగుతుందని, దేశంలో ప్రధానంగా ఖరీఫ్ పంటసాగు రుతుపవన తరువాయి 2లో

## రాష్ట్రమంతా 'నైరుతి' విస్తరణ

- రుతుపవనాలు, అల్పపీడనల ప్రభావంతో.. మూడురోజులు భారీ వర్షాలు
- పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసిన ఐఎండి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా నైరుతి రుతుపవనాలు విస్తరించాయి. మే 26న మహబూబ్‌నగర్‌లోకి ప్రవేశించిన నైరుతి రుతుపవనాలు ప్రస్తుతం ఆదిలాబాద్ వరకు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు చెప్పారు. నైరుతి ఋుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ క్రమంలో పలు జిల్లాల్లో భారీ వర్షాలు నమోదయ్యాయి. రుతుపవనాల ప్రభావంతో మరో మూడురోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు హెచ్చరించారు. వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం తరువాయి 2లో



## పంటనష్ట పరిహారం రూ.51 కోట్లు విడుదల

- 29 జిల్లాల్లో5,528 ఎకరాలలో పంట నష్టం
- 41,361 మంది రైతుల ఖాతాలో జమకానున్న నిధులు

ప్రజాపక్షం/హైదరాబాద్

అకాల వర్షాలు, వడగళ్ల వానకు దెబ్బతిన్న రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనావేసి బుధవారం ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. రాష్ట్రంలో గత రెండు నెలలుగా పలు దఫాలుగా వడగళ్ల వాన, అకాలవర్షాలకు పంట నష్టం సంభవించిన విషయం తెలిసిందే. దీన్ని దృష్టిలో పెట్టుకుని రైతులు నష్టపోకుండా ఉండేందుకు వారికి పంట్ల నష్టం అందించాలని, పంట నష్టం అంచనా నివేదిక అందజేయాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి తరువాయి 2లో



## నిబద్ధతతో పనిచేస్తున్న వారికే నామినేటెడ్ పదవులు



- కాంగ్రెస్ నాయకులకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సూచన
- పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలతో వరుసగా సమీక్షలు
- పార్టీ శ్రేణులు క్రమశిక్షణ పాటించాలని నేతలకు దిశానిర్దేశం

ప్రజాపక్షం/హైదరాబాద్:

కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తున్న నాయకులకు ప్రాముఖ్యతను ఇవ్వాలని, నామినేటెడ్ పదవుల భర్తీలో వారికిప్రాధాన్యతను ఇవ్వాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టిపిసిసి) వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నేతలకు సూచించారు. హైదరాబాద్ హైదర్‌గూడలోని క్యాంపు కార్యాలయంలో బుధవారం పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా మంత్రులు, ఎంఎల్ఎలు, ఎంపిలతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె పలు కీలక అంశాలను చర్చించారు. పార్టీ శ్రేణుల్లో క్రమశిక్షణ పాటించాల్సిన అవసరాన్ని ఆమె నొక్కి చెబుతూ పార్టీ బలోపేతానికి నాయకులకు దిశానిర్దేశం చేశారని పార్టీ వర్గాలు తెలిపాయి. అలాగే పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజిగిరి లోక్‌సభ స్థానాల నేతలతో ఆమె భేటీ అయ్యారు. తొలుత ఆదిలాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ నేతలతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో 119 నియోజకవర్గాల ఎంఎల్ఎలు పోటీ చేసిన అభ్యర్థులతోనూ ఆమె విడివిడిగా భేటీ అయి ప్రభుత్వం, పార్టీకి సంబంధించి నేతల వద్ద ఫీడ్ బ్యాక్ తీసుకున్నట్లు తెలిసింది. మొదటి దశలో భాగంగా ఆదిలాబాద్, పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, జహీరాబాద్, మెదక్, మల్కాజ్‌గిరి స్థానాలపై దృష్టి సారించారు. ఈ సమావేశాలలో నియోజకవర్గాల పరిధిలోని తాజా రాజకీయ పరిస్థితులు, పార్టీ కార్యకర్తల అభిప్రాయాలు, భవిష్యత్ కార్యాచరణపై నేతల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలోని కాంగ్రెస్ ఎంఎల్ఎలతో పాటు, గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో కూడా మీనాక్షి నటరాజన్ విడివిడిగా తరువాయి 2లో



## వానాకాలం వరి నాట్ల లోపు రైతు భరోసా జమ

- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల ప్రకటన
- చిట్యాలలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో దుకాణ సముదాయాలు ప్రారంభం

ప్రజాపక్షం/చిట్యాల

వర్షాకాలం వరి నాట్లలోపు రైతులకు 'రైతు భరోసా' మొత్తాన్ని అందజేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ కేంద్రంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రూ. 1.40 లక్షల వ్యయంతో నిర్మించిన దుకాణ సముదాయాలను బుధవారం శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంలతో కలిసి ప్రారంభించారు. అలాగే నూతన వ్యవసాయ కమిటీ పాలక వర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో స్థిరమైన, శాశ్వతమైన పాలన కొనసాగుతున్నదని, అప్పుల తాకిడిని తట్టుకుంటూ ప్రజా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు అందజేస్తున్నామన్నారు. రైతు భరోసాను రైతులను అందించడానికి ప్రభుత్వం సిద్ధమౌతుందని అన్నారు. సాంప్రదాయ పంటలను పండించడానికి రైతులు మొగ్గ చూపాలని, తరువాయి 12లో

## తెలంగాణ భాష, యాస కోసం సురవరం ప్రతాపరెడ్డి కృషి స్ఫూర్తిదాయకం

- నిజాం రాచరిక పాలనను కలంతో ఎదురొడ్డి నిలిచిన ధీరుడని కొనియాడిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
- డా॥ అనుమాండ్ల భూమయ్య, డా॥ సంగిశెట్టి శ్రీనివాస్‌కు సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారం ప్రదానం

ప్రజాపక్షం/హైదరాబాద్

నిజాం రాచరిక పాలనకు వ్యతిరేకంగా తన కలంతో ఎదురొడ్డి నిలిచిన ధీరుడు తెలంగాణ వైతాళికులు సురవరం ప్రతాప రెడ్డి అని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కొనియాడారు. ప్రతాప రెడ్డి చేసిన కృషి తరతరాలకు స్ఫూర్తిదాయకమన్నారు. ప్రతాప రెడ్డి కేవలం సాహితీవేత్త మాత్రమే కాదని, స్వాతంత్ర్య పోరాట యోధులని ప్రశంసించారు. సురవరం ప్రతాప రెడ్డి 129వ జయంతిని పురస్కరించుకుని 'సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పుర్కసారం –2025' ప్రదానోత్సవ కార్యక్రమం బుధవారం తరువాయి 12లో





## సిపిఐ పూర్వ వైభవానికి కంకణబద్ధులు కావాలి

## రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజునే లబ్ధిదారులకు మంజూరు లెటర్లు

03

## టిడిపి జాతీయ అధ్యక్షుడిగా మరోసారి చంద్రబాబు ఎన్నిక

**వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్‌ను నియమించాలని మహానాడులో ప్రతిపాదన**



**కడప:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరోసారి తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కడపలో జరుగుతున్న మహానాడులో రెండవ రోజు బుధవారం ఎన్నికల కమిటీ చైర్మన్ వర్ల రామయ్య టిడిపి ప్రతినిధుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. 1995లో చంద్రబాబు తొలిసారి తెలుగుదేశం పార్టీ పగ్గాలు చేపట్టగా, అప్పటి నుంచి ఇప్పటి వరకు 30 ఏళ్లుగా ఆయన ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎన్నికవుతున్నారు. ప్రతి రెండేళ్లకోసారి టిడిపి అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. ఇందులో భాగంగా తరువాయి 12లో


## యుద్ధ ప్రాతిపదికన అంగన్‌వాడీ భవనాలు పూర్తి




- అభివృద్ధికి అధికారులు తోడ్పడాలి
- రాజకీయాలు చేస్తే సహించేంది లేదు
- వయోవృద్ధుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ
- మహిళా,శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

అధికారులంతా సమన్వయంతో పనిచేసి అన్నివిధాలుగా అభివృద్ధికి తోడ్పాటు అందించాలని పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ,శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ఐడిఓసిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అధికారులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ మహిళా,శిశు,దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ పనితనాన్ని మెరుగుపరిచేందుకు ఇక్కడ ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రతీ సమస్యను పరిష్కరించేందుకు ప్రజాప్రభుత్వం సిద్ధంగా ఉందని అధికారులంతా సమన్వయంతో పనిచేసినాడే అభివృద్ధి ఫలాలు క్రింది వరకు చేరుతాయన్నారు. నిర్మాణదశలో, ఇంకా మొదలు కాని అంగన్వాడీ తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఉక్రేన్‌పై త్రైపాక్షి చర్చలకు జెలెన్‌స్కీ డిమాండ్

**కీవ్:** మరోవైపు ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ ఒక ప్రకటన చేస్తూ అమెరికా సమక్షంలో ఉక్రేన్-రష్యా మధ్య త్రైపాక్షిక సంప్రదింపులకు తగిన ఏర్పాట్లు చేయాలని డిమాండ్ చేశారు. ఉక్రేన్-రష్యా మధ్య ముఖాముఖీ చర్చకు బదులుగా రష్యా ప్రతినిధులతో కలిపి త్రైపాక్షిక సమావేశం జరగాలని ఆయన కోరారు. వారం రోజులక్రితమే ట్రంప్ పాలనాయంత్రాంగం ఒక ప్రకటన చేస్తూ, ఈసారి బహుశా జూన్‌లో జరుగుతాయనుకుంటున్న ఉక్రేన్-రష్యా చర్చల్లో రష్యా ప్రతినిధులు కూడా పాల్గొనడం ద్వారా ఇది త్రైపాక్షిక చర్చలు అవుతాయని చూచాయిగా ప్రకటించింది. ఇస్తాంబుల్‌లో చర్చలు విఫలమైన తర్వాత కొత్త పోప్ లియో-14 ఒక ప్రకటన చేస్తూ, వాటికన్‌సిటీని ఒక తటస్థకేంద్రంగా ఉపయోగించుకుని రష్యా-ఉక్రేన్ నాయకులు శాంతి చర్చలు జరపాలని ప్రతిపాదించింది. దీనిపై ఇప్పటికే పుతిన్ సానుకూలంగా స్పందించారు. ఇదిలా ఉండగా, రష్యా,ఉక్రేన్ మధ్య మరో వైపు దాడులు కొనసాగుతున్నాయి. రాత్రికి రాత్రి రష్యాలోని అన్ని ప్రాంతాలపై ఉక్రేన్ దాడులు చేసిందని, ఈ దాడుల్లో 296 ఉక్రేన్ డ్రోన్లను తాము కూల్చివేశామని రష్యా ప్రకటించింది. అదేవిధంగా రష్యా 88 డ్రోన్లతో, ఐదు బాలిస్టిక్ క్షిపణులతో తమపై దాడి చేసిందని ఉక్రేన్ ప్రకటించింది.

## బంగ్లాదేశ్‌లో బిఎన్‌పి యూత్ భారీ ర్యాలీ



**ఢాకా:** బంగ్లాదేశ్‌లో గత ఏడాది వరకూ ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) బుధవారంనాడు వేలాది మంది యువకులతో భారీ ర్యాలీ నిర్వహించింది. బిఎన్‌పి జాతీయ కేంద్ర కార్యాలయం నయాపాల్తన్ వద్ద ఆ పార్టీకి చెందిన మూడు విభాగాలు ఈ యూత్ ర్యాలీలో పాల్గొన్నాయి. దేశవ్యాప్తంగా 15 లక్షలమంది వచ్చి ఈ ర్యాలీలో పాల్గొంటారని బిఎన్‌పి ముందుగానే ప్రకటించింది. ఈ ఏడాది డిసెంబరు నుండి వచ్చే జూన్ లోపు బంగ్లాదేశ్ సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయని మహ్మద్ యూనుస్ పదే పదే ఉద్ఘాటిస్తున్న తరుణంలో ఆ దేశంలో మెల్లిగా ఎన్నికల వాతావరణం క్రమానుగతంగా పెరుగుతున్నది. వైద్య చికిత్స నిమిత్తం ఈ ఏడాది జనవరిలో లండన్ వెళ్ళిన ఖలీదాజియా ఈనెలారంభంలో స్వదేశానికి తిరిగి వచ్చారు. తిరిగి పార్టీ కార్యకలాపాలను భారీస్థాయిలో ఉద్ధృతం చేయడం ఇదే. ''యువకుల రాజకీయ హక్కుల సాధన'' అనే పేరుతో బిఎన్‌పి ఈ యూత్ ర్యాలీని నిర్వహించింది. బిఎన్‌పి అనుబంధ బంగ్లాదేశ్ జాతియోతబాదీ ఛద్ర దళ్ విద్యార్థిపార్టీ, జూబోదళ్, స్వేచ్ఛాసబక్ దళ్‌లు ర్యాలీలో పాల్గొన్నాయి. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## థర్డ్ వరల్డ్ వార్ కంటే చెడ్డ విషయం లేదు




ట్రంప్‌కు ద్మిత్రీ మెద్వెదేవ్ హెచ్చరిక

**మాస్కో :** పుతిన్ నిప్పుతో చెలగాటం ఆడుతున్నారని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో చేసిన పోస్టింగ్‌పై రష్యా మాజీ అధ్యక్షుడు, రష్యా భద్రతా మండలి డిప్యూటీ ఛైర్మన్ ద్మిత్రీ మెద్వెదేవ్ తీవ్రంగా స్పందించారు. పుతిన్ నిప్పుతో చెలగాటం ఆడుతున్నారని ఇది నిజంగా చాలా చాలా చెడ్డ విషయమని ట్రంప్ విమర్శించారు. దీనిపై మెద్వెదేవ్ స్పందిస్తూ, నిజంగా చెప్పాలంటే, ''ఈ ప్రపంచంలో మూడో ప్రపంచ యుద్ధంకంటే మించిన అతిచెడ్డ విషయం మరొకటి లేదు'' అన్నారు. ''నాకు తెలిసిన ఒకే ఒక్క చెడ్డ విషయం ఏమిటంటే, మూడో ప్రపంచ యుద్ధాన్ని మించినది మరొకటి ఉండదు, అదే నాకు తెలిసిన చెడ్డ విషయం, ఈ విషయాన్ని ట్రంప్ అర్థం చేసుకుంటారని నేను ఆశిస్తున్నాను'' అని ట్రంప్‌కు మెద్వెదేవ్ చురకలు అంటించారు. ఈమేరకు ఎక్స్ వేదికగా పోస్టింగ్ పెట్టారు.

ఉక్రేన్‌పై భారీస్థాయిలో డ్రోన్లతో దాడిచేసిన రెండు రోజులకు పుతిన్‌పై ట్రంప్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. పుతిన్‌కు పిచ్చి ఎక్కింది, ఆయన ఏం చేస్తున్నాడో ఆయన తెలుసా? అసలు పుతిన్‌కు ఏమైంది?'' అని ట్రంప్ విమర్శించారు. మంగళవారంనాడు కూడా సోషల్ మీడియా వేదికగా పోస్టింగ్ పెడుతూ, ఉక్రేన్‌తో శాంతి చర్చలను తిరస్కరించడం ద్వారా పుతిన్ నిప్పుతో చెలగాటం ఆడుతున్నారు, నిజంగా ఇది చాలా చెడ్డ విషయం, రియల్లీ బ్యాడ్, నా జోక్యం లేకుండానే రష్యాలో చాలా జరిగి ఉండేది'' అని ట్రంప్ అన్నారు. దీంతో ''నాకు తెలిసీ ఈ భూమ్మీద మూడో ప్రపంచ యుద్ధం ఒక్కటే నిజంగా చాలా చెడ్డ విషయం'' అని మెద్వెదేవ్ హెచ్చరించారు. పుతిన్ గనుక మాట వినకపోతే నా దారి నేను చూసుకుంటానని, ఇక శాంతి చర్చల్లో జోక్యం చేసుకోననీ ట్రంప్ ఇంతకుముందు అన్నారు. ఇప్పుడు ఆయన రష్యాపై కొత్తగా ఆంక్షలు విధించాలన్న యూరప్ ఒత్తిడి గురించి ఆలోచిస్తూ కొత్త పంథా తొక్కేందుకు యత్నిస్తున్నారు. ఈ దశలోనే వాటికన్‌సిటీలో చర్చల విషయం కూడా ప్రముఖంగా ముందుకు వచ్చింది.

## పుతిన్-జెలెన్‌స్కీ ముఖాముఖీ సాధ్యమే, కానీ..

రష్యా దిశగా నాటో విస్తరణ జరగకూడదని షరతు



**మాస్కో :** రష్యా అధ్యక్షుడు పుతిన్, ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ మధ్య ముఖాముఖీ సంప్రదింపుల సమావేశం సాధ్యమేననీ, కానీ వివిధ సమస్యలపై రెండు దేశాలమధ్య జరిగే చర్చల ఫలితాల ఆధారంగానే అలాంటి సమావేశం సాధ్యపడుతుందని రష్యా అధికార ప్రతినిధి ద్మిత్రీ పెస్కోవ్ చెప్పారు. పుతిన్-జెలెన్స్కీ మధ్య ముఖాముఖీ సంప్రదింపుల విషయంలో రష్యా అనుసరించే ముఖ్యసూత్రంలో ఎలాంటి మార్పూ లేదని ఆయన బుధవారంనాడు టాస్ వార్తాసంస్థకు చెప్పారు. రష్యా క్రమశిక్షణతో కూడిన పద్ధతులు పాటిస్తోందని, యుద్ధానికిగల మూలకారణాలు పరిష్కారం కావాలని కోరుతోందని అన్నారు. రెండు దేశాల ప్రతినిధులమధ్య మొదట వివిధ సమస్యలకు సంబంధించి సంప్రదింపులు జరగాలని, ఈ సంప్రదింపుల ఫలితాలనుబట్టే పుతిన్-జెలెన్‌స్కీ ముఖాముఖీ చర్చలకు అవకాశం ఉన్నదీ లేనిదీ తెలుస్తుందని చెప్పారు. అదేవిధంగా చర్చలకు సంబంధించిన వివిధ సమస్యలపై రష్యా ప్రస్తుతం తయారు చేస్తున్న మెమొరాండం పత్రాలు కొద్దిరోజుల్లో సిద్ధం అవుతాయని, ఈ ప్రక్రియ తుదిదశలో ఉందని చెప్పారు. ఈ పత్రాలలోని సారాంశాన్ని మీడియా ద్వారా బహిర్గతం చేయడం సరైన సంప్రదాయం కాదని కూడా ఆయన అన్నారు. తాము అసలు సమస్యలపై ఇంకా చర్చలు జరపలేదని, ఎలాంటి ఒప్పందాలు చేసుకోలేదని అన్నారు. ఇస్తాంబుల్‌లో మే 16న జరిగిన చర్చల్లో తదుపరి చర్చలు కొనసాగించాలని మాత్రం రెండు దేశాలూ అంగీకరించాయి. ఐతే రెండు దేశాలూ దాదాపు వెయ్యిమంది వంతున బందీలైన సైనికులను ఇచ్చిపుచ్చుకోవాలన్న అంగీకారం కుదిరింది. ఈ మేరకు ఈ అప్పగింతల కార్యక్రమం కూడా జరిగింది. కానీ కాల్పుల విరమణ శాంతి ఒడంబడిక, జరగలేదు. టంప్ మళ్ళీ ఫోన్ సంభాషణ ద్వారా మధ్యవర్తిత్వం చేశాక, బహుశా వాటికన్‌సిటీ తటస్థకేంద్రంగా రష్యా-ఉక్రేన్ మధ్య జూన్ మొదటివారంలో శాంతి సంప్రదింపులు జరిగే అవకాశం ఉందని పుతిన్ సూచనాప్రాయంగా తెలియజేశారు. ఉక్రేన్‌కు నాటో సభ్యత్వం ఇవ్వకూడదనీ, తూర్పుదిశగా నాటో విస్తరణ జరగకూడదనీ, ఉక్రేన్‌కు ఎలాంటి ఆయుధ సహాయం ఇవ్వకూడదనీ, ఆక్రమించిన భూభాగాలను స్వాధీనం చేయాలని రష్యా కోరుతున్నది. కాగా రష్యా విదేశాంగమంత్రి సెర్గీ లోవరోవ్ బుధవారంనాడు రష్యాలోని 13వ ఇంటర్నేషనల్ సమావేశంలో మాట్లాడుతూ, రష్యాకు హామీలు కుమ్మరించినప్పటికీ అందుకు విరుద్ధంగా తూర్పు దిశగా నాటో విస్తరణ కొనసాగుతోందనీ, ఉక్రేన్‌కు నాటో కూటమి సభ్యత్వం ఇచ్చేందుకు ముమ్మర యత్నాలు జరుగుతున్నాయని యూరోపియన్ యూనియన్ పరస్పర విరుద్ధంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. గతంలో సోవియట్ యూనియన్‌కు, తర్వాత రష్యాకు యూరప్,అమెరికాలు ఇచ్చిన హామీ మేరకు తూర్పు దిశగా నాటో విస్తరణ ఆగిపోవాలన్నారు.105 దేశాలకు చెందిన 129 మంది ప్రతినిధులు ఈనెల 27 నుండి 29 వరకూ జరిగే ఇంటర్నేషనల్ సమావేశంలో పాల్గొంటున్నారు.

## ట్రంప్‌కు లెఫ్ట్‌వింగ్ భయం

హార్వర్డ్‌తో ఫెడరల్ కాంట్రాక్టులు రద్దు



**వాషింగ్టన్ :** ట్రంప్ పాలనాయంత్రాంగం,హార్వర్డ్ విశ్వవిద్యాలయం మధ్య రోజు రోజుకూ వివాదం ముదిరిపాకాన పడుతున్నది. విశ్వవిద్యాలయాలలో లెఫ్ట్‌వింగ్ తిష్టవేసి కూర్చుందని ఆయన భావిస్తున్నారు. పాలస్తినా అనుకూల ఉద్యమాలు క్యాంపస్‌లలో చెలరేగినప్పుడు వాటిని యూనివర్సిటీలు అరికట్టలేకపోయాయని ట్రంప్ తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ట్రంప్ పోరాటానికి గల కారణాలలో ఇది ప్రథమకారణంగా ఉంది. దీంతో తాజాగా హార్వర్డ్ విశ్వవిద్యాలయంతో ఉన్న అన్ని రకాల ఫెడరల్ కాంట్రాక్టులను ట్రంప్ ప్రభుత్వం రద్దుచేసింది. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టులతో పాటు భవిష్యత్ సేవలకు సంబంధించిన అవసరమైన ప్రత్యామ్నాయ కాంట్రాక్టులను కూడా రద్దుచేసింది. యూనివర్సిటీతో ప్రభుత్వానికి మొత్తంమీద 100 మిలియన్ డాలర్లు విలువైన కాంట్రాక్టు ఒప్పందాలున్నాయి. దీంతో ట్రంప్,హార్వర్డ్ మధ్య వివాదం ఇంకా పేట్రేగింది. ఇప్పటికే ఈ వ్యవహారం కోర్టుకు ఎక్కింది. హార్వర్డ్‌లో తొంభైశాతం విద్యార్థులు విదేశీయులేనని, వీరిలో ఎక్కువ మంది సమస్యలు సృష్టించేవారే ఉన్నారని, వీరివల్ల అమెరికాకు సమస్యలు ఎదురవుతున్నాయని ట్రంప్ వాదిస్తున్నారు. తాను చెప్పినవిధంగా యూనివర్సిటీని తీర్చిదిద్దాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అందుకు తలొగ్గకపోవడంతో యూనివర్సిటీపై ట్రంప్ కఠిన చర్యలకు దిగారు. అమెరికాలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన అత్యంత సంపద్వంతమైన విశ్వవిద్యాలయం హార్వర్డ్ మాత్రమే. ఇప్పటికే ట్రంప్ 3.2 బిలియన్ డాలర్ల రీసెర్చ్ నిధులను స్తంభింపజేశారు. తమపై ఎవ్వరి పెత్తనాన్నీ సహించేదిలేదని యూనివర్సిటీ అధ్యక్షుడు అలన్ గార్బర్ ఇప్పటికే స్పష్టం చేశారు. బయటనుండి తమపై చేసే ఒత్తిడికి లొంగేదిలేదని, ఏం చేయాలో, ఏం బోధించాలో ఎవ్వరూ తమకు చెప్పక్కరలేదని, అలాంటి న్యాయవిరుద్ధమైన డిమాండ్లకు లొంగేదిలేదని ఆయన ట్రంప్‌కు హెచ్చరించారు.



### స్టూడెంట్ వీసాల మంజూరుకు స్తంభించిన ఆన్‌లైన్ పరిశీలన

స్టూడెంట్ వీసాలను ఆమోదించేముందుగా విద్యార్థులకు ఇచ్చే అపాయింట్‌మెంట్స్ ప్రక్రియలను నిలిపివేయాలని డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వ ప్రపంచవ్యాప్తంగా అన్ని దేశాలలో ఉన్న అమెరికా దౌత్యకార్యాలయాలకు ఆదేశించింది. అమెరికాలో చదువుకోవడానికి అప్పాయింట్‌మెంట్ కోరుతూ విద్యార్థులు దరఖాస్తులు చేసుకుంటారు. విద్యార్థుల అర్హతలు, వారి నైతికత, నడత వంటి అనేక అంశాలను దౌత్యకార్యాలయాలు ఆన్‌లైన్ ద్వారా పరిశీలన చేయడానికి అన్‌లైన్ సోషల్ మీడియాను భారీగా విస్తరించేందుకు దౌత్యకార్యాలయాకలు ప్రయత్నం చేయడంతో ఈ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేయాలని ట్రంప్ ప్రభుత్వం ఆదేశించింది. విద్యార్థుల అర్హతలను ఎంపిక చేసేందుకు సోషల్ మీడియా వేదికలను విస్తరించడంవల్ల మరిన్ని చిక్కులు ఎదురవుతాయని ట్రంప్ యంత్రాంగం భావించింది. అమెరికాలోని విశ్వవిద్యాలయాలలో విదేశీ విద్యార్థులతో సమస్యలు ఎదురవుతున్నాయన్న పేరుతో ట్రంప్ ప్రభుత్వం అమెరికాలో ఉన్న హార్వర్డ్ వంటి ప్రముఖ యూనివర్సిటీలను అణచివేతకు గురిచేస్తున్న తరుణంలో అమెరికా దౌత్యకార్యాలయాలన్నింటికీ ఈ ఆదేశాలు జారీ అయ్యాయి. క్యాంపస్‌లలో పాలస్తినా అనుకూల ఉద్యమాలు తలెత్తినప్పుడు వాటిని అరికట్టడంలో విశ్వవిద్యాలయాలు విఫలమయ్యాయని ట్రంప్ అసహనంగా ఉన్నారు.

### విదేశీ విద్యార్థులకు రక్షణ ఇవ్వాలని చైనా విజ్ఞప్తి

అమెరికా విశ్వవిద్యాలయాలలో చదువుకునే లక్షలమంది విదేశీ విద్యార్థులకు రక్షణ కల్పించాలని చైనా ప్రభుత్వం ట్రంప్‌కు విజ్ఞప్తి చేసింది. విదేశీ విద్యార్థులకు వీసాల మంజూరు విషయంలో ఆన్‌లైన్ అప్పాయింట్‌మెంట్లను నిలిపివేయాలని ట్రంప్ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో చైనా ఈ విజ్ఞప్తి చేసింది. చైనా విద్యార్థులు అమెరికాలో గణనీయంగా ఉన్నారనీ, వారితోపాటు అనేకదేశాల విద్యార్థులకు ఉన్న చట్టబద్ధమైన హక్కులను, వారి ప్రయోజనాలను కాపాడాలని దౌత్యమార్గాలలో తెలియజేసినట్లు చైనా విదేశీమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మావోనింగ్ బుధవారంనాడు మీడియాతో చెప్పారు. విద్యాపరమైన సహకారం, అకడమిక్ ఎక్స్‌ఛేంజస్‌కు ఎంత మాత్రం విఘాతం కలగకుండా చూడాలని కోరినట్లు మావోనింగ్ చెప్పారు.

## బాసర ఐఐఐటి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్జియుకెటి) బాసర ఐఐఐటి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల అయింది. 2025-26 విద్యా సంవత్సరానికి 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బిటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైనట్టు ఆర్జియుకెటి విసి ప్రొఫెసర్ వెంకటరమణ, డైరెక్టర్ ప్రొఫెసర్ సతీష్ ఒక ప్రకటన విడుదల చేశారు. నోటిఫికేషన్ వివరాలు ఇలా ఉన్నాయి.

ప్రోగ్రామ్: 6 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బిటెక్ (2 సంవత్సరాల ప్రీ యూనివర్సిటీ కోర్సు + 4 సంవత్సరాల బిటెక్). **మొత్తం 1,500 సీట్లు**...85% సీట్లు తెలంగాణ స్థానిక విద్యార్థులకు, 15% సీట్లు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకు మెరిట్ ఆధారంగా కేటాయిస్తారు. 5% సీట్లు గ్లోబల్ కేటగిరీ (ఇతర రాష్ట్రాలు, గల్ఫ్ దేశాల్లోని భారతీయుల పిల్లలు), 2% సీట్లు అంతర్జాతీయ/ఎన్ఆర్ఐ విద్యార్థులకు కేటాయిస్తారు.

**అర్హత:** 2025లో 10వ తరగతి లేదా తత్సమాన పరీక్షలో మొదటి ప్రయత్నంలో ఉత్తీర్ణత. వయసు 18 ఏళ్లు మించకూడదు. ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు 21 ఏళ్లు) 2025 డిసెంబర్ 31 నాటికి.

**ఎంపిక విధానం:** 10వ తరగతి జిపిఎ, సబ్జెక్టుల్లో వచ్చిన గ్రేడ్ల ఆధారంగా మెరిట్ ద్వారా ఎంపిక. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 0.4 డిప్రివేషన్ స్కోర్ జోడిస్తారు.

**అప్లికేషన్ వివరాలు:** ఆన్‌లైన్ దరఖాస్తులు జూన్ 1, 2025 నుంచి జూన్ 22, 2025 వరకు స్వీకరిస్తారు. టిఎస్ ఆన్‌లైన్ సెంటర్, మీసేవా లేదా వర్సిటీ వెబ్‌సైట్ www.rgukt.ac.in ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

## రూ.51 కోట్లు విడుదల (మొదటి పేజీ తరువాయి)

వ్యవసాయ శాఖ అధికారులను అదేశించారు. ఒక వైపు పంటల కొనుగోళ్ళను చేపడ్తున్న ప్రభుత్వం, పంట నష్టపోయిన రైతులను కూడా ఆదుకోవాలని, అట్టి నష్ట పరిహారాన్ని కూడా రైతుల ఎకౌంట్లలో నేరుగా జమ చేసేందుకు వీలుగా సర్వేకు ఆదేశాలివ్వగా నివేదికలు ప్రభుత్వానికి సమర్పించడమైనది. దాదాపు 29 జిల్లాల్లో 41,361 మంది రైతులకు సంబంధించి 51.528 ఎకరాలలో పంట నష్టం సంభవించిందని అధికారులు అంచనా వేయడమైనది. దీనికి సంబంధించిన రూ51 కోట్లు నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఇట్టి నిధులను సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకొని త్వరలోనే నష్టపోయిన రైతుల ఎకౌంట్లలో జమ చేయడానికి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను వ్యవసాయశాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు గారు ఆదేశించడమైనది. రాష్ట్ర వ్యాప్తంగా వరి 36,424 ఏకరాలు, మొక్కజొన్న 3,266 ఎకరాలు, జొన్న 470 ఎకరాలు, ఉద్యాన పంటలు 6,589 ఎకరాలు, ప్రత్తి 4753 ఎకరాలలు మరియు ఇతర పంటలు 477 ఎకరాలలో (ప్రాణహిత వరదల మూలంగా సంభందించిన నష్టం) పంట నష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

## నామినేటెడ్ పదవులు

(మొదటి పేజీ తరువాయి)

సమావేశమై చర్చించనున్నారు. ఈ విస్తృత స్థాయి సమీక్షల ద్వారా క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిని అంచనా వేసి, తదుపరి చర్యలకు రూపకల్పన చేయనున్నట్లు సమాచారం. మంత్రి వర్గ విస్తరణ విషయంలో మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎంఎల్ఎలు రహస్య సమావేశం కావడం, వారిలో కొంత మంది మీనాక్షి నటరాజన్‌తో ఫోన్‌లో మాట్లాడటం పార్టీలో చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో మాదిగ ఎంఎల్ఎలు తనను కలిసేందుకు ఆమె సమయం ఇచ్చారు. దీంతో వారంతా మీనాక్షి నటరాజన్‌ను కలిసి పార్టీ అభివృద్ధి, పదవుల పంపకాలపై చర్చించినట్లు పార్టీ నేతలు తెలిపారు.

## అపరేశ్ కుమార్ సింగ్

(మొదటి పేజీ తరువాయి)

కూడా వ్యవహరించారు. జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ 2023 ఏప్రిల్ 17వ తేదీన త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యలు స్వీకరించారు. కాగా ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్న తడకమల్ల వినోద్‌కుమార్ మద్రాస్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. 1964 నవంబర్ 17న జన్మించిన ఆయన ఉమ్మడి నల్లగొండ జిల్లా సూర్యాపేటలో పాఠశాల విద్యను అభ్యసించారు. అనంతరం హైదరాబాద్‌లో బిఎ, ఎల్ఎల్‌బి(ఉస్మానియా యూనివర్సిటీ) పట్టాలు పొందారు. ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్‌లో 1988లో న్యాయవాదిగా నమోదు చేసుకున్నారు. 2019 ఆగస్టు 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

**మరో మూడు హైకోర్టులకు..**

తెలంగాణతో పాటు మరో నాలుగు హైకోర్టులకు కొత్త ఛీఫ్ జస్టిస్‌లను కొలీజియం సిఫార్సు చేసింది. రాజస్థాన్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ మనీంద్ర మోహన్ శ్రీవాస్తవను మద్రాస్ హైకోర్టుకు, మద్రాస్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ కె.ఆర్.శ్రీరామన్‌ను రాజస్థాన్ హైకోర్టుకు,జార్ఖండ్ హైకోర్టు ఛీఫ్ జస్టిస్ ఎం.ఎస్.రామ చంద్ర రావును త్రిపుర హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సిఫార్సు చేసింది.

## 'నైరుతి' విస్తరణ (మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతుందని, దానికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని, ఎత్తుకు వెళ్లేకొద్దీ దక్షిణ వైపునకు వంగి ఉందని తెలిపారు. రాబోయే 24గంటల్లో ఉత్తర బంగాళాఖాతంలో వాయుగుండంగా మారే అవకాశం ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో బుధవారం తెలంగాణలోని భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. మూడు జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశామన్నారు. ఇక నిర్మల్, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగామ, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందన్నారు. గురువారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురుస్తాయన్నారు. నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్నగర్ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపారు. శుక్రవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయన్నారు. వారం రోజుల అనంతరం ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నట్లు అధికారులు చెప్పారు.

## ఎంఎస్‌పి పెంపు

(మొదటి పేజీ తరువాయి)

వర్షపాతంపై ఆధారపడే జరుగుతుందని మంత్రి చెప్పారు. ఈ మంత్రివర్గ సమావేశంలో రైతులకు ప్రయోజనం కలిగించే రెండు ప్రధాన నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుందని ఆయన చెప్పారు. వీటిల్లో ఒకటి ఖరీఫ్ పంటలకు మద్దతు ధరలు పెంచడంకాగా, రెండోది వడ్డీ రాయితీ పథకం అమలు నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. గడచిన 11 సంవత్సరాలుఆ దేశంలో వ్యవసాయ వ్యయాలు, ధరల కమిషన్ సిఫార్సుల మేరకు 14 ఖరీఫ్ పంటలకు భారీఎత్తున సామూహికంగా మద్దతు ధరలు పెంచామని ఆయన అన్నారు. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం మార్కెటింగ్ సీజన్‌లో సాధారణ, ఏ గ్రేడ్ వరిధాన్యం రకాలకు మద్దతు ధరలను క్వింటాలుకు రూ.69లు పెంచామని, తద్వారా సాధారణ రకం వరిధాన్యం క్వింటాలు ధర రూ.2,369లు, ఏ గ్రేడు రకం ధాన్యం క్వింటాలు ధర రూ.2,389గా నిర్దేశిచారు.

ఇక ఇతర తృణధాన్యాలలో రాగులకు మద్దతు ధరను రూ.596 లకు పెంచడంతో దీని క్వింటాలు ధర రూ.4,886లకు పెరిగింది. జొన్నలకు రూ.328లు మద్దతు ధర పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.3,699కు చేరింది. హైబ్రీడు రకం జొన్నల క్వింటాలు ధర రూ.3,749లకు, మొక్కజొన్న ధర రూ.175లు పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.2,400లు పెరిగింది. సజ్జలుకు రూ.150 లు పెంచారు. దీంతో సజ్జలు క్వింటాలు ధర రూ.2,775కు పెరిగింది. కందులు మద్దతును క్వింటాలుకు రూ.450లు పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.8000కు చేరింది. మినపప్పుకు మద్దతు ధర రూ.400లు పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.7,400లు పెరిగింది. పెసరపప్పు మద్దతు ధర రూ.86లు పెంచారు. దీనివల్ల పెసలు క్వింటాలు ధర రూ.8,768కు పెరిగింది. అదేవిధంగా వేరుసెనగ పంటకు రూ.480 లు మద్దతు ధర పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.7,263లు చేరుకుంది. ఇక సోయాబీన్స్‌కు రూ.436 లు పెంచడంతో దాని క్వింటాలు ధర రూ.5,329లుకు చేరింది. పొద్దుతిరుగుడుపువ్వు గింజలకు మద్దతు ధర రూ.441గా నిర్ణయించడంతో దాని క్వింటాలు ధర రూ.7,721లకు పెరిగింది. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో ఈ ధరలు చెల్లుబాటులో ఉంటాయి. అదేవిధంగా నువ్వుల మద్దతు ధర రూ.579గా నిర్ణయించడంతో దీని క్వింటాలు ధర రూ.9,846లుకు పెరిగింది. గడ్డినువ్వులకు మద్దతు ధరను రూ.820గా ప్రకటించడంతో దాని క్వింటాలు ధర రూ.9,537లు పెరిగింది. 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజనుకుగాను ఈ ధరలు చెల్లుబాటు అవుతాయి. కాగా పత్తి పంటకు మద్దతు ధరను రూ.589 పెంచారు. దీని క్వింటాలు ధర రూ.7,710 (మధ్యతరహా) పెరిగింది. పొడుగ్గా ఉండే పత్తికి మద్దతు ధరను క్వింటాలుకు రూ.8,110లు పెరిగింది.

**ఖరీఫ్ సీజన్‌లో కెసిసి రైతులకు రూ.15,640 కోట్లు వడ్డీ రాయితీ**

కిసాన్ క్రెడిట్ కార్డు (కెసిసి) కింద రైతులు తీసుకున్న స్వల్పకాలిక పంట రుణాలపై సవరించిన వడ్డీరాయితీ పథకాన్ని కొనసాగించాలని కేంద్రమంత్రివర్గం బుధవారంనాడు నిర్ణయించింది. ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో కేంద్ర ప్రభుత్వ పథకం ''మిస్'' (సవరించిన వడ్డీ రాయితీ పథకం)ను 2025-26 ఆర్థిక సంవత్సరంలో రైతులు తీసుకున్న స్వల్పకాలిక రునాలకు వర్తింపజేస్తారు. దేశంలో మొత్తం 7.75 కోట్ల కంటే ఎక్కువ సంఖ్యలోనే కిసాన్ క్రెడిట్ కార్డు (కెసిసి) అకౌంట్లు ఉన్నాయి. ఈ పథకం కింద రైతులు తీసుకున్న స్వల్పకాలిక రుణాలపై వడ్డీని 1.5 శాతం మేరకు రాయితీ ఇస్తారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వమే మినహాయించిన ఈ రాయితీ భారాన్ని భరిస్తుందని కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ సమావేశానంతరం చెప్పారు. ఈ వడ్డీ రాయితీ పథకం కొనసాగించడంవల్ల ఈ ఖరీఫ్ సీజనులో కేంద్ర ప్రభుత్వం రూ.15,640 కోట్లను భరిస్తుంది. ఈ 'మిస్' పథకం కింద కిసాన్ క్రెడిట్ ద్వారా రూ.3 లక్షల వరకూ స్వల్పకాలిక రుణం తీసుకునే రైతులకు మొత్తం 7 శాతం వడ్డీ పడుతుంది. ఇందులో 1.5 శాతం వడ్డీని కేంద్ర ప్రభుత్వం 'మిస్' పథకం కింద రైతులకు తగ్గిస్తుంది. ఒకవేళ రైతులుగనుక సకాలంలో రుణాలను బ్యాంకులకు చెల్లించేస్తే అదనంగా మరో మూడుశాతం మేరకు ప్రోత్సాహక రాయితీ పి.ఆర్.ఐ (సకాలంలో చెల్లించినందుకు ప్రోత్సాహకం) కి అర్హులు అవుతారు. ఈ విధంగా నాలుగుశాతం మేరకు రైతులకు రుణ రాయితీలు లభిస్తాయి. ప్రత్యేకించి పశుసంవర్థకం, చేపలు పెంపకంకోసం రూ.2 లక్షల వరకూ తీసుకునే రుణాలపై వడ్డీ ప్రయోజనాలు రైతులకు లభిస్తాయి.

**మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లకు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులు**

మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ రాష్ట్రాలలో రెండు మల్టీ ట్రాకింగ్ రైల్వే ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) ఆమోదం తెలియజేసింది. రూ.3,339 కోట్ల అంచనా వ్యయంతో 2029-30 సంవత్సరం నాటికి ఈ రెండు రైల్వే ప్రాజెక్టులను పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్దేశించారు. ప్రయాణికుల రైళ్ళు, సరుకు రవాణా రైళ్ళ రాకపోకలు గణనీయంగా పెరుగుతున్నందవల్ల పెరుగుతున్న రైల్వే వాణిజ్య అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టులను చేపట్టారు. రట్లమ్-నగ్దా మధ్య మూడు, నాలుగో రైల్వే లైనులు నిర్మిస్తారు. వార్ధా-బల్హార్షా మధ్య నాలుగో రైల్వే లైను నిర్మిస్తారు. ప్రధానమంత్రి గతిశక్తి జాతీయ బృహత్తర ప్రణాళిక కింద ఈ ప్రాజెక్టులను మంజూరు చేశారు. బహుళ అనుసంధాన నమూనా ప్రణాళిక కింద ఎక్కువ అవసరాలు తీరేవిధంగా ఈ రైల్లే లైనులు నిర్మిస్తారు. అటు ప్రయాణికుల రైళ్ళకుగానీ, ఇటు సరుకు రవాణా రైళ్ళ రాకపోకలకుగానీ ఎలాంటి జాప్యం, ఆటంకాలు లేకుండా ఉండేవిధంగా ఈ నిర్మాణాలు జరుగుతాయి. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలోన నాలుగు జిల్లాలలో ప్రజలకు ఈ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం ఉన్న రైల్వే వ్యవస్థలో మరో 176 కి.మీ నిడివి పెరుగుతుంది. మొత్తం 784 గ్రామాలకు, 19.74 లక్షలమంది ప్రజలకు ఈ రైల్వే ప్రాజెక్టులవల్ల ప్రయోజనం కలుగుతుంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మూడోవిడత పదవీకాలంలో ఇప్పటివరకూ దేశంలో రూ.4.50 లక్షల కోట్లు కంటే ఎక్కువ విలువైన పలు ప్రాజెక్టులకు ఆమోదాలు తెలియజేశారని మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు.

## అడ్డుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

వాస్తవం కాదా? అని బిఆర్ఎస్ పార్టీ నేతలను సిఎం రేవంత్ రెడ్డి సూటిగా ప్రశ్నించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి ఏడాదిలోనే 59 వేల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను భర్తీ చేశామని స్పష్టం చేశారు. మొదటి ఏడాదిలోనే ఇన్ని ఉద్యోగాలు భర్తీ చేసిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. గ్రూప్ 1 పరీక్షలు నిర్వహించి ఫలితాలు సైతం విడుదల చేశామన్నారు. కానీ నోటికాడి కూడును కింద పడేసినట్లు, రాజకీయ కుట్రతో నియామక పత్రాలు ఇవ్వకుండా అడ్డుకున్నారని గత ప్రభుత్వ పెద్దలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్లలో గ్రూప్ 1 పరీక్షలు కూడా నిర్వహించని పార్టీలు కోర్టులో కేసులు వేసి అడ్డుకుంటున్నారన్నారని విమర్శించారు. అందుకే ఇది సామాజిక సమస్యగా మారుతోందన్నారు. తన ఇంట్లో వాళ్లు ఒక చోట ఓడిపోతే మరోచోట పదవులు ఇచ్చుకున్నారని, విద్యార్థులకు మాత్రం ఏళ్ల తరబడి ఉద్యోగాలు దక్కకుండా చేస్తున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి వారు యువతకు ఎదురైతే ప్రశ్నించాలని యువతకు సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. సివిల్స్ మెయిన్స్‌కు ఎంపికైన వారికి రూ.లక్ష ఇచ్చి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.

**సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తిని కొనసాగించేందుకే తెలుగు వర్సిటీకి పేరు..**

తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి స్ఫూర్తిని కొనసాగించేందుకే తెలుగు యూనివర్సిటీకి ఆయన పేరు పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చెప్పారు. సురవరం ప్రతాపరెడ్డి నిజాంకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తెచ్చారని, ప్రజల కోసం పాటుపడిన వారే చరిత్రలో నిలిచిపోతారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. జవహర్ లాల్ నెహ్రూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను కాంగ్రెస్ పార్టీ కొనసాగిస్తోందన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ద్వారా ఎస్‌సి, ఎస్‌టిలను పాలకులుగా మార్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు.

**కులం వల్ల ఎవరికీ గుర్తింపు రాలేదు... చదువుతోనే గుర్తింపు వచ్చింది...**

చాలామంది మహనీయులకు గుర్తింపు తెచ్చింది కులం కాదని, చదువు మాత్రమేనని, ఉన్నత శిఖరాలకు ఎదగాలంటే చదువుతోనే సాధ్యమవుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఆత్మన్యూనత భావాన్ని వీడాలని దళితులు, గిరిజనులు, బలహీనవర్గాలకు సిఎం రేవంత్ రెడ్డి పిలుపు నిచ్చారు. వారిలోని ఆత్మన్యూనత భావాన్ని తొలగించేందుకే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దళితులు, బిసిలకు గొర్రెలు, బర్రెలు, చేప లు పెంచుకుంటూ ఉండాలన్నట్లుగా మాజీ సిఎం వ్యవహరించారని రేవంత్‌రెడ్డి విమర్శించారు. తెలంగాణ వస్తే, ఉద్యోగాలు వస్తాయని భావించిన యువత ఆశలపై నీళ్లు చల్లారని, మాజీ సిఎం తన ఇంట్లో ఉద్యోగాలు ఇచ్చుకున్నారు కానీ, రాష్ట్రంలోని పేదలకు మాత్రం ఉద్యోగాలు ఇవ్వలేదని మండిపడ్డారు. కానీ యువతకు చదువు చెప్పించి రాజ్యాధికారంలో భాగస్వాములను చేస్తామని ఎందుకు చెప్పలేదని బిఆర్ఎస్ నేతలను ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి నిలదీశారు.

**తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్...**

దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉందని సిఎం అన్నారు. సమాజంలో రుగ్మతలు, అసమానతలు తొలగించాలని ఈ సందర్భంగా విద్యార్థులకు సిఎం రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మొదటి పాతికేళ్ల వయసు వరకు బాగా చదువుకుంటేనే విద్యార్థులు జీవితంలో రాణిస్తారని అన్నారు. తప్పుదారి పడి తే కన్న తల్లిదండ్రులు తలదించుకునే పరిస్థితి ఉంటుందని, అలాంటి పరిస్థితులు ఎప్పుడూ తెచ్చుకోవద్దని విద్యార్థులకు సూచన చేశారు. కష్టపడి ఆత్మ విశ్వాసంతో రాణించి తల్లిదండ్రులకే కాదు, రాష్ట్రానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వందేళ్ల ఉస్మానియా చరిత్రలో తొలిసారిగా దళితుడిని వైస్ చాన్సలర్‌గా నియమించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని తెలిపారు. విద్యా కమిషన్ ఛైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించామని తెలిపారు. అసెంబ్లీ స్పీకర్‌గా గడ్డం ప్రసాద్ కుమార్‌ను ప్రజా ప్రభుత్వంలో ఎంపిక చేసుకున్నామన్నారు. వీరందరికీ కేవలం కులం ప్రాతిపదికన గుర్తింపు రాలేదని, చదువుకున్నారు కాబట్టే వారికి ఈ గుర్తింపు వచ్చిందని విద్యార్థులకు వివరించారు. అన్ని రంగాల్లో విద్యార్థులు, యువత రాణించాలన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మేడిగడ్డ బ్యారేజీపై ఎన్‌డిఎస్‌ఎ నివేదిక బూటకమని తేలింది

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ కె.టి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మేడిగడ్డ బ్యారేజీపై ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదిక అంతా బూటకమని, ఇప్పటిదాకా బిఆర్‌ఎస్ చెబుతున్నమాటే అక్షరాలా నిజమని తేలిపోయిందని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అన్నారు. కనీస పరీక్షలు నిర్వహించకుండా ఎన్‌డిఎస్‌ఎ తుది రిపోర్టు ఎలా ఇస్తుందని ప్రపంచ ప్రఖ్యాత నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి సూటిగా ప్రశ్నించడంతో ఈ నివేదిక తప్పులతడక అని రుజువైపోయిందన్నారు. క్షేత్రస్థాయిలో కనీస పరీక్షలు చేయకుండానే ఎన్‌డిఎస్‌ఎ ఇచ్చిన నివేదికను ఎల్ అండ్ టి పూర్తిగా తిరస్కరించడం రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారుకు, కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి పూర్తిగా చెంపపెట్టు లాంటిదే అన్నారు. ఇకనైనా పోలవరం తరహాలో పునరుద్ధరణ చర్యలు చేపట్టి తెలంగాణ రైతుల సాగునీటి కష్టాలను తీర్చాలన్నారు.



## బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాపరెడ్డి

రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి
ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, ప్రొఫెసర్లు నిత్యానందరావు, ఎల్లూరి శివారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ పోరాటం, సామాజిక స్ఫూర్తి ప్రదాత సురవరం ప్రతాపరెడ్డి అని, అంత గొప్ప వ్యక్తి పేరు తెలుగు యూనివర్సిటీకి పెట్టడం హర్షనీయమని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో బుధవారం జరిగిన సురవరం ప్రతాపరెడ్డి 129వ జయంతి సభకు డాక్టర్ చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సురవరం ప్రతాపరెడ్డి తెలుగు యూనివర్సిటీ నూతన లోగోను ఆయన ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి పేరు ఉమ్మడి రాష్ట్రంలోనే తెలుగు యూనివర్సిటీకి పెట్టాల్సిందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంతటి గొప్ప వ్యక్తి పేరు తెలుగు యూనివర్సిటీకి పెట్టడం చారిత్రాత్మకమని అన్నారు. కవి, రచయిత, ప్రముఖ సంపాదకుడు, సామాజిక వేత్త, ఎంఎల్‌ఏగా ఇలా అనేక రంగాల్లో సురవరం ప్రతాపరెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అయిన సురవరం ప్రతాపరెడ్డి గ్రంథాలయాల అభివృద్ధికి ఎంతో కృషిచేశారని డాక్టర్ చిన్నారెడ్డి అన్నారు. ప్రస్తుతం గ్రంథాలయాలు ఈ స్థాయిలో ఉన్నాయంటే సురవరం శతాబ్దం గతంలో వేసిన పునాదే కారణమన్నారు. రెడ్డి హాస్టల్స్ నిర్వహించడమే కాకుండా ఇతర సామాజిక వర్గాల హాస్టల్స్ ఏర్పాటుకు తోడ్పాటును అందించిన మహనీయుడు సురవరం అని, దళితులు, ఇతర వర్గాల అభ్యున్నతి కోసం సురవరం పాటుపడ్డారని కొనియాడారు.
కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి, తెలంగాణ సారస్వతపరిషత్ అధ్యక్షుడు ప్రొఫెసర్ ఎల్లూరి శివారెడ్డి, తెలుగు యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ వెలుదండ నిత్యానందరావు, అసిస్టెంట్ డైరెక్టర్ రామ్మూర్తి, ప్రముఖ కవి, రచయిత సంగిశెట్టి శ్రీనివాస్, సురవరం ప్రతాపరెడ్డి కుమారులు సురవరం విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.

# సిపిఐ పూర్వ వైభవానికి కంకణబద్ధులు కావాలి

ప్రజాక్షేత్రం నుంచి సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలి
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి :** కరీంనగర్ జిల్లాలో భారత కమ్యూనిస్టు పార్టీ(సిపిఐ)కి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు శ్రేణులంతా కంకణ బద్ధులు కావాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట రెడ్డిలు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా సిపిఐ 23వ మహాసభలో భాగంగా రెండో రోజు ప్రతినిధుల సమావేశం జరిగింది.
మహాసభకు నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వలు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి గత మూడేళ్లలో జిల్లాలో నిర్వహించిన పార్టీ కార్యక్రమాల కార్యదర్శి నివేదికను సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో సిపిఐకి ఘనమైన చరిత్ర ఉందన్నారు. నైజాంను గద్దెదించి ప్రజాస్వామ్యం ఏర్పాటైన తర్వాత తెలంగాణ నుంచి మొట్టమొదటి రాష్ట్ర కార్యదర్శి బద్దం ఎల్లారెడ్డి జిల్లా వాసి అని గుర్తుచేశారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ఈ జిల్లా వాసియేనని పేర్కొన్నారు. రంగు రంగుల పార్టీలు అధికారంలోకి వచ్చి మాటలకు, చేతలకు పొంతన ఉండడంలేదన్నారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ సామాజిక న్యాయం అమలు చేయడంలేదన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ శక్తుల విజృంభణ కొనసాగిస్తూ బిజెపి ప్రమాదకరంగా మారిందన్నారు. ఇప్పటివరకు రాష్ట్రంలో పెన్షన్, రుణమాఫీ పూర్తి, రైతు భరోసా, ఇందిరమ్మ ఇల్లు వంటి పథకాలు అమలుకావడంలేదన్నారు. అర్హులందరికీ ఇవ్వకుండా ఇష్టారీతిన నిబంధనలు పెట్టడం సమంజసం కాదన్నారు. ఈ విషయమై రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి పరిష్కరించాలన్నారు. పేదల పక్షపాతి సిపిఐ అని, ప్రశ్నించే గొంతుకై ప్రజా ఉద్యమాలు చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తాచాటి నిరూపించుకోవాలన్నారు. తిరగబడాలంటే కమ్యూనిస్టులాగా ఉండాలన్న భావన ప్రజల్లో కలిగిందన్నారు. కొత్త పంథాతో పడిలేచిన కెరటంలో పునరుజ్జీవంతో కమ్యూనిస్టు ఉద్యమం కొనసాగాలన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యులు పొనగంటి కేదారి, బోయిని అశోక్, కొయ్యడ సృజన్ కుమార్, అందె స్వామి, బత్తుల బాబు, గూడెం లక్ష్మితో పాటు జిల్లా వ్యాప్తంగా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా ‘పంజా’ల శ్రీనివాస్



భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కరీంనగర్ జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. కరీంనగర్‌లో 23వ జిల్లా మహాసభలో భాగంగా రెండో రోజు బుధవారం ప్రతినిధుల సమావేశంలో నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా మహాసభలో నూతన కార్యవర్గం కౌన్సిల్ ఎన్నిక జరుగగా 14 మందితో కార్యవర్గం, 35 మందితో కౌన్సిల్, ఐదుగురు క్యాండిడేట్ సభ్యులు, నలుగురు ఆహ్వానితులను మహాసభలో ఎన్నుకున్నారు. నూతన జిల్లా కార్యదర్శిగా పంజాల శ్రీనివాస్ ఎన్నికైనట్లు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ ప్రకటించారని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మర్రి వెంకటస్వామి తెలిపారు.

## రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజునే లబ్ధిదారులకు మంజూరు లెటర్లు

జిల్లా కలెక్టర్లకు డిప్యూటీ సిఎం ఆదేశం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2వ తేదీన అన్ని జిల్లాలలో రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులకు శాంక్షన్ లెటర్ల పంపిణీ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఆయా జిల్లా ఇన్‌చార్జి మంత్రులకు లబ్ధిదారుల జాబితాను సమర్పించి వారి అనుమతితో జిల్లా కలెక్టర్లు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన అన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర బిసి సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావులు బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాజీవ్ యువ వికాసం పథకం అమలు ప్రగతిని అన్ని జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. రాష్ట్రంలో నిరుద్యోగ యువత ఆశలను ముందుకు తీసుకు వెళ్లే క్రమంలో ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా భావించి రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా 5లక్షల మంది యువతకు 6 వేల 250కోట్లతో స్వయం ఉపాధి కల్పించనున్నారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామ కృష్ణారావు మాట్లాడుతూ, లబ్ధిదారులకు నిజమైన లబ్ధి చేకూరే విధంగా యూనిట్ల ఎంపిక ఉండాలని జిల్లా కలెక్టర్లకు సూచించారు. తద్వారా ఎంచుకున్న యూనిట్ల ద్వారా యువతీ యువకులకు ఆదాయ వనరుగా, లబ్ధిదారుని కుటుంబం ఆర్థికంగా బలపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకం తోడ్పడాలని సి.ఎస్ అధికారులకు సూచించారు. లబ్ధిదారులకు శిక్షణ, క్షేత్ర స్థాయిలో యూనిట్ల గ్రౌండింగ్ వరకు అధికారుల నిరంతర పర్యవేక్షణ ఉండాలని, బ్యాంకర్లతో సమన్వయం చేసుకొని ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి తో పాటు రాష్ట్ర జిడిపిలో వారిని భాగస్వామ్యం చేసే విధంగా యూనిట్ల ఎంపిక జరగాలని సి.ఎస్ సూచించారు. అదేవిధంగా వాతావరణ శాఖ విడుదల చేసిన హెచ్చరికల నేపథ్యంలో సంబంధిత జిల్లాలలో కురుస్తున్న వర్షాల పట్ల జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ముందు జాగ్రత్తలపై దృష్టి సారించాలని సి.ఎస్ అన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఎస్‌సి డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, బిసి సంక్షేమ శాఖ సెక్రెటరీ ఇ.శ్రీధర్, బిసి సంక్షేమ కమిషనర్ బాల మాయాదేవి, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్ యాస్మిన్ బాషా తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఉద్యోగులకు వంద శాతం జీతాలు చెల్లింపు

సిఎంకు, మంత్రి సీతక్కకు గిరిజన సంఘాల కృతజ్ఞతలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణా గిరిజన సహకార సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ వంద శాతం జీతాలు విడుదల చేయడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా మారుమూల గిరిజన ప్రాంతాలలో పనిచేస్తున్న ఉద్యోగులందరూ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు తరువాత పూర్తి స్థాయి జీతాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల బాధలను సానుభూతితో విని సమస్యను పరిష్కరించిన పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంతి ధనసరి అనసూయ సీతక్కకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలియజేశారు. టిజిజిసిసికి సరిపడా నిధులను కేటాయించి సంస్థ ఉద్యోగుల కుటుంబాలలో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రతి ఉద్యోగి రుణపడి ఉంటామని జిసిసి ఉద్యోగ సంఘ నాయకులు తెలియజేశారు. ఉద్యోగుల సమస్యల పట్ల పూర్తి అవగాహన ఉండి వారి వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేసిన చైర్మన్ కోట్నాక్ తిరుపతి, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా.ఎ.శరత్ ఉద్యోగులందరి తరుపున కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా సంస్థ ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సంక్షేమానికి చేపట్టే ప్రతి కార్యక్రమంలో తమ వంతు పాత్ర నెరవేరుస్తూ గిరిజనుల అభివృద్ధికి పాటు పడతామని తెలియజేసినారు. గిరిజన ఉద్యోగులందరికీ సకాలంలో జీతాలు చెల్లించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ ప్రభుత్వరంగ సమాఖ్య ప్రధాన కార్యదర్శి జిటి జీవన్ కృతజ్ఞతలు తెలిపారు.




## భారత్‌లో 2028లో 21వ ప్రపంచ గులాబీ సదస్సు

ప్రకటించిన వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ రోజ్ సొసైటీస్
జపాన్‌లో ముగిసిన 20వ ప్రపంచ గులాబీ సదస్సు తీర్మానం
సొసైటీ అధ్యక్షుడిగా సుశీల్‌ప్రకాష్ ఎన్నిక

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రపంచ సదస్సుకు భారత్ మరో వేదిక కాబోతుంది. 21వ ప్రపంచ గులాబీ సదస్సు 2028లో ఇన్‌క్రెడిబుల్ ఇండియాకు గుండెకాయ అయిన మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరుగుతుందని జపాన్‌లోని ఫుకుయామాలో ఇటీవల ముగిసిన 20వ ప్రపంచ గులాబీ సదస్సులో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ రోజ్ సొసైటీస్ (డబ్ల్యూఎఫ్‌ఆర్‌ఎస్) ప్రకటించింది. ఈ మేరకు ఈనెల 25న జపాన్‌లో జరిగిన 20వ ప్రపంచ గులాబీ సదస్సు తీర్మానించింది. ఈ సదస్సు మధ్యప్రదేశ్ భోపాల్‌లో నిర్వహిస్తామని మధ్యప్రదేశ్ టూరిజం, సాంస్కృతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శివ్‌శేఖర్ శుక్లా తెలిపారు. అంతేకాకుండా జపాన్ సదస్సుకు హాజరైన 700 మందికిపైగా అంతర్జాతీయ ప్రతినిధులు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ రోజ్ సొసైటీస్ (డబ్ల్యూఎఫ్‌ఆర్‌ఎస్) అధ్యక్షుడిగా మధ్యప్రదేశ్ పర్యటక శాఖ మాజీ అడ్వయిజర్ సుశీల్‌ప్రకాష్‌ను ఎంపిక చేయడం భారత్‌కే గర్వకారణమని శివ్ శేఖర్‌శుక్లా పేర్కొన్నారు. భారతదేశం మొదటిసారిగా ప్రపంచ గులాబీ సదస్సుకు ఆతిథ్యం కల్పించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం భారతదేశం ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సమావేశాన్ని మొదటిసారిగా నిర్వహిస్తుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా 700మందికి పైగా ప్రతినిధులను ఒకేచోటికి చేరడం తమకు గర్వంగా ఉందని టూరిజం శాఖ డిప్యూటీ డైరెక్టర్, అడ్వయిజర్ వివేక్ జూడ్ తెలిపారు. సరస్సులు, సుందరమైన ఉద్యానవనాలు ఉండడంతోభోపాల్ ఈసమావేశానికి అనువైన వేదికను అందించడానికి సిద్ధంగా ఉందన్నారు. తమ రాష్ట్రానికి చెందిన సుశీల్‌ప్రకాష్ ప్రపంచ రోజ్ సొసైటీకి అధ్యక్షుడు కావడం కూడా తమకు ఆనందంగా ఉందన్నారు.

## కాల్పుల విరమణలో ట్రంప్ పాత్రపై మోదీ వివరణనివ్వాలి

ప్రజాసమస్యల సాధనకు పోరాటం
సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ పిలుపు



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** భారత్, పాక్‌లకు వాణిజ్య ఒప్పందాలను రద్దుచేసుకుంటామని చెప్పి కాల్పుల విరమణకు ఒప్పించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనపై ప్రధాని మోదీ వివరణనివ్వాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం సిపిఐ(ఎం) జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ట్రంప్ జోక్యంతో కాల్పుల విరమణ జరగడంపై దేశప్రజలు అవమానంగా భావిస్తున్నారన్నారు. ట్రంప్ వ్యాఖ్యలను ప్రధాని మోదీ ఖండించకపోవడం సందేహాలకు తావిస్తుందన్నారు.
పహల్గాంలో ఉగ్రవాదుల దాడి విషయంలో రాజకీయాలకతీతంగా అన్నిపార్టీలు, ప్రజలు కేంద్ర ప్రభుత్వానికి ఆపరేషన్ సిందూర్ విషయంలో మద్దతునిచ్చారని గుర్తుచేశారు. దేశ, విదేశాల్లో పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల దాడిపై కేంద్రం ప్రచారం చేస్తుందని, ఇదే క్రమంలో ఈ సంఘటనపై ప్రధాని పార్లమెంటు సమావేశం నిర్వహించి ఎంపీల అభిప్రాయాలు తెలుసుకోవాలని డిమాండ్ చేశారు. పహల్గాంలో దాడిచేసిన ఉగ్రవాదులను ఒక్కరిని కూడా అరెస్ట్ చేయకపోవడం సందేహాలకు తావిస్తుందన్నారు. నీతి ఆయోగ్ సమావేశంలో భారత్ 4వ అభివృద్ధి చెందిన దేశంగా ప్రధాని మోదీ చెప్పడాన్ని జాన్‌వెస్లీ తప్పుపట్టారు. 1శాతం ఉన్న కార్పొరేట్లు 40శాతం సంపదను కలిగి వున్నారన్నారు. 50 శాతం ఉన్న పేదలచేతిలో కేవలం 3 శాతం సంపద మాత్రమే వుందన్నారు. దేశంలో 42 శాతం మంది ప్రజలు ఉండడానికి కనీస సౌకర్యాలు లేకుండా వున్నారన్నారు. 30శాతం మంది ప్రజలకు పౌష్టికాహారం లోపముందని వివరించారు. నెలకు రూ.26వేల కనీస వేతనమివ్వాలని కార్మికులు పోరాటం చేస్తున్నారన్నారు. లక్ష మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. దేశంలో ప్రజల మధ్య సంపద సమానంగా లేదన్నారు. సమాన అభివృద్ధి జరిగేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.

**ఆరుహామీలను నెరవేర్చాల్సిందే :**
ఎన్నికల్లో ఇచ్చిన ఆరు హామీలను సిఎం రేవంత్ రెడ్డి నెరవేర్చాల్సిందేనని, లేదంటే గుణపాఠం తప్పదన్నారు. ఎన్నికల్లో హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక సిఎం రేవంత్‌రెడ్డి డబ్బులు లేవని, ఏం చేయాలని మాట్లాడడం సరైంది కాదన్నారు. ప్రజా సమస్యల సాధనకు సిపిఐ(ఎం) పోరాటం చేస్తుందని, ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శనరావు, జిల్లా కార్యదర్శి జి.ప్రభాకరరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు ఎం.చుక్కయ్య, బొట్ల చక్రపాణి, వీరన్న, రాగుల రమేష్, గొడుగు వెంకట్, భానునాయక్, కాడబోయిన లింగయ్య, డి.తిరుపతి, జి. రాములు పాల్గొన్నారు.

## ప్రపంచ అందాల పోటీల ఫైనల్‌కు కౌంట్‌డౌన్

31న జరిగే కార్యక్రమానికి హైటెక్స్‌లో ఏర్పాట్లు
ఫైనల్లో పోటీపడనున్న 40 మంది అందాల భామలు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 72వ మిస్ వరల్డ్ 2025 ఫైనల్ పోటీలకు కౌంట్ డౌన్ మొదలైంది. క్వార్టర్ ఫైనల్‌కు చేరిన 40మంది అందాల భామలు ఫైనల్లో ప్రపంచ సుందరి కిరీటం కోసం పోటీపడతారు. ఇప్పటివరకు స్పోర్ట్స్ ఛాలెంజ్‌లో ఒకరు, టాలెంట్ ఛాలెంజ్‌లో ఒకరు, హెడ్ టు హెడ్ ఛాలెంజ్‌లో నలుగురు, టాప్ మోడల్ పోటీల్లో నలుగురు, బ్యూటీవిత్ ఎపర్పస్ విభాగం నుంచి నలుగురు.. మొత్తం 14 మంది విజేతలై ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో క్వార్టర్స్‌కు చేరారు. మిగతా 26మందిని అమెరికా కరేబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియాఓషియానా ఖండాలవారీగా న్యాయనిర్ణేతలు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇండోనేషియా, వేల్స్ భామలు రెండు పోటీల్లో విజేతలుగా నిలిచారు. ఆ ప్రకారం టాప్ 40లో ఇప్పటివరకు 12 బెర్తులు మాత్రమే ఖరారయ్యాయి. అంటే ఇంకా 28 మందిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. టాప్ 40లో కూడా ఒక్కో ఖండం నుంచి పది మంది ఉండేలా ఎంపిక చేస్తారు. ఆ తర్వాతి రౌండ్లో వీరిలోంచి టాప్ 20ని తీసుకుంటారు. ఒక్కొక్క ఖండం నుంచి ఐదుగురు ఉంటారు. ఇక అంతిమ ఘట్టానికి ముందు టాప్ 8 అంటే ఒక్కో ఖండం నుంచి ఇద్దర్ని ఎంపిక చేస్తారు. ఆ తర్వాత ఒక్కో ఖండం నుంచి ఒక్కొక్కరే అంటే నలుగురు అంతిమంగా కిరీటం కోసం మిగులుతారు. వీరిలో ఒకరు విజేతగా, మిగిలిన ముగ్గురు ఒకటి, రెండు, మూడో రన్నరప్ నిలుస్తారు. హైదరాబాద్ హైటెక్స్‌లో కొత్తగా నిర్మించిన నాలుగో హాల్‌లో 31న జరిగే ఫైనల్ పోటీలకు ఏర్పాట్లు చేస్తున్నారు. సైబర్ పోలీసులు, ట్రాఫిక్ విభాగం, పర్యాటక శాఖ, నిర్వాహకులు ఈ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. హాల్ సామర్థ్యం 3,500 మంది కావడంతో అంతమంది అతిథులు వస్తారనే అంచనాతో ఏర్పాట్లు, భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. ఫైనల్ వేడుకలు సాయంత్రం నుంచే మొదలవుతాయి. తుది పోటీలు రాత్రి 10 నుంచి అర్ధరాత్రి వరకు జరగనున్నాయి.

# భారీగా పట్టుబడ్డ గంజాయి

వాహన తనిఖీలో 8 క్వింటాళ్ల 30 కేజీలు పట్టివేత
సుమారు రూ.4కోట్ల 15లక్షల విలువ ఉంటుందని అంచనా
9 మందిపై కేసు నమోదు
ప్రెస్ మీట్‌లో వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్‌పి రోహిత్ రాజ్




**ప్రజాపక్షం/జూలూరుపాడు:** మండల పరిధి పడమట నర్సాపురంలో మంగళవారం నిర్వహించిన వాహన తనిఖీలో భారీగా నిషేధిత గంజాయి పట్టుబడినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సిసిఎస్ పోలీసులు, స్థానిక పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన వాహన తనిఖీలో హెచ్‌ఆర్ 55ఎ హెచ్ 7375 అను ఐసర్ వ్యాన్‌లో నాలుగు కోట్ల పదిహేను లక్షల విలువల గల, 8 క్వింటాళ్ల 30 కేజీల నిషేధిత గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులతో పాటు, అమ్మిన, కొనుగోలు చేసిన మొత్తం తొమ్మిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. పట్టుబడిన ఇద్దరు వ్యక్తులను రిమాండ్ చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. ఈ నిషేధిత గంజాయిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అల్లూరి సీతారామ రాజు జిల్లా, మోతుగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని తులసిపాక గ్రామం నుండి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, హైదరాబాద్ మీదుగా ఢిల్లీకి తరలిస్తున్నట్లు విచారణలో తేలిందని అన్నారు. గంజాయి రవాణాకు ఉపయోగించిన ఐసర్ వ్యాన్‌తో పాటు, రెండు మొబైల్ ఫోన్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాను సమర్థవంతంగా అడ్డుకుని నిందితులను చాకచక్యంగా పట్టుకున్న జూలూరుపాడు సిఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్‌ఐ బి.రవి, సిసిఎస్ ఇన్స్పెక్టర్ రమాకాంత్, ఎస్‌ఐలు ప్రవీణ్, సిబ్బందిని ఎస్పీ రోహిత్ రాజ్ ప్రత్యేకంగా అభినందించారు. యువత ఈజీ మనీకి అలవాటుపడి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## న్యాయవాది ప్రతాప్‌పై దాడిని ఐఎఎల్ ఖండన

**హైదరాబాద్ :** సూర్యాపేట జిల్లా తుంగతుర్తికి చెందిన న్యాయవాది బానోత్ ప్రతాప్ కుటుంబంపై దాడిని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) తీవ్రంగా ఖండించింది. కుటుంబం భూమి సమస్య విషయంలో ప్రత్యర్థులు పట్టపగలే బానోత్ ప్రతాప్‌పై దాడి చేసి, కాలును విరగొట్టడమే కాకుండా, ఆయన తండ్రి తలను గాయపరచడం శోచనీయమని పేర్కొంది. ఆ భూమి విషయంలో కోర్టు నుంచి ప్రత్యర్థులపై న్యాయవాది ప్రతాప్ కుటుంబం ఇంజక్షన్ ఆర్డర్‌ను పొందిందని, అందులో వారి కుటుంబానికి పోలీసు రక్షణ ఇవ్వాలని కూడా ఉందని తెలిపింది. అయినప్పటికీ వారి ప్రత్యర్థులు బెదిరించిన విషయాన్ని పోలీసులకు దృష్టికి తీసుకెళ్ళి పోలీసులు ప్రొటెక్షన్ ఆర్డర్స్‌ను అమలు చేయాలని కోరినా సరైన చర్య తీసుకోకపోవడంతో ప్రత్యర్థులు దాడికి పాల్పడి తీవ్రంగా గాయపరిచారని ఐఎఎల్ వివరించింది. కోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ న్యాయవాదిపై ఇలాంటి దాడి చేయడం న్యాయవ్యవస్థపై విశ్వసనీయత దెబ్బతీస్తుందని, పోలీసుల నిర్లక్ష్యం సహించరానిదని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠినంగా శిక్షించాలని ఇండియాన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మగాని ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను పరిగణలో తీసుకొని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తక్షణమే అడ్వొకేట్స్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకురావాలని కోరారు. న్యాయవాది బానోత్ ప్రతాప్‌పై దాడి సంఘటన తెలిసిన వెంటనే, వారి కుటుంబాన్ని సూర్యాపేట జిల్లా ఐఎఎల్ అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, సీనియర్ న్యాయవాది సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదరి తొగట్టి మురళి, సహాయ కార్యదర్శి రాజారామ్, తదితరులు పరామర్శించారు.

ప్రజాపక్షం
గురువారం, మే 29

# ఎంఎస్‌పికి చట్టబద్ధత ఎప్పుడు?

కేంద్ర ప్రభుత్వం 2025–26 ఖరీఫ్ సీజన్‌కు 14 పంటల కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి)ను ఎంతోకొంత పెంచుతూ షరా మామూలు నిర్ణయం తీసుకుంది. స్థూలంగా చూస్తే, ఈ నిర్ణయం రైతులకు మేలు చేస్తుందని అనిపిస్తుంది. కానీ, ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించే విషయంలో మోదీ సర్కారు దాటవేత ధోరణిలో మార్పులేకపోవడం దుర్మార్గం. ఢిల్లీ సరిహద్దుల్లో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ రైతులు సుమారు ఏడాదిపాటు కొనసాగించిన ఉద్యమానికి తలవంచిన ప్రభుత్వం, గత్యంతరం లేని పరిస్థితుల్లో మూడు వివాదాస్పద సాగు చట్టాలను రద్దు చేసింది. ఎంఎస్‌పికి చట్టబద్ధతసహా రైతులు చేసిన పలు డిమాండ్లను పరిష్కరించడానికి హామీ ఇచ్చింది. ఇది జరిగి సుమారు నాలుగేళ్లు కావస్తున్నా, ఇప్పటికీ అమలు కాలేదు. రైతుల డిమాండ్లలో ప్రధానమైన ఎంఎస్‌పికి చట్టబద్ధత అంశం ఎప్పుడు తెరపైకి వచ్చినా, మోదీ ప్రభుత్వం 'ఆ ఒక్కటీ అడక్కు' అన్న చందంగానే వ్యవహరిస్తున్నది. రైతులతో చర్చలు జరపడంలో, వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్రం విఫలమైందని సుప్రీం కోర్టు విమర్శించినప్పటికీ ఫలితం లేదంటే, రాజ్యాంగం పట్ల, వ్యవస్థల పట్ల పాలక బిజెపికి ఉన్న గౌరవం ఏపాటిదో స్పష్టమవుతోంది. నల్ల వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన తర్వాత, 2021లో ఇచ్చిన వాగ్దానాల ఆధారంగా పంటలపై ఎంఎస్‌పికి చట్టపరమైన హామీని రైతాంగం ఆశించింది. కానీ, హామీని కేంద్రం అటకెక్కించింది. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమనాలతో ముందుకు వెళుతున్నదే తప్ప, శాశ్వత పరిష్కారాన్ని చేపట్టడం లేదు. వ్యవసాయాన్ని కూడా కార్పొరేట్‌పరం చేయడమే బిజెపి సర్కారు లక్ష్యమని, అందుకే ఎంఎస్‌పిని నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నా స్పందన లేదు. వ్యవసాయం కంటే పారిశ్రామిక రంగానికి అధిక ప్రాధాన్యం ఇచ్చే విధానాలను రైతులు నిరసిస్తూనే ఉన్నారు. మరోవైపు, రెండేళ్లలో రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని ఘనంగా ప్రకటించి, మొదటిసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం, దశాబ్దకాలం గడచినా చేసింది శూన్యం. ఎంఎస్‌పికి చట్టబద్ధత లేకపోవడంతో, ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రకటించే పెంపు వల్ల ప్రధాన పంటలు పండించని ప్రాంతాల్లో రైతులకు లాభం చేకూరదు. ఉత్పత్తి వ్యయంపై 50 శాతం లాభ మార్జిన్ ఉండాలని స్వామినాథన్ కమిషన్ నివేదికలో చేసిన సూచనకు అర్థం లేదు. లాజిస్టికల్ సవాళ్లు, సేకరణకు అయ్యే అధిక ఖర్చును పేర్కొంటూ ఎంఎస్‌పికి చట్టబద్ధత సాధ్యం కాదన్నది మోదీ సర్కారు వాదన. ఇదే నిజమైతే, రైతులకు హామీ ఎందుకిచ్చినట్టు? వరి, రాగులు, పత్తి, నువ్వులు.. ఇలా వివిధ పంటలకు ఎంఎస్‌పిని పెంచడంతోనే రైతుల సమస్యలు తీరుతాయా? వారి ఉద్యమానికి, సుమారు వేయిమంది రైతుల ప్రాణత్యాగానికి న్యాయం జరుగుతుందా? ఎంఎస్‌పికి చట్టబద్ధత కల్పించడానికి కేంద్ర బూచిగా చూపిస్తున్న ఆహార ద్రవ్యోల్బణం, బడ్జెట్ పరిమితులు సాకులు మాత్రమే. నిజంగానే రైతులకు న్యాయం చేయాలంటే, ఎంఎస్‌పిసహా రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలి. అప్పుడే, లాభం ఎలావున్నా, నష్టాల ఊబిలో చిక్కుకోరు. ఎప్పటికప్పుడు మారిపోతున్న మార్కెట్ ధరకంటే.. నిర్దిష్ట కనీస ధర ఉంటే, రైతు భవిష్యత్తును ఊహించగలుగుతాడు. వ్యవసాయంలో పెట్టుబడులకు ప్రోత్సాహం లభిస్తుంది. మార్కెట్‌లో ధరలు పడిపోతే, కొనుగోలు చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. రైతులకు అంతర్గత రక్షణ లభిస్తుంది. ఖర్చులు తిరిగి వస్తాయన్న నమ్మకం కలుగుతుంది. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకులతో సంబంధం ఉండదు. మధ్యవర్తుల బెడద తగ్గుతుంది. కోవిడ్ తర్వాత తలెత్తిన పరిణామాల నేపథ్యంలో, అస్థిరమైన ఆదాయం ఎంతోమంది రైతులను నష్టాలపాల్జేస్తున్నది. ఆత్మహత్యలకు పురిగొల్పుతున్నది. ఎంఎస్‌పికి చట్టబద్ధత వల్ల ఆ సమస్యకు కొంతలో కొంతైనా పరిష్కారం లభిస్తుంది. కష్టపడి పండించిన పంటకు, తగిన ప్రతిఫలం పొందే హక్కు రైతుకు ఉంటుంది. కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయడం అనేది రైతుల సురక్షిత భవిష్యత్తుకు పెట్టిన తొలి మెట్టు. ఇది కేవలం ధర స్థిరీకరణకే కాదు, రైతు జీవన ప్రమాణాల అభివృద్ధికి, వ్యవసాయ రంగ సమగ్ర వికాసానికీ ఆధారం అవుతుంది కూడా. రైతు కేవలం ముడిసరుకు ఉత్పత్తి చేసే యంత్రం కాదనే విషయాన్ని మోదీ సర్కారు తెలుసుకోవాలి. అతని శ్రమను గుర్తించాలి... గౌరవించాలి. న్యాయమైన మద్దతు ధర ఇవ్వాలి. మార్కెట్ ఒడిదొడుకులనుంచి రైతులకు రక్షణ కల్పించటానికి ఎంఎస్‌పికి చట్టబద్ధత అత్యవసరం.

## రష్యా, ఇరాన్‌ను దూరం చేసేందుకు

# సిరియాతో అమెరికా మైత్రి

**అసద్ మీర్జా**

అమెరికా విదేశాంగ విధానంలో గణనీయమైన మార్పును సూచిస్తూ ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సిరియాపై దీర్ఘకాలంగా ఉన్న ఆంక్షలను సడలిస్తున్నట్లు ప్రకటించారు. ఇది యుద్ధంతో దెబ్బతిన్న ఆ దేశానికి , విస్తృత మధ్య ప్రాచ్యానికి ఒక కీలకమైన మలుపు. ఈ నిర్ణయం అధ్యక్షుడు మధ్య ప్రాచ్య పర్యటన, పట్టపు యువ రాజు మహమ్మద్ బిన్ సల్మాన్‌తో చర్చల సమయంలో వెలువడింది.

సౌదీ క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ (ఎంబిఎస్) చొరవ మేరకు సిరియా తాత్కాలిక అధ్యక్షుడు అహ్మద్ అల్–షరా (గతంలో అబు మొహమ్మద్ అల్–గోలానీగా సుపరిచితుడు), అధ్యక్షుడు ట్రంప్ మధ్య జరిగిన సమావేశం జరిగినట్లు భావిస్తున్నారు. దీని తరువాత ట్రంప్ సిరియాపై ఆర్థిక ఆంక్షలను తొలగించినట్లు అకస్మాత్తుగా ప్రకటించారు. ఇది ఈ ప్రాంతంలో స్థిరత్వం, ఆర్థిక పునరుద్ధరణను పెంపొందించడానికి ఒక వాస్తవిక విధానాన్ని ప్రతిబింబిస్తుంది.

ఇది ఊహించని విధంగా జరిగినప్పటికీ, ఈ ఆంక్షలను అమెరికా స్వయంగా 1979లో విధించింది. అప్పుడు అది హిజ్బుల్లా వంటి సమూహాలకు మద్దతునివ్వడం, లెబనాన్‌లో దాని సైనిక కార్యకలాపాలను పేర్కొంటూ సిరియాను 'తీవ్రవాదాన్ని పోషించే దేశం'గా ప్రకటించింది.

2004లో సిరియా జవాబుదారీతనం, లెబనీస్ సార్వభౌమాధికార పునరుద్ధరణ చట్టం కింద తదుపరి ఆంక్షలు విధించబడ్డాయి. ఇవి సిరియా సామూహిక విధ్వంస ఆయుధాలను తయారు చేస్తున్నదని, పొరుగున ఉన్న ఇరాక్‌లో జోక్యం చేసుకుంటున్నదనే ఆరోపణలతో సిరియాను లక్ష్యంగా చేసుకున్నాయి. అత్యంత కఠినమైన చర్యలు 2011లో వచ్చాయి. అసద్ పాలన శాంతియుత నిరసనకారులపై క్రూరమైన అణచివేతకు ప్రతిస్పందనగా 2019 నాటి సీజర్ సిరియా పౌర రక్షణ చట్టానికి దారితీసింది. ఇది యుద్ధ నేరాలకు ప్రభుత్వాన్ని జవాబుదారీగా ఉంచాలని లక్ష్యంగా పెట్టుకుంది.

తాజా ఆంక్షల సడలింపు సిరియా, దాని కొత్త నాయకుడికి దేశాన్ని పునర్నిర్మించడానికి, అంతర్జాతీయ సమాజంలో తిరిగి కలిసిపోవడానికి ఒక మార్గాన్ని అందించవచ్చు. బషర్ అల్–అసద్ పాలన 2024 డిసెంబర్‌లో పతనమైన తరువాత సిరియా ఒక కొత్త శకాన్ని ప్రారంభించింది. అహ్మద్ అల్–షరా గత సంబంధాలపై ఆందోళనలు వ్యక్తమైనప్పటికీ, ఆయన తన మిలిటెంట్ గతాన్ని దూరం చేసుకోవడానికి, సిరియాను పునర్నిర్మించడానికి కట్టుబడి ఉన్న ఒక రాజనీతిజ్ఞుడిగా తనను తాను ప్రదర్శించుకోవడానికి గట్టి ప్రయత్నాలు చేశాడు. ఆయన మొదటి దౌత్యపరమైన ప్రయత్నం సౌదీ అరేబియాకు, అయన భార్యతో కలిసి మక్కా సందర్శనకు వెళ్ళడం ద్వారా జరిగింది. ఈ పర్యటన ఇరాన్‌కు వ్యతిరేకంగా, అరబ్‌లతో చేతులు కలిపేందుకు సిరియా ఆకాంక్షకు, మరింత ఉదార రూపంలో ఇస్లాంను, పాలనను అందించాలనే ఆకాంక్షకు సంకేతాలిచ్చింది.

నేడు ప్రపంచ దేశాల దృష్టి సిరియాపై ఉండడానికి వేల సంవత్సరాలుగా దాని వ్యూహాత్మక స్థానమే కారణం. సిరియా ప్రభుత్వాన్ని నియంత్రించడానికి జరిగే పోటీ ఫలితం ఆధారంగా రాబోయే సంవత్సరాలలో లెవాంట్, విశాల మధ్య ప్రాచ్యంలో ఆవిర్భవిస్తున్న రాజకీయ ధోరణులు ఉంటాయి. సిరియాకు ఉన్న ప్రత్యేక స్థానం, స్థితి దృష్ట్యా ఆ దేశంపై అధికారం, ప్రభావం కోసం దేశీయ, ప్రాంతీయ, ప్రపంచ శక్తులు పోటీ పడుతున్నాయి. సిరియా వారసత్వంగా అరుదైన సంపూర్ణ, సంభవాత్మక అరబ్ దేశం. దాని మానవ, సహజ వనరులు, వ్యూహాత్మక భౌగోళిక ప్రాంతంతో పాటు మధ్యప్రాచ్యం , ప్రపంచంతో రాజకీయ, సాంస్కృతిక, జాతి సంబంధాలు అన్నీ ఇందుకు కారణాలు.

అర్ధ శతాబ్దం నిరంకుశ పాలన, 13 సంవత్సరాల యుద్ధం తర్వాత నేడు సిరియా శిథిలావస్థలో ఉన్నప్పటికీ, వందలాది మంది దౌత్యవేత్తలు, వ్యాపారవేత్తలు, పౌర కార్యకర్తలు, అవకాశవాదులకు ఆతిథ్యం ఇస్తుంది. ఇది కొత్తేమీ కాదు. క్రీస్తు పూర్వం మూడవ సహస్రాబ్దిలో డమాస్కస్, అలెప్పో ఉత్పాదక, శక్తివంతమైన, వ్యూహాత్మక పట్టణ కేంద్రాలుగా ఆవిర్భవించినప్పటి నుండి గడిచిన 5,000 సంవత్సరాలుగా సిరియా ప్రపంచానికి తన వంతు సహకారాన్ని అందిస్తోంది. చారిత్రాత్మకంగా సిరియా నేల, అక్కడి ప్రజలు నిరంతరం జ్ఞానం, విలువలతో కూడిన వ్యవస్థలు సృష్టించారు. ఆహారం, సంపద, సంస్కృతి, సాంకేతికత, అస్థిత్వాలను సృష్టించడం ద్వారా వారి భూమిని ఒక వ్యూహాత్మక, ఆకాంక్షల ప్రపంచ కూడలిగా మార్చారు.


ఫైసల్ జె అబ్బాస్ అరబ్ న్యూస్‌లో రాసిన వ్యాసంలో చాలా సముచితంగా అభిప్రాయపడినట్లుగా, వాస్తవానికి, ఆంక్షలను సడలించడానికి అమెరికా నిర్ణయం గత చర్యలకు ఆమోదంగా చూడకూడదు. అది వేగంగా మారుతున్న చలనశీలతకు గుర్తింపు. అమెరికా, సౌదీ అరేబియా, ఇతర మధ్యప్రాచ్య దేశాలు సిరియాను పునర్నిర్మించడంలో సహాయపడటం, ఫలితంగా ఆ దేశాల ప్రభావ పరిధిని విస్తరించగల భవిష్యత్తుపై ఒక పందెం. ఈ దాతృత్వం వెనుక ఉన్న ప్రధాన కారణం సిరియాను దాని పాత మిత్రదేశాలు అంటే రష్యా, ఇరాన్ నుండి దూరంగా ఉంచడం.

అసద్ పాలన అణచివేత విధానాలు, ఆ ప్రాంతంలో అస్థిరపరిచే దాని పాత్రకు వ్యతిరేకంగా పశ్చిమ ఆంక్షలు ప్రధానంగా ఉద్దేశించాయి. ఆ పాలన పతనంతో ఆ ఆంక్షలను కొనసాగించడమంటే సిరియా ప్రజల శాంతి, శ్రేయస్సు ఆకాంక్షలను అడ్డుకోవడమే అవుతుంది.

అంతేకాకుండా, అల్–షరా ఒక సమ్మిళిత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి, మైనారిటీ హక్కులను గౌరవించడానికి, ప్రాంతీయ స్థిరత్వానికి అవకాశం కల్పించే విధంగా విశాల లక్ష్యం అనే ఆకాంక్షతో పునర్నిర్మాణ ప్రయత్నాలపై దృష్టి పెట్టడానికి కట్టుబడినట్లు చాటుకున్నాడు.

ఏళ్ళ తరబడి సంఘర్షణ, ఆంక్షలతో సిరియా ఆర్థిక వ్యవస్థ ధ్వంసమైంది. 90 శాతం మంది ప్రజలు పేదరికంలో జీవిస్తున్నారు. ఆంక్షలు ఎత్తివేయడం అంతర్జాతీయ పెట్టుబడులు, సహాయం, కీలక మౌలిక సదుపాయాల పునర్నిర్మాణానికి తలుపులు తెరుస్తుంది.

అరబ్ దేశాలతో నూతన పాలకుడు అల్–షరా చేసిన మైత్రి, ఇరాన్, రష్యా వంటి పూర్వ మిత్రదేశాల నుండి సిరియాను దూరం చేయడానికి చేసిన ప్రయత్నాలు,అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు దోహదపడే పునఃమార్పులకు అవకాశాలను సూచిస్తున్నాయి. అయితే, సిరియాపై ఆంక్షల సడలింపు అనేది ఒక సంక్లిష్ట పరిస్థితికి వాస్తవిక వైఖరిని సూచిస్తున్నదనేది ఒక కచ్చితమైన వాస్తవం. ఇది సిరియా రాజకీయ రంగంలో సంభవించిన పరివర్తనాత్మక మార్పుల ను గుర్తించింది. దేశం పునర్నిర్మించడానికి, అంతర్జాతీయ సమాజంలో తిరిగి కలిసిపోవడానికి ఒక మార్గాన్ని అందిస్తుంది. సంఘర్షణ, ఆర్థిక నిరాశ లేని భవిష్యత్తుపై సిరియా ప్రజలకు ఇది ఆశను కలిగిస్తుంది. ఈ ప్రాంతానికి, ప్రపంచానికి, స్థిరత్వాన్ని పెంపొందించడానికి,తీవ్రవాద ప్రభావాలను ఎదుర్కోవడానికి ఇది ఒక అవకాశాన్ని అందిస్తుంది.




> అరబ్ దేశాలతో నూతన పాలకుడు అల్–షరా చేసిన మైత్రి, ఇరాన్, రష్యా వంటి పూర్వ మిత్రదేశాల నుండి సిరియాను దూరం చేయడానికి చేసిన ప్రయత్నాలు, అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు దోహదపడే పునర్మార్పులకు అవకాశాలను సూచిస్తున్నాయి. అయితే, సిరియాపై ఆంక్షల సడలింపు అనేది ఒక సంక్లిష్ట పరిస్థితికి వాస్తవిక వైఖరిని సూచిస్తున్నదనేది ఒక కచ్చితమైన వాస్తవం.

# జూన్ 2 పై ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆశలు

తెలంగాణ అవతరణ దినోత్సవం జూన్ రెండో తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి వరాలు కురిపిస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు అయిదు డి.ఎ లు పెండింగ్‌లో ఉన్నాయి. పిఆర్‌సి గడువు ముగిసి సంవత్సరం ఆరు నెలలు గడిచింది. ఎంతోకాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు, పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు నగదు రహిత ఆరోగ్య కార్డులను మంజూరు చేయాలని కోరుతుంటే అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నారు. తెలంగాణ అవతరణ దినోత్సవం నాడు నగదు రహిత ఆరోగ్య కార్డులను మంజూరు చేస్తారని, డి.ఎలను మంజూరు చేస్తారనే ప్రచారం సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఉద్యో గ, ఉపాధ్యాయులు ఏ ఇద్దరు కలిసిన డి.ఎల గురించి, నగదు రహిత ఆరోగ్య కార్డుల గురించి మాట్లాడుకోవడం కనిపిస్తుంది.



ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంకోసం రాష్ట్ర ప్రభుత్వం మంత్రి వర్గ సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసి ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో, ప్రతి నిధులతో సమావేశాలు ఏర్పాటు చేసి ముఖ్యమైన 57 సమస్యలపై చర్చలు జరిపింది. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో, శాసన మండలి సభ్యులతో (ఎం.ఎల్.సి ) లతో చర్చించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి సమస్యలన్నింటికీ పరిష్కారం లభిస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

మంత్రివర్గ ఉపసంఘం హామీ ఇవ్వడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఉద్యమాలు, పోరాటాలు చేయాలనుకున్న వారు వాయిదా వేసుకున్నారు. జూన్ రెండో తేదీన ఉద్యోగ, ఉపాధ్యాయులకు తీపి కబురు వస్తుందని ఆశతో వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం 2004 సెప్టెంబర్ 1 నుంచి కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌ను అమలుచేసి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెన్షన్ సౌకర్యం లేకుండా చేసింది. పెన్షన్ ఉంటే పదవీ విరమణ చేసిన తర్వాత వృద్ధాప్యంలో టెన్షన్ ఉండదని ఉద్యోగ, ఉపాధ్యాయులు కేంద్ర, రాష్ట్ర మంత్రులను కలిసి అనేక సార్లు వినతి పత్రాలను సమర్పించారు.

ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ గెలిస్తే సి.పి.ఎస్ రద్దు చేసి పెన్షన్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ అమలుకోసం ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశతో ఎదురు చూస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు వేసవిలో చేసేటట్లు మార్గదర్శకాలు జారీ చేయాలని తెలంగాణ రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులు కోరుతున్నారు.

గత ప్రభుత్వంలో కోర్టు కేసులతో పెండింగులో ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులు రేవంత్ సర్కార్ పరిష్కరించి భాషోపాధ్యాయులకు, పిఇటిలకు, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులు కల్పించింది. పదోన్నతులు కల్పించిన ప్రభుత్వం కౌన్సెలింగ్ ద్వారా కొత్త పాఠశాలలు కేటాయించింది. ఈ వేసవి సెలవుల్లో ఉపాధ్యాయుల బదిలీలలో జీరో సర్వీస్ కింద పరిగణించి పదోన్నతులు పొందిన ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని కోరుతున్నారు. గత ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలోని పది జిల్లాలను ముప్పై మూడు జిల్లాలుగా ఏర్పాటుచేసి జిఒ 317 తెచ్చి ఉద్యోగ, ఉపాధ్యాయులను దూరదూర ప్రాంతాలకు బదిలీ చేసింది. అనేకమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు స్థానిక జిల్లాలను వదిలి వేరే జిల్లాల్లో ఉద్యోగాలు చేయాల్సి వస్తుంది. స్థానికులను స్థానికేతరులుగా మార్చిన జీ.వో 317 రద్దు చేయాలని హైకోర్టును అనేక మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆశ్రయిస్తే మానవత దృక్పథంతో పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. మానవతా దృక్పథంతో జిఒ 317 బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయలను వారి స్వంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరుతున్నారు.

డాక్టర్. ఎస్.విజయ భాస్కర్,
9290826988

# మానసిక వైకల్య బాధితులకు ఆర్‌టిసి ఉచిత ప్రయాణం కల్పించాలి

లేఖ

భారత పార్లమెంట్ ద్వారా ప్రజల హక్కులను కాపాడటానికి చట్టాలు రూపొందించబడినవి. వీటిలో కార్మికులు స్త్రీలు, బాలలు, వృద్ధులకు ప్రత్యేక హక్కులు కల్పించబడినవి. వికలాంగుల హక్కుల చట్టం ప్రకారం సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవం, వివక్షత నిరోధించడానికి 'వికలాంగుల హక్కుల చట్టం–2016ను పార్లమెంట్ ఆమోదించగా 19, ఏప్రిల్ 2017 అమలులోకి వచ్చింది. ఈ చట్టం ప్రకారం అంధత్వం, దృష్టి లోపం, కుష్టు, వినికిడి లోపం, చలనం లేని వైకల్యం, మానసిక వైకల్యం, మానసిక అనారోగ్యం లాంటి లోపాలు గుర్తించబడినవి. ఈ లాంటి లోపాలు ఉన్న వ్యక్తులకు ప్రభుత్వాలు, ప్రభుత్వ సంస్థలు వారికి సమాజంలో ప్రత్యేక గుర్తింపు కల్పించే బాధ్యత కలదు. 2014 సంవత్సర ఒక నివేదిక ప్రకారం తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12.2% వికలాంగుల సంఖ్య ఉందని ఒక అంచనా. వికలాంగులు మానసికంగా కృంగిపోకుండా వారి మనో వికాసం కొరకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక పునరావాసం కొరకు పింఛన్, ఇతరులపై ఆధార పడకుండా ఉన్నత విద్యలో రిజర్వేషన్లు, రైలు, బస్సులలో ప్రత్యేక రాయితీలు, బ్యాంక్, పోస్ట్ ఆఫీసులు నందు ప్రత్యేక క్యూ లైన్ వసతి కల్పించింది.వికలాంగులు అనగానే ప్రజల మనస్సులో తళుక్కున మెరిసేవారు అంధులు, బధిరులు మాత్రమే. పుట్టుకతో కొంతమంది మానసికంగా శారీరక ఎదుగుదల లేనివారు సమాజం, కుటుంబంలో ఆదరణ లేక ఇతరులకు చెప్పుకోలేని స్థితిలో జీవిస్తున్నారు. ఇలాంటి వారిని ప్రభుత్వం, ప్రభుత్వ సంస్థలు గుర్తించి వారికి అవకాశాలు కల్పిస్తున్నాయి. మానసిక వికలాంగులలో మానసిక వైఫల్యం, మానసిక అనారోగ్యం అనే రెండు రకాలు. వీటిలో మానసిక వైఫల్యం పుట్టుకతో వచ్చేది. రెండవది వారు జీవించే స్థితిలో ఉంది. నేడు ఎక్కువగా మానసిక అనారోగ్యంతో బాధపడుతున్నారు. చదువుల కొరకు తల్లిదండ్రులు, విద్యాసంస్థల ఒత్తిడి, ప్రేమ వైఫల్యం, నిరుద్యోగం, పేదరికం, ఐ.టి రంగాల్లో పనిభారం, మాదక ద్రవ్యాల సేవనం, రోడ్డు, రైలు ప్రమాదాల వలన కూడా మానసిక అనారోగ్యం పాలై ఎటువంటి గుర్తింపు, ఆదరణ లేక జీవచ్ఛవాలుగా జీవిస్తున్నారు. వీరికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎటువంటి సౌకర్యాలు లభించుట లేదు. రైల్వేలలో అన్ని రకాల వికలాంగులతో పాటు వారి అనుచరులకు కూడా రాయితీలు కల్పిస్తున్నారు.

తెలంగాణా రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సులలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, విద్యార్థుల కు వికలాంగులకు, విలేకరులకు, బస్‌పాసులు ఇస్తూ రాయితీలు ఇస్తుంది. నగరాల్లో ఉన్న మానసిక వ్యాధి నిపుణుల వద్దకు మానసిక రోగులు చికిత్స కొరకు రావడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. వీరి ప్రయాణ నిమి త్తం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బస్సుల్లో పాసులు, రాయితీలు లేవు. పార్లమెంట్ ఆమోదించిన వికలాంగుల చట్టం–2016 ప్రకారం మానసిక అనారోగ్యంతో బాధపడే వారికి రాయితీలు ఇవ్వాలి.

పార్లమెంట్‌లో ఆమోదించిన చట్టాలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఖచ్చితంగా అమలు పరచాలి. కావున తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నడిపే బస్సులలో మానసిక వైకల్యం గల వారితో పాటు మానసి క అనారోగ్యంతో బాధపడే వారికి కూడా ప్రత్యేక పాసులు, రాయితీలు వారిని ఆదుకోవాలి.

ఎ.వి. మాధవ్ 8686051752,

# రాజస్థాన్ కోటలో ఎందుకీ ఆత్మహత్యలు!

రాజస్థాన్ నడిబొడ్డున ఉన్న కోట నగరం దశాబ్దాలుగా లక్షలాది యువత ఆశయాలకు నిలయంగా మారింది. భారతదేశ 'కోచింగ్ రాజధాని'గా పేరొందిన ఇది ఐఐటి, ఎయిమ్స్ వంటి అత్యంత ప్రతిష్టాత్మక ఇంజనీరింగ్ మెడికల్ కళాశాలల్లో ప్రవేశానికి సువర్ణ మార్గం అందిస్తుందని వాగ్దానం చేస్తుంది. అయితే ఈ విద్యాపరమైన ఆశల వెనుక భయంకరమైన వాస్తవం ఉంది. ఇక్కడ విద్యార్థుల ఆత్మహత్యల నిరంతర ప్రవాహంగా మారింది. 2023లో నగరంలో 26 విద్యార్థి ఆత్మహత్యలు, 2025లో ఇప్పటికే 14 ఆత్మహత్యలు నమోదయ్యాయి. ఈ భయంకర సంఖ్య జాతీయ స్థాయిలో ఆందోళన రేకెత్తించి, భారత సుప్రీంకోర్టు నుండి తీవ్ర విమర్శలకు దారితీసింది.

మే 23, 2025న, భారత సుప్రీంకోర్టు కోటలో విద్యార్థుల ఆత్మహత్యల ఆందోళనకర పెరుగుదలపై రాజస్థాన్ ప్రభుత్వాన్ని తీవ్ర ఆందోళనతో ప్రశ్నించింది. 'ఈ పిల్లలు ఎందుకు చనిపోతున్నారు? ఈ పిల్లలు ఎందుకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు? కోటలో మాత్రమే ఎందుకు? మీరు దీని గురించి ఆలోచించలేదా?'వంటి అనేక బాణాలను సంధించింది.

**కోట ప్రత్యేక ఆకర్షణ, ఆశయాల కేంద్రం:** 'కోచింగ్ రాజధాని'గా కోట అనే ప్రత్యేక గుర్తింపు ఐఐటి, ఎయిమ్స్ వంటి దేశంలోని అత్యంత ప్రతిష్టాత్మ క ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంపై దాని ఏకైక దృష్టి నుండి ఉద్భవించింది. సంప్రదాయ పాఠశాలలకు భిన్నం గా ఈ కేంద్రాలు ఈ నిర్దిష్ట పరీక్షలను ఛేదించడానికి రూపొందించబడిన అత్యంత ప్రత్యేకమైన, తీవ్రమైన శిక్షణను అందిస్తాయి. కోచింగ్ కేంద్రంగా కోట దృగ్విషయం 1980ల చివరలో 1990ల ప్రారంభంలో మొదలైంది. మాజీ ఇంజనీర్ వి.కె. బన్సల్‌ను కోట కోచింగ్ పరిశ్రమ పితామహుడిగా పరిగణిస్తారు. ఆయన విజయం బన్సల్ క్లాసెస్ స్థాపనకు దారితీసింది. ఇది ఇతరులకు నమూనాగా మారింది. అలెన్ కెరీర్ ఇన్‌స్టిట్యూట్, రెజొనెన్స్, వైబ్రెంట్ అకాడమీ, కెరీర్ పాయింట్ వంటి ఇతర ప్రముఖ సంస్థల విజయాలు తల్లిదండ్రులను ఆకర్షించాయి. మెట్రో నగరాలతో పోలిస్తే నగరంలోని ప్రశాంతమైన వాతావరణం, తక్కువ జీవన వ్యయం, తక్కువ అంతరాయాలు ప్రారంభంలో దాని ఆకర్షణకు దోహదపడ్డాయి.

**ఒత్తిడికి నిలయం–కోచింగ్ కేంద్రాలు సౌకర్యాలు** ఇటీవలి నివేదికల ప్రకారం, కోటలో 250కి పైగా నమోదిత కోచింగ్ సంస్థలు ఉన్నాయి. నమోదు కాని లేదా చిన్న కేంద్రాల సంఖ్య గణనీయంగా ఉంటుందని నమ్ముతారు. అగ్రశ్రేణి కోచింగ్ కేంద్రాలు, ఆధునిక తరగతి గదులు, గ్రంథాలయాలు, కొన్నిసార్లు హాస్టల్ సౌకర్యాలు అందిస్తున్నప్పటికీ, చాలామంది విద్యార్థులు ప్రైవేట్ హాస్టళ్లలో లేదా పేయింగ్ గెస్ట్ వసతులలో నివసిస్తున్నారు.

**విద్యార్థుల్లో ఒత్తిడి కారణాలు:** కోట విద్యార్థులపై ఉన్న తీవ్ర ఒత్తిడి బహుముఖంగా ఉంటుంది. రోజుకు 12–18 గంటల తీవ్రమైన అధ్యయన షెడ్యూల్స్, వారపు పరీక్షలు, నిరంతర ర్యాంకింగ్, నిరంతర పోటీ, పనితీరు ఆందోళన వాతావరణాన్ని సృష్టిస్తాయి. మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చిన విద్యార్థులు కోట కోచింగ్‌లో తమ జీవితకాల పొదుపును పెట్టుబడిగా పెడతారు. వారి పిల్లలు విజయం సాధించి ఆర్థిక త్యాగాన్ని సమర్థించుకోవాలని అపారమైన ఒత్తిడి ఉంటుంది. ఇంజనీరింగ్, మెడిసిన్ భారతదేశంలో ఏకైక 'విజయవంతమైన' వృత్తి మార్గాలుగా పరిగణించ బడతాయి.

**ఇప్పటివరకు తీసుకున్న చర్యలు:** సంక్షోభానికి ప్రతిస్పందనగా, రాజస్థాన్ ప్రభుత్వం కోచింగ్ సంస్థలు వివిధ చర్యలను అమలు చేశాయి. కోచింగ్ కేంద్రాలకు కొత్త మార్గదర్శకాలు జారీ చేయబడ్డాయి. వీటిలో తప్పనిసరి వారపు సెలవులు, పరీక్షల సమయ నియంత్రణ, పనితీరు ఆధారంగా విద్యార్థులను విభజించకపోవడం, తప్పనిసరి మానసిక కౌన్సెలింగ్, 120 రోజులలోపు సులభంగా నిష్క్రమించే రీఫండ్ విధానాలు ఉన్నాయి. మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాలను మెరుగుపరచడానికి, కోచింగ్ కేంద్రాలలో వృత్తిపరమైన మానసిక వైద్యులు, కౌన్సెలర్లను తప్పనిసరిగా నియమిస్తున్నారు. మహిళా విద్యార్థుల భద్రత కోసం పోలీసుల 'కాలికా స్క్వాడ్' కూడా పనిచేస్తుంది. ప్రభుత్వ చట్టంపరంగా, రాజస్థాన్ కోచింగ్ సెంటర్ల (నియంత్రణ) బిల్లు 2025 ఈ రంగాన్ని నియంత్రించడం, వాణిజ్యీకరణను అరికట్టడం, నమోదును తప్పనిసరి చేయడం, నిబంధనలను పాటించని వారికి జరిమానాలు విధించడం లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లా యంత్రాంగం ద్వారా 'కలెక్టర్‌తో డిన్నర్', 'సంవాద్' వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ చర్యలు ప్రశంసనీయం అయినప్పటికీ, చాలామంది విమర్శకులు అవి ఎక్కువగా ప్రతిస్పందన 'తాత్కాలిక పరిష్కారం' అని వాదిస్తున్నారు. అవి తీవ్రమైన పోటీ, అవాస్తవ అంచనాలు, ఒత్తిడిని నడిపించే వాణిజ్యీకరణ వంటి ప్రాథమిక వ్యవస్థాగత సమస్యలను పరిష్కరించవు.

**ముందుకు వెళ్లే మార్గం:** కోటలో ఆత్మహత్యలను నిరోధించడానికి అన్ని వాటాదారుల భాగస్వామ్యంతో బహుముఖ, సానుభూతితో కూడిన నిరంతర విధానం అవసరం. వ్యవస్థాగత విద్యా సంస్కరణలు చేపట్టాలి. ఇందులో జెఈఈ, నీట్ వంటివాటి ఏకైక దృష్టిని తగ్గించడం, వృత్తి శిక్షణ, నైపుణ్య ఆధారిత విద్య, చిన్న వయస్సు నుండే ప్రత్యామ్నాయ వృత్తి మార్గాలను ప్రోత్సహించడం వంటివి ఉంటాయి. బట్టీ పట్టడం కాకుండా సామాజికభావోద్వేగ అభ్యాసం, విమర్శనాత్మక ఆలోచన, జీవిత నైపుణ్యాలను పాఠ్యప్రణాళికలో చేర్చడం ద్వారా సమగ్ర అభ్యాసాన్ని ప్రోత్సహించాలి. పరీక్షా నిర్మాణాలను, గ్రేడింగ్ విధానాలను తిరిగి మూల్యాంకనం చేసి విద్యార్థులపై భారాన్ని తగ్గించాలి. తల్లిదండ్రులు, సమాజం ఆలోచనలను మార్చడం అత్యవసరం.








పటిష్టమైన మానసిక ఆరోగ్య మౌలిక సదుపాయాలు అవగాహన కల్పించాలి. తగినంత సంఖ్యలో అర్హత కలిగిన మనస్తత్వవేత్తలు, మనోరోగ వైద్యులు, కౌన్సెలర్లు విద్యార్థులందరికీ సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలి. కోచింగ్ సంస్థలకు కఠిన నిబంధనలు జవాబుదారీతనం అవసరం. ప్రస్తుత కొత్త మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలి, నిబంధనలను పాటించని వారికి గణనీయమైన జరిమానాలు విధించాలి. హామీతో కూడిన విజయాన్ని వాగ్దానం చేసే తప్పుదారి పట్టించే ప్రకటనలను నిషేధించాలి. తమకు సరిపోరని భావించే విద్యార్థులకు సులభమైన నిష్క్రమణ ఎంపికలు, పూర్తి, సకాలంలో రీఫండ్లను నిర్ధారించాలి.

విద్యార్థులు ఒత్తిడిని తగ్గించుకోవడానికి సమతుల్య జీవితాన్ని నిర్వహించడానికి క్రీడలు, కళలు ఇతర పాఠ్యేతర కార్యకలాపాలకు తగిన స్థలాలను అవకాశాలను అందించాలి. విద్యార్థులందరికీ ప్రామాణికమైన, సాధారణ, గోప్యమైన మానసిక ఆరోగ్య చెక్‌ఇన్‌లను అమలు చేయాలి.

తెలుగు రాష్ట్రాల్లో పోటాపోటీ ప్రైవేటు విద్యావ్యవస్థ సైతం తల్లిదండ్రుల ఆశలు సొమ్ముచేసుకుంటున్నది, విద్యార్థులను 'బందిఖానా'ల్లో ఉంచి ఒత్తిడి పెంచుతున్నాయి. అరుదుగానైనా ఆత్మహత్యల వార్తలు వింటున్నాం. కోటలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకమునుపే రాష్ట్ర ప్రభుత్వాలు ముందుగా చర్యలు తీసుకోవటం అవసరం. సం॥

జనక మోహన రావు దుంగ
8247045230



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ప్రొఫెసర్ అలీఖాన్ తాత్కాలిక బెయిలు పొడిగింపు

**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియా పోస్టులో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అశోకా యూనివర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ అలీ ఖాన్ మహమూద్ తాత్కాలిక బెయిలును సుప్రీంకోర్టు బుధవారంనాడు పొడిగించింది. సిట్ తన దర్యాప్తు నివేదికను సమర్పించాలని ఈ అశంపై విచారణ సందర్భంగా బెంచ్ ఆదేశించింది. ప్రొఫెసర్ అలీఖాన్ భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రసంగంపై ఎలాంటి ఆంక్షలు లేవని, అయితే కేసు నమోదైనందున ఇందుకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎలాంటి పోస్టులు చేయరాదని స్పష్టం చేసింది. జాతీయ మానవ హక్కుల సంఘానికి కూడా కేసు గురించి చెప్పాలని హర్యానా పోలీసులను సుప్రీంకోర్టు సూచించింది. కాగా, ప్రొఫెసర్ అలీఖాన్‌పై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు కావడంతో ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్‌ను హర్యానా డిజిపి శత్రుజిత్ కపూర్ గత వారంలో ఏర్పాటు చేశారు. అలీఖాన్‌కు సుప్రీంకోర్టు తాత్కాలిక బెయిల్ మంజూరు చేయడంతో ఆయన గత గురువారంనాడు జ్యుడిషియల్ కస్టడీ నుంచి విడుదలయ్యారు. దీనికి ముందు, ఆపరేషన్ సిందూర్‌పై సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి మే 18న హర్యానా పోలీసులు అలీఖాన్‌ను అరెస్టు చేశారు.

## జస్టిస్ వర్మపై అభిశంసనకు మద్దతివ్వండి : సిపిఐ

### అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులకు సిపిఐ ఎంపి సందోష్ కుమార్ లేఖ




**న్యూఢిల్లీ :** అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి యశ్వంత్ వర్మకు వ్యతిరేకంగా పార్లమెంటులో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టడానికి మద్దతు ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలకు సిపిఐ పార్లమెంటరీ పార్టీ నాయకుడు పి.సందోష్ కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు రాజకీయ పార్టీల అధ్యక్షులకు ఆయన లేఖ రాసారు. జస్టిస్ యశ్వంత్ వర్మ ఢిల్లీ నివాసంలో నోట్లు తగలబడుతూ బైటపడిన వ్యవహారంలో సుప్రీం కోర్టు నియమించిన విచారణ కమిటీ అభిశంసించిందని ఆయన తెలిపారు. ''ఒకవేళ నిజమే అని తేలితే, ఆ ఆరోపణలు ప్రజల విశ్వాసానికి ద్రోహం చేయడమే కాకుండా న్యాయ వ్యవస్థల నైతికతపై గంభీరమైన ప్రభావాన్ని చూపుతుంది.'' అని లేఖలో సందోష్ కుమార్ పేర్కొన్నారు. భారత న్యాయవ్యవస్థ విశ్వసనీయతను పరిరక్షించేందుకు పక్షపాతాలకు అతీతంగా రాజ్యాంగ బాధ్యత నిర్వర్తించేందుకు అన్ని రాజకీయ పార్టీలు నిలబడాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 124 (సుప్రీం కోర్టు ఏర్పాటు), ఆర్టికల్ 218 (న్యాయమూర్తుల తొలగింపు నిబంధనలు) లకు అనుగుణంగా'' న్యాయవ్యవస్థ ఔచిత్యం, ప్రజలకు జవాబుదారీతనం వంటి తీవ్రమైన ప్రశ్నలు తలెత్తినప్పుడు శాసనవ్యవస్థ మౌన ప్రేక్షకురాలిగా ఉండలేదని'' పేర్కొన్నారు. న్యాయవ్యవస్థను మరింత జావాబుదారీ, సమ్మిళితం, సామాజిక ప్రాతినిధ్యం ఉండేలా జాతీయ స్థాయిలో రాజకీయ చర్చ జరగాలని సందోష్ కుమార్ అన్నారు. నియామకాలు విషయంలో న్యాయవ్యవస్థ పారదర్శకరహితంగా ఉంటుందని, ముఖ్యంగా కులం, లింగం, ప్రాంతీయ వైవిధ్యం విషయంలో ప్రాతినిధ్యాల విషయంలో ఇది ఎక్కువ అని అన్నారు. ''మన న్యాయస్థానాలు భారతీయ సమాజం బహుళ స్వభావాన్ని ప్రతిబింబించాలి. ఉన్నత న్యాయవ్యవస్థలో జవాబుదారీ యంత్రాంగం ఏర్పాటు దీర్ఘకాలికంగా నిలిచి ఉంది. నుదు మనం ఎదుర్కొంటున్న అవినీతి ఆరోపణలు కేవలం ప్రత్యేక కేసులకే పరిమితం కాదు. ఇది సంస్థాగత వైఫల్యం. ఇది వ్యవస్థాగత సంస్కరణలు, ప్రజాస్వామ్య నిబద్ధతలను కోరుతుంది.'' అని వివరించారు.

### రాజీనామా .... లేదంటే అభిశంసనే..

ఇదిలావుండగా, జస్టిస్ వర్మకు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానాన్ని పార్లమెంటులో ప్రవేశపెట్టేందుకు గల అవకాశాలను కేంద్రం పరిశీలిస్తున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలియజేశాయని 'పిటిఐ' పేర్కొంది. జస్టిస్ వర్మ రాజీనామా చేయనట్లయితే జూలై మాసం మూడవ వారంలో ప్రారంభమయ్యే పార్లమెంటు వానాకాల సమావేశాలలో అభిశంసన తీర్మానం తప్పదని ఆ వర్గాలు వెల్లడించాయి. అయితే వర్మకు వ్యతిరేకంగా సాధారణ ప్రక్రియను ఇంకా ప్రారంభించలేదని, ఈ విషయంలో ఎలాంటి చర్యనైనా తీసుకునే ముందు ప్రభుత్వం ప్రతిపక్షాలను కూడా విశ్వాసంలోకి తీసుకుంటుందని అధికార వర్గాలు తెలిపాయి.

## సాధ్యమైనంత...సహాయం అందిస్తాం



♦ ఖాండ్వా హత్యాచార బాధితురాలి కుటుంబానికి కాంగ్రెస్‌నేత రాహుల్ గాంధీ హామీ ♦ ఫోన్‌కాల్‌లో మాట్లాడించిన అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ భురియా ♦ నిందితులకు శిక్ష పడేలా గట్టిగా కృషిచేయాలని రాహుల్ ఆదేశం

**ఖాండ్వా (మధ్యప్రదేశ్)** : గతవారం మధ్యప్రదేశ్‌లోని ఖాండ్వాలో అత్యంత దారుణంగా సామూహిక హత్యాచారానికి గురైన గిరిజన మహిళ కుటుంబానికి సాధ్యమైనంత మేరకు సహాయం అందజేస్తామని కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీ హామీ ఇచ్చారు. ఆయన బుధవారం బాధిత కుటుంబసభ్యులతో ఫోన్‌కాల్‌లో మాట్లాడారు. ఖాండ్వా జిల్లాలో 45 ఏళ్ల వయసు గిరిజన మహిలను శుక్రవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు దారుణంగా అత్యాచారం చేసి తీవ్రంగా గాయపర్చగా తీవ్ర రక్తస్రావంతో మరుసటిరోజైన శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన గిరిజన విభాగమైన అఖిల భారత ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ భురియా బుధవారం మధ్యాహ్నం విక్రాంత్ భురియా బాధిత కుటుంబసభ్యులను వారి నివాసంలో కలిసి మాట్లాడారు. ఆయన రాహుల్‌గాంధీతో ఫోన్‌కాల్‌చేసి హత్యాచార బాధితురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడించారు.ఈ సంభాషణకు సంబంధించిన ఒక వీడియోను కాంగ్రెస్ పార్టీ బుధవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ వారిని ఓదారుస్తూ కాంగ్రెస్ పార్టీ సాధ్యమైనంత సహాయం అందజేస్తుందని, అండగా నిలబడతామని భరోసా ఇచ్చారు. ఈ ఫోన్ కాల్ సంభాషణలో రాహుల్‌గాంధీ బాధిత కుటుంబసభ్యుల బంధువుతో మాట్లాడుతూ నిందితులు మీ కుటుంబంలో ఎవరికైనా తెలుసా అని అడిగారు. దానికి అతడు సమాధానమిస్తూ తనకు నిందితులు బాగా తెలుసని, వారు కూడా తమ గ్రామానికి చెందిన వారేనని వివరించారు. నిందితులు ప్రస్తుతం జైలులో ఉన్నారా లేదా అని రాహుల్‌గాంధీ వారిని ప్రశ్నించి వారి నుంచి సమాధానం పొందారు. రాహుల్‌గాంధీ విక్రాంత్ భురియాతో మాట్లాడుతూ బాధిత కుటుంబానికి అండగా నిలవాలని, నిందితులకు శిక్ష పడేలా గట్టిగా ప్రయత్నించాలని సూచించారు. సామూహిక హత్యాచార బాధితురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారని ఇంతకు ముందు పోలీసులు వెల్లడించారు. హత్యాచార బాధితురాలు, నిందితులు కోర్కు గిరిజన తెగకు చెందిన వారని పోలీసులు వెల్లడించిన విషయం తెలిసిందే.

## పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు

### ఆపరేషన్ సిందూర్‌పై కొన్ని ప్రశ్నలకు జవాబివ్వాలి: టిఎంసి



**న్యూఢిల్లీ :** వర్షాకాల సమావేశాలకు ముందు జూన్‌లో ప్రత్యేక పార్లమెంటు సమావేశాన్ని నిర్వహించాలని తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) బుధవారం డిమాండ్ చేసింది. ఆపరేషన్ సిందూర్‌పై కొన్ని అత్యవసర ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం ఇవ్వాలని కోరింది. రాజకీయ ర్యాలీలు నిర్వహించడం ద్వారా అధికార బిజెపి ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తోందని ఆ పార్టీ ఆరోపించింది. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రవాద దాడిలో 26 మంది ప్రాణాలు కోల్పోయినప్పటి నుండి ప్రతిపక్ష పార్టీలు పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఆపరేషన్ సిందూర్ గురించి ఎంపిలకు తెలియజేయడానికి జరిగిన అఖిలపక్ష సమావేశంలో కూడా ఈ డిమాండ్‌ను లేవనెత్తాయి. ప్రభుత్వానికి పూర్తి మద్దతు ఉన్నదని తాము విశ్వసిస్తున్నామని, అదే సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశం నిర్వహించాలని తొలుత ఎంపి కపిల్ సిబల్ చేసిన డిమాండ్‌కు కూడా తాము ఇప్పుడు మద్దతు ఇస్తున్నామని టిఎంసి రాజ్యసభ ఉప నాయకురాలు సాగరికా ఘోష్ బుధవారం ఢిల్లీలో జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. వర్షాకాల సమావేశాలకు ముందు జూన్‌లో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు విదేశీయులు భారతీయ దృక్కోణాన్ని విన్నారు అయితే భారత్, భారత పౌరులు ప్రభుత్వ దృక్కోణాన్ని వినాల్సిన సమయం ఆసన్నమైందని జెప్పారు. జాతీయ ప్రయోజనాల దృష్ట్యా తాము లేవనెత్తుతున్న కొన్ని అత్యవసర ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని సాగరికా పేర్కొన్నారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు సాధారణంగా జూలై మూడవ వారంలో జరగనుండగా, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను డిమాండ్ చేయడానికి ప్రతిపక్ష పార్టీలు కలిసి రావాలన్నారు. 'బిజెపితో పోరాడుతున్న పార్టీలు, పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే డిమాండ్‌పై ఏకతాటిపై ఉన్నామని, కలిసి ముందుకు సాగుతున్నామని, రాజ్యసభలో టిఎంసి పార్లమెంటరీ పార్టీ నాయకుడు డెరెక్ ఓ బ్రెయిన్ విలేకరులతో అన్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలనే డిమాండ్‌ను లేవనెత్తిన పార్టీలలో కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యుబిటి), ఆర్‌జెడి, వామపక్షాలు, నేషనల్ కాన్ఫరెన్స్, జెఎంఎం, ఆప్ ఉన్నాయి. ఈ అంశంపై ప్రతిపక్ష పార్టీలు సంప్రదింపులు జరుపుతున్నాయని వర్గాలు తెలిపాయి. కాగా, ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయం చేయడానికి ప్రయత్నిస్తున్న బిజెపిపై ఘోష్ మండిపడ్డారు. ఆపరేషన్ సిందూర్‌ను రాజకీయం చేయాలని బిజెపి యత్నించడం శోచనీయమన్నారు. మన సాయుధ దళాల ధైర్యసాహసాల వల్లే ఆపరేషన్ విజయవంతమైందన్నారు. మన సాయుధ దళాల త్యాగం, ధైర్యాన్ని రాజకీయం చేయాల చూడడాన్ని తాము విశ్వసించబోమన్నారు. ఆపరేషన్ సిందూర్ విషయంలో ప్రధానమంత్రి కూడా అత్యంత నాటకీయ రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు.

## రాజ్యసభకు కమల్ హాసన్

### డిఎంకె అధికారిక ప్రకటన



**న్యూఢిల్లీ :** తమిళనాడు రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ప్రముఖ సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) పార్టీ అధినేత కమల్ హాసన్‌ను రాజ్యసభకు పంపేందుకు అధికార డిఎంకె పార్టీ నిర్ణయించింది. ఈ విషయాన్ని ఆ పార్టీ అధ్యక్షుడు, తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ అధికారికంగా ప్రకటించారు. 2024 లోక్‌సభ ఎన్నికల సమయంలో డిఎంకెతో కమల్ హాసన్ పొత్తు పెట్టుకున్నారు. ఈ ఒప్పందంలో భాగంగా, రాజ్యసభలో ఒక సీటును ఎంఎన్ఎం పార్టీకి కేటాయించేందుకు డిఎంకె అంగీకరించింది. ఈ నేపథ్యంలో కమల్ హాసన్‌ను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించారు. కమల్ హాసన్ 2018లో మక్కల్ నీది మయ్యం పార్టీని స్థాపించారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కోయంబత్తూరు నుంచి పోటీ చేసి ఓటమి చవిచూశారు. అయినప్పటికీ, ఆయన రాజకీయ ప్రయాణాన్ని కొనసాగించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె నేతృత్వంలోని ఇండియా కూటమికి సపోర్ట్ చేశారు. కోయంబత్తూరు నుంచి పోటీ చేయాలని ఆలోచించినప్పటికీ, బిజెపి అభ్యర్థి అన్నామలై పోటీ వల్ల ఆ నిర్ణయం నుంచి వెనక్కి తగ్గారు. బదులుగా, డిఎంకె తరపున రాష్ట్రవ్యాప్తంగా ప్రచారం చేశారు. ఈ సహకారానికి గుర్తింపుగా, డిఎంకె నేత స్టాలిన్ కమల్‌కు రాజ్యసభ సీటు హామీ ఇచ్చారు. జులైలో ఆరు రాజ్యసభ సీట్లు ఖాళీ కానున్నాయి. ఈ సీట్లలో నాలుగు డిఎంకె కూటమికి, రెండు అన్నా డిఎంకె కూటమికి దక్కే అవకాశం ఉంది. డిఎంకె తమ నాలుగు సీట్లలో ఒకదాన్ని కమల్ హాసన్‌కు కేటాయించింది. ఈ నిర్ణయాన్ని ఎంఎన్ఎం పార్టీ కార్యనిర్వాహక కమిటీ కూడా ఆమోదించింది. రాజ్యసభ ఎన్నికలు జూన్ 19, 2025న జరగనున్నాయి. తమిళనాడు అసెంబ్లీలో డిఎంకెకు బలమైన మెజారిటీ ఉండటంతో, కమల్ హాసన్ ఎన్నిక ఖాయంగా కనిపిస్తోంది.

### సోఫియా ఖురేషీపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన...

## మంత్రి విజయ్‌షాపై విచారణను నిలిపివేయండి

### మధ్యప్రదేశ్ హైకోర్టుకు 'సుప్రీం' ఆదేశం

### ఈ అంశాన్ని ప్రస్తుతం పరిశీలిస్తున్నామని ధర్మాసనం వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత ఆర్మీ ఆఫీసర్ కల్నల్ సోఫియా ఖురేషీకి వ్యతిరేకంగా చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా మధ్యప్రదేశ్ హైకోర్టు ముందు ఎదుర్కొంటున్న విచారణను మూసివేయాలని బుధవారం సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రస్తుతం ఈ అంశాన్ని పరిశీలిస్తున్నామని అత్యున్నత న్యాయస్థానం తెలియజేసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన మునుపటి ఆదేశాలకు అనుగుణంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్)నుంచి సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్.కోటేశ్వర్ రావులతో కూడిన ద్విసభ్య ధర్మాసనం స్టేటస్ రిపోర్టును కోరింది. దర్యాప్తులో భాగంగా ప్రత్యేక దర్యాప్తు బృందం కొన్ని పరికరాలను స్వాధీనం చేసుకున్నట్లు సుప్రీంకోర్టు గుర్తించింది. మంత్రికి వ్యతిరేకంగా హైకోర్టులో సమాంతర చర్యలు కొనసాగుతున్నాయని సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తా ధర్మాసనానికి తెలియజేశారు. ఈ విషయం ఇప్పుడు తమ పరిధిలోకి వచ్చినందున హైకోర్టులో విచారణ ముగిసిందని సర్వోన్నత న్యాయస్థానం తెలియజేసింది. విజయ్‌షా అరెస్ట్‌పై స్టే తో సహా మే 19న ఇచ్చిన మధ్యంతర ఆదేశాలు పొడిగించబడ్డాయని ధర్మాసనం తెలిపింది. అనంతరం ఈ అంశంపై తదుపరి విచారణను జులై రెండవ వారానికి వాయిదా వేసింది. ఈ అంశాన్ని రాజకీయం చేయడాన్ని అత్యున్నత న్యాయస్థానం కోరుకోవడం లేదని, ఈ అంశంలో ఎలాంటి జోక్యాన్ని తాము అనుమతించే ప్రసక్తే లేదంటూ ధర్మాసనం తిరస్కరించింది. మే 19న అత్యున్నత న్యాయస్థానం భారత ఆర్మీ ఆఫీసర్ సోఫియా ఖురేషీకి వ్యతిరేకంగా మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలపై మందలించింది. ఆయనపై నమోదైన ఎఫ్ఐఆర్‌కు సంబంధించి దర్యాప్తు చేపట్టేందుకు అత్యున్నత న్యాయస్థానం ముగ్గురు సభ్యులతో కూడిన సిట్‌ను ఏర్పాటుచేసింది. ఆపరేషన్ సిందూర్ గురించి మీడియా సమావేశంలో భారత ఆర్మీ ఆఫీసర్ కల్నల్ సోఫియా ఖురేషీ, మరో మహిళా అధికారి వ్యోమికా సింగ్‌తో కలిసి ఇచ్చిన వివరణపై మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా చేసిన అభ్యంతరకర వ్యాఖ్యల వీడియోపై జాతీయస్థాయిలో విమర్శలు తీవ్రస్థాయిలో వెల్లువెత్తాయి. మధ్యప్రదేశ్ హైకోర్టు విజయ్‌షా అసభ్యకరమైన భాషతో కల్నల్ సోఫియా ఖురేషీపై బురదజల్లడాన్ని తీవ్రంగా ఆక్షేపించింది. ఈ పరిణామాల తర్వాత విజయ్ షా తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తంచేస్తూ కల్నల్ సోఫియా ఖురేషీపై తనకు ఎంతో గౌరవం ఉన్నదని, ఆమె తనకు సోదరిలాంటిది అని వివరణ ఇచ్చారు.



## ప్రధాని మౌనం వీడాలి

### భారత్–పాకిస్థాన్ మధ్య కాల్పు విరమణ ఒప్పందంపై వాస్తవాలు వెల్లడించాలి : జైరామ్ రమేష్

న్యూఢిల్లీ : భారత్–పాకిస్తాన్ మధ్య కాల్పు విరమణ ఎలా జరిగిందనే దానిపై ట్రంప్ అధికార యంత్రాంగం పదేపదే వ్యాఖ్యలు చేస్తుండగా, దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మౌనం వీడాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. అమెరికా వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లుట్నిక్ ఈనెల 23న న్యూయార్క్‌లోని యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్‌లో చేసిన వ్యాఖ్యలు వాస్తవమేనా అని ప్రధాన మంత్రి దేశానికి తెలియజేయాలని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలను అడ్డుపెట్టుకుని భారత్ – పాకిస్తాన్ మధ్య స్వల్పమైన కాల్పుల విరమణను కుదుర్చుకున్నారా? తాత్కాలిక శాంతిని తీసుకువస్తున్నామని ప్రమాణం చేశారా అని ప్రశ్నించారు. అయితే అమెరికా వాణిజ్య కార్యదర్శి చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం స్పందించలేదు. కానీ, ఇరుపక్షాల మధ్య ప్రత్యక్ష చర్చల తర్వాత కాల్పుల విరమణపై భారత్–పాకిస్థాన్ మధ్య అవగాహన కుదిరిందని పేర్కొంది. కాగా, 'మిస్టర్ లుట్నిక్ అధ్యక్షుడు ట్రంప్ అడుగుజాడలను అనుసరిస్తున్నారు. ఆయన 3 వేర్వేరు దేశాలలో 11 రోజుల్లో 8 సార్లు ఈ ప్రకటన చేశారు. అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో కూడా ఇదే విషయాన్ని వెల్లడించారు. భారత్–పాకిస్తాన్ మధ్య చర్చలకు 'తటస్థ ప్రదేశం గురించి ప్రస్తావించారు. దీనిపై ప్రధాని మోదీ మౌనం వీడాలి' అని ఎక్స్‌లో జైరామ్ రమేష్ పోస్టు చేశారు. అయితే రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలను పరిష్కరించడానికి తాను సహాయం చేశానని అమెరికా అధ్యక్షుడు పదే పదే చెబుతున్నారు. 26 మందిని బలిగొన్న ఏప్రిల్ 22 పహల్గామ్ ఉగ్రవాద దాడికి ప్రతిస్పందనగా మే 7న భారతదేశం ఆపరేషన్ సిందూర్ కింద ఉగ్రవాద మౌలిక సదుపాయాలపై కచ్చితమైన దాడులు నిర్వహించింది. భారత చర్య తర్వాత, పాకిస్తాన్ మే 8, 9, 10 తేదీలలో భారత సైనిక స్థావరాలపై దాడి చేయడానికి ప్రయత్నించింది. భారత దళాలు అనేక పాకిస్థాన్ సైనిక స్థావరాలపై తీవ్ర ప్రతిఘటనను ప్రారంభించాయి. నాలుగు రోజుల తీవ్రమైన సరిహద్దు డ్రోన్, క్షిపణి దాడుల తర్వాత సైనిక ఘర్షణను ముగించడానికి భారత్–పాకిస్థాన్ మే 10న ఒక అవగాహనకు వచ్చాయి. వాషింగ్టన్ 'మధ్యవర్తిత్వం'లో సుదీర్ఘమైన చర్చల తర్వాత ఇరు దేశాల మధ్య పూర్తి, తక్షణ కాల్పుల విరమణకు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు.

## కమల్‌కు చరిత్ర తెలియదనుకుంటా

### కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉంది : సిఎం సిద్ధరామయ్య



**బెంగళూరు :** తమిళం నుంచి కన్నడ భాష పుట్టిందంటూ ప్రముఖ నటుడు కమల్‌హాసన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదం అయ్యాయి. తాను నటించిన థగ్ లైఫ్ సినిమా ఆడియో విడుదల సందర్భంగా చెన్నైలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నా జీవితం, నా కుటుంబం తమిళ భాష' అని పేర్కొన్నారు. ఆయన వ్యాఖ్యలపై కన్నడిగులు మండిపడుతున్నారు. తాజాగా ఈ వివాదంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించారు. నటుడి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. కన్నడ పుట్టుకకు తమిళంతో సంబంధం లేదని పేర్కొన్నారు. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉందని వ్యాఖ్యానించారు. కమల్ హాసన్‌కు ఆ విషయాలన్నీ తెలియవంటూ ఎద్దేవా చేశారు. 'కన్నడ పుట్టుకకు తమిళంతో సంబంధం లేదు. కన్నడకు సుదీర్ఘ చరిత్ర ఉంది. పాపం కమల్ హాసన్‌కు ఆ విషయాలన్నీ తెలియదనుకుంటా' అంటూ వ్యాఖ్యానించారు. కమల్ హాసన్ నటించిన థగ్ లైఫ్ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో మంగళవారం చెన్నైలో జరిగిన సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో కమల్ హాసన్ మాట్లాడుతూ.. 'కన్నడం.. తమిళం నుంచి పుట్టింది' అని కామెంట్ చేశారు. ఇదే కార్యక్రమానికి కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ కూడా హాజరయ్యారు. ఆయన ఎదుటే ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఉయిరే, ఉరవే తమిళే (నా ప్రాణం, నా బంధుత్వం తమిళం) అంటూ తన ప్రసంగాన్ని ప్రారంభించిన కమల్ హాసన్ అనంతరం కన్నడ స్టార్ శివరాజ్ కుమార్‌ని ఉద్దేశించి మాట్లాడారు. 'శివరాజ్‌కుమార్ వేరే రాష్ట్రంలో నివసిస్తున్నా నా కుటుంబ సభ్యుడు. అందుకే ఆయన ఈ రోజు ఇక్కడ ఉన్నారు. అందుకే నా ప్రసంగం మొదలుపెట్టేటప్పుడు.. నా జీవితం, నా కుటుంబం తమిళ భాష అని చెప్పా. మీ భాష (కన్నడ) తమిళ నుంచే పుట్టింది. ఆ విధంగా మీరు భాగస్వామి అయ్యారు' అని శివరాజ్‌కుమార్‌ను ఉద్దేశించి అన్నారు. అయితే తమిళం నుంచి కన్నడ పుట్టిందన్న కమల్ వ్యాఖ్యలపై కన్నడ సంఘాలు భగ్గుమన్నాయి. బెంగళూరులో థగ్‌లైఫ్ సినిమా బ్యానర్లను కొందరు ఆందోళనకారులు చించివేశారు. 'కర్ణాటకలో మీకు వ్యాపారం కావాలి.. కానీ కన్నడ భాషను అవమానిస్తారా?' అని ధ్వజమెత్తారు.

### జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా

## చర్చ ఏమి నిలిచిపోలేదు

### ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పష్టీకరణ

### ఇటీవలి నీతి ఆయోగ్ సమావేశంలో రాష్ట్ర హోదా లేవనెత్తానని వెల్లడి



**గుల్‌మార్గ్ (జమ్ముకశ్మీర్) :** ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ పాలకమండలి సమావేశంలో జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణ గురించి ఏప్రిల్ 22 పహల్గామ్ దాడి చర్చను నిలిపివేయలేదని జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా స్పష్టం చేశారు. తాను ఈవిషయాన్ని నీతి ఆయోగ్ సమావేశంలో లేవనెత్తానని చెప్పారు. జమ్ముకశ్మీర్ హోదా పునరుద్ధరణ చర్చను పహల్గామ్ ఉగ్రవాద దాడి ఏమైనా ప్రభావితం చేసిందా అని అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ ఈ విషయాన్ని వెల్లడించారు. లేదు, ఎంతమాత్రం వాస్తవం కాదు. నీతి ఆయోగ్ సమావేశంలో కొనసాగిన అధికారిక ప్రసంగాన్ని మీరు తీసుకున్నట్లయితే, దానిలో రాష్ట్ర హోదా గురించి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, నీతి ఆయోగ్ పాలక మండలి సభ్యులు అందరి ముందు స్పష్టంగా లేవనెత్తడం జరిగింది అని ఒమర్ అబ్దుల్లా విలేకరులకు తెలియజేశారు. బుధవారం శ్రీనగర్ నుంచి 52కిలోమీటర్ల దూరంలో ఉన్నటువంటి ఉత్తర కశ్మీర్ పర్యాటక రిసార్ట్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విలేకరులతో మాట్లాడారు. 'కాబట్టి జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా గురించి చర్చ ఏమీ ముగిసిపోలేదు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ప్రత్యేక సమావేశాన్ని రాష్ట్ర హోదాకు సంబంధించిన చర్చకు ఉపయోగించుకోవడం నాకు ఎంతమాత్రం ఇష్టం లేదు. అంతమాత్రాన రాష్ట్ర హోదా చర్చను నిలిపివేశామని అనుకోవడం సహేతుకం కాదు. ఆ చర్చ కొనసాగుతూనే ఉన్నది' అని ముఖ్యమంత్రి చెప్పారు.ఇక్కడ జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి పర్యాటకం పునరుద్ధరణ గురించి మాట్లాడుతూ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందినవారు మళ్లీ కశ్మీర్‌లోని పర్యాటక ప్రాంతాలను సందర్శించడానికి ముందు లోయలో పర్యాటక స్థలాలలను సందర్శించేది కశ్మీరీలేనని ఆయన చెప్పారు. దీనికి సంబంధించిన ప్రచారం, చురుకైన కార్యకలాపాలు ఇక్కడ జరగాలి. పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు సంబంధించిన పిక్నిక్‌లను ఇక్కడ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విద్యాశాఖ మంత్రిని కోరినట్లు చెప్పారు. దీంతో పర్యాటక స్థలాల సందర్శన పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంటుందన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.ఉన్నతస్థాయి పౌర యంత్రాంగం అధికారులతో పాటు, కశ్మీర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్, నార్త్ కశ్మీర్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్, బారాముల్లా సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఈ సమావేశానికి హాజరయ్యారు. మంగళవారం దక్షిణ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా తన మంత్రి మండలి సమావేశాన్ని నిర్వహించిన విషయం తెలిసిందే. ప్రజల్లో భద్రత, విశ్వాసాన్ని పెంపొందించాలన్న ఉద్దేశంతో జమ్ముకశ్మీర్ పౌర సచివాలయంబయట ఈ కేబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. జమ్ముకశ్మీర్ పర్యాటక సందర్శనకు సిద్ధంగా ఉన్నదన్న సందేశాన్ని పంపించాలన్న ప్రయత్నంతోనే ఇక్కడ సమావేశం నిర్వహించడంలోని ముఖ్యోద్దేశమని ఒమర్ అబ్దుల్లా చెప్పారు.

## కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు 44 మంది ఎమ్మెల్యేలు సిద్ధం

### గవర్నర్‌ను కలిసిన మణిపూర్ బిజెపి నేత సహా పది మంది శాసనసభ్యులు

**ఇంఫాల్ :** మణిపూర్‌లో కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి నలభై నాలుగు మంది ఎమ్మెల్యేలు సిద్ధంగా ఉన్నారని బిజెపి శాసనసభ్యుడు తోక్‌చోమ్ రాధేశ్యామ్ సింగ్ తెలిపారు. బుధవారం ఆయన కొంతమంది ఎమ్మెల్యేలతో కలిసి గవర్నర్ అజయ్ కుమార్ భల్లాను కలిశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు 44 మంది ఎమ్మెల్యేలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్న విషయాన్ని మేము గవర్నర్‌కు తెలియజేశామన్నారు. రాష్ట్రంలో నెలకొన్న సమస్యకు ఎలాంటి పరిష్కారాలు చూపవచ్చో కూడా చర్చించామన్నారు. తాము చెప్పిన విషయాలను గవర్నర్ సావదానంగా విన్నారని, ప్రజల ప్రయోజనాల కోసం చర్యలు ప్రారంభిస్తారని తోక్‌చోమ్ అన్నారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తారా అని విలేకరులు ప్రశ్నించగా, బిజెపి కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని బుదులిచ్చారు. అయితే తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేసేందుకు గవర్నర్ వద్దకు వెళ్లామన్నారు. స్పీకర్ సత్యబ్రత వ్యక్తిగతంగా, సంయుక్తంగా 44 మంది ఎమ్మెల్యేలను కలిశారని, కొత్త ప్రభుత్వ ఏర్పాటును ఎవరూ వ్యతిరేకించలేదని సింగ్ అన్నారు. మే 2023లో చెలరేగిన మెయిటీస్, కుకిజోస్ మధ్య జాతి ఘర్షణలపై ప్రభుత్వం నిర్వహించిన తీరుపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో బిజెపి నాయకుడు ఎన్ బిరేన్ సింగ్ ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. దీంతోఫిబ్రవరి నుండి మణిపూర్ రాష్ట్రపతి పాలనలో ఉంది. 60 మంది సభ్యుల అసెంబ్లీలో ప్రస్తు తం 59 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు, ఒక శాసనసభ్యుడు మరణించడంతో ఒక స్థానం ఖాళీగా ఉంది. బిజెపి నేతృత్వంలోని సంకీర్ణంలో 32 మంది మెయిటీ ఎమ్మెల్యేలు, ముగ్గురు మణిపురి ముస్లిం ఎమ్మెల్యేలు, తొమ్మిది మంది నాగా శాసనసభ్యులు మొత్తం 44 మంది ఉన్నారు. కాంగ్రెస్‌కు ఐదుగురు ఎమ్మెల్యేలు ఉండగా, అందరూ మెయిటీలే. మిగిలిన 10 మంది ఎమ్మెల్యేలు కుకిలు. వారిలో ఏడుగురు గత ఎన్నికల్లో బిజెపి టికెట్‌పై గెలిచారు, ఇద్దరు కుకి పీపుల్స్ అలయన్స్‌కు చెందినవారు, ఒకరు స్వతంత్రుడు. మెయిటీలో నివసించే ఇంఫాల్ లోయలో భద్రతా దళాలు ప్రభుత్వ బస్సు విండ్‌షీల్డ్‌పై రాష్ట్ర పేరును రాయడంతో భారీ నిరసనలు చెలరేగాయి. మే 20న గ్వాల్తాబిలో జరిగిన సంఘటనపై గవర్నర్ క్షమాపణ చెప్పాలని, ప్రధాన కార్యదర్శి, డిజిపి, భద్రతా సలహాదారు రాజీనామా చేయాలని మెయిటీ గ్రూపు లు డిమాండ్ చేస్తున్నాయి. మే 2023లో 250 మందికి పైగా మరణించిన జాతి కలహాలు ప్రారంభమైనప్పటి నుండి, మెయిటీ గ్రూపులు ఏ శాంతి ప్రక్రియలోనూ రాష్ట్ర ప్రాదేశిక సమగ్రతపై చర్చలకు తావు లేదని వాదిస్తున్నాయి, అయితే కుకిజో సంస్థలు సంక్షోభాన్ని పరిష్కరించడానికి ఏకైక పరిష్కారం తాము నివసించే కొండ జిల్లాలకు ప్రత్యేక పరిపాలనను సృష్టించడమేనని వాదిస్తున్నాయి. గ్వాల్తాబి ఘటన ఉద్రిక్తతలకు మరింత బలం చేకూర్చింది.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ పట్టణంలోని మనోజ్ థియేటర్ సమీపంలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీ బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరోకరు ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మరణించారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన వారి వివరాలు ఇదామోని శ్రీశైలం (44) గ్రామం డిండి చింతపల్లి, వంగూరు మండలం, ఈరటు బచ్చయ్య(40) గ్రామం రాచలపల్లి ఊర్కొండ మండల వాసులుగా తెలిపారు.



## సమీకృత గురుకులానికి స్థల పరిశీలన

**ప్రజాపక్షం/నందికొండ:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు ప్రాధాన్య మిస్తూ నాగార్జునసాగర్ నియోజకవర్గంలో నిర్మించ తలపెట్టిన ఇంటిగ్రేటెడ్ గురుకుల నిర్మాణానికి కావలసిన స్థలాన్ని జాయింట్ కలెక్టర్ అమిత్ నారాయణ బుధవారం నందికొండ మునిసిపాలిటీలోని కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు బీసీ గురుకుల పాఠశాల వెనుక రోడ్డు లోని స్థలాన్ని , నాట్కో గృహ నిర్మాణ సముదాయం పక్కనే ఉన్న స్థలాలను పరిశీలించారు.ఇంటిగ్రేటెడ్ గురుకులం నాగార్జునసాగర్ లోనే ఏర్పాటు చేయాలనే ఉద్దేశం ఉన్నట్లు తెలుస్తుంది. కొద్దిరోజుల క్రితం నల్గొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కూడా సాగర్ లో స్థల పరిశీలన చేయగా బుధవారం జాయింట్ కలెక్టర్ అమిత్ నారాయణ ఆధ్వర్యంలో స్థల పరిశీలన జరిగింది వీరి వెంట డ్యామ్ ఈ.ఈ. మల్లికార్జునరావు, ఫారెస్ట్ రేంజర్ రాఘవేంద్రరావు, ఆర్.ఐ. శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.





## చిట్యాల మార్కెట్ చైర్మన్‌గా వినోద ప్రమాణం

**ప్రజాపక్షం/చిట్యాల :**నల్లగొండ జిల్లా చిట్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారం బుధవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటి ఆవరణలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, శాసనసభ్యులు వేముల వీరేశంలో సమక్షంలో జరిగింది. చైర్మన్‌గా మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా వినోదమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్‌గా నార్కట్‌పల్లికి చెందిన ఐతరాజు యాదయ్యలచే మార్కెటింగ్ శాఖ జిల్లా సహాయ సంచాలకులు ఛాయాదేవి ప్రమాణ స్వీకారం చేయించారు. అలాగే సభ్యులుగా చిట్యాల మండలానికి చెందిన కోనేటి యాదగిరి(ఉరుమడ్ల), దుబ్బాక అరుణ(నేరడ), షేక కరీం(చిట్యాల), కొండ ఎల్లయ్య(ఎలికట్టె), లెంకల విజయేందర్‌రెడ్డి(వనిపాకల), బూరుగు కృష్ణయ్య(చిట్యాల), గజ్జల భాస్కర్(చిట్యాల) నార్కట్‌పల్లి మండలానికి చెందిన దార యాదయ్య(గోపలాయపల్లి), తొడుసు వీరయ్య(బెండల పహాడ్), బింగి కొండయ్య(తొండ్లాయి), నీరుడు రాంరెడ్డి(ఔరవాణి)లు ప్రమాణ స్వీకారాన్ని చేపట్టారు. నూతన పాలక వర్గానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, రైతులు అభినందనలు తెలిపారు.

## అర్హులైన వారికి క్వార్టర్స్ అందించాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఎన్‌ఎస్పీ కార్యాలయాల్లో పనిచేసి రిటైర్ పట్టణంలోని ఎన్‌ఎస్పీ కాలనీలో జీవనం కొనసాగిస్తున్న వారందరిని గుర్తించి ప్రభుత్వం వెంటనే బేషరతుగా క్వార్టర్స్ తిరిగి వారికే అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపు 41వ వార్డుశాఖ మహాసభ బంటు రాజేశ్వరి అధ్యక్షతన జరగగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎన్‌ఎస్పీ క్యాంపులో రిటైర్మెంట్ అయి వాళ్ల పిల్లలు కూడా ఇక్కడే ఉండి జీవిస్తున్నారని, అలాంటి వారిని గుర్తించి క్వార్టర్స్‌ను తిరిగి ఇవ్వాలని, అదేవిధంగా అర్హులైన వారందరికి ఇందిరమ్మ ఇండ్లు అందించాలని డిమాండ్ చేశార. లేనట్లయితే సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఐ పార్టీ భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం అనే ప్రజా పోరాటాలు చేసి వంద సంవత్సరంలోకి అడుగుపెట్టిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు పేద ప్రజలకు అండగా ఉంటుందని, అనునిత్యం ప్రభుత్వాలతో పోరాటాలు చేస్తూనే ఉందన్నారు. కార్యక్రమంలో దామరచర్ల మండల కార్యదర్శి ధీరావత్ లింగానాయక్, రేణుక, గోలి రమేష్, ఎస్‌కె.జలీల్, పద్మ, వెంకటేశ్వర్లు, గుంజ లక్ష్మి, సువర్ణ, విజయ, అనసూయ, రహీమ తదితరులు ఉన్నారు.

## ప్రజాసంక్షేమ పాలన ఘనత కెసిఆర్‌దే

మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజా సంక్షేమ పాలన అందించిన వారిలో కెసిఆర్‌కు మించినవాడే లేడని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. బుధవారం సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా పలు కార్యక్రమాలకు హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వ హాయంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మరేక్కడ లేవన్నారు. ఈ ఘనత మాజి సిఎం కెసిఆర్‌దేనని అన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా అనేకమైన సంక్షేమ పథకాలను ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి సర్కార్ ఇప్పటికీ కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలనే కొనసాగిస్తున్నారే తప్పా కొత్తవి ప్రవేశపెట్టినా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలతో ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా చేతులెత్తిసిందన్నారు. ఇప్పటికైనా సిఎం రేవంత్ రెడ్డి పాలనపై దృష్టిపెట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పి వైస్ చైర్మన్ గోపగాని వెంకటనారాయణగౌడ్, మాజీ జడ్పిటిసి జీడిబిక్షం, నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ధాన్యం ఎగుమతుల్లో జాప్యం తగదు

జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

**ప్రజాపక్షం/తుంగతుర్తి(అర్వపల్లి):** ధాన్యం ఎగుమతులో జాప్యం చేయవద్దని జిల్లా అదనపు కలెక్టర్ పి.రాంబాబు అధికారులను అదేశించారు. బుధవారం అర్వపల్లి మండలంలోని వెల్పుచర్ల, రామన్నగూడెం, అర్వపల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలకు రైతులు అమ్మకానికి తెచ్చిన ధాన్యం, కాంటాలువేసిన ధాన్యం తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సివిల్ సప్లై అధికారులను, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యంను వెంటనే మిల్లులకు ఎగుమతి చేయాలన్నారు. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని అదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ఆగ్రో రైతుసేవా కేంద్రాన్ని ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. ఎరువుల కొరత సృష్టించిన చర్యలు తప్పవన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి, తహసిల్దార్ యాదగిరి, మండల వ్యవసాయశాఖ అధికారి గణేష్ పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి పేదవాడికీ ఇందిరమ్మ ఇళ్లు

నియోజకవర్గంలో రానున్న మూడున్నరేళ్లలో 20వేల ఇళ్లు కట్టించే బాధ్యత నాదే : ఎమ్మెల్యే బాలునాయక్




**ప్రజాపక్షం/దేవరకొండ :** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుడిసెలో నివసిస్తున్న పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఇందిరమ్మ ఇళ్లను కట్టించి ఇస్తున్నదని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని సాయిశివ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు పట్టాల పంపిణి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 5లక్షల ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని ఇందులో భాగంగా ప్రతి నియోజకవర్గంలో 3500 ఇండ్లు కట్టించి ఇస్తున్నామని, పేదల్లో అత్యంత పేదలకు మొదటి ప్రాదాన్యం ఇస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్దిదారులు 30 రోజుల్లో గృహాల నిర్మాణాన్ని ప్రారంభించాలని లేనట్లయితే మంజూరు రద్దు అవుతుందని తెలిపారు. గతంలో దేవరకొండ పట్టణంలో ఇల్లు నిర్మించుకొని రెగ్యులరైజేషన్ కానీ వారికి రెగ్యులరైజేషన్ చేయాలని, గ్రామ కంఠం, వక్ఫ్ భూములలో ఇల్లు నిర్మించుకున్న వారందరికి హక్కు పత్రాలు కల్పించాలని ఆయన జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల జాబితాను పారదర్శకంగా, శాస్త్రీయ పద్దతిలో నియమ నిబంధనలకు అనుగుణంగా రూపొందించడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో 2346 మంజూరు ఉత్తర్వులను బుధవారం ఇస్తున్నట్లు ఆమె వెల్లడించారు. అంతకు మందు జిల్లా గృహ నిర్మాణ శాఖ పిడి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు విధి విధానాలు తదితర అంశాలను వెల్లడించారు. అనంతరం లబ్దిదారులకు ఎంఎల్‌ఏ, కలెక్టర్ మంజూరు పత్రాలు అంశారు. ఈ సమావేశంలో ఆర్డీవో రమణారెడ్డి, తహశీల్దార్లు, ఎంపిడివోలు, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ప్రజా ప్రతినిధులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు, తదితరులు పాల్గొన్నారు.




## త్వరితగతిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంను త్వరతగతిన పూర్తి చేసేందకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అధికారులను అదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రాజీవ్ యువ వికాసం, పారిశుధ్య పనులపై ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులకు వెబ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాకు ఇందిరమ్మ ఇండ్లు 12,868 మంజూరు కాగా మొదటి విడతలో 4322 మంది లబ్ధిదారులకు ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. లబ్ధిదారులు ఇండ్ల నిర్మాణం వివిధ దశలో ఉందని తెలిపారు. రెండవ దశలో 8,546 లక్ష్యానికి గానూ 2017 మంది లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు. మండల స్పెషల్ అధికారులు త్వరలో ఎ ంపిక చేసిన నివేదికను ప్రభుత్వానికి సమర్పించాలన్నారు. దశల వారిగా ట్యాబ్ ఎంట్రీ చేసి ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేయాల న్నారు. ధరల నియంత్రణ కమిటి ఏర్పాటు చేసుకుని ఇండ్ల సామాగ్రి మేస్త్రీ, కూలీ రేట్లు పెరగకుండా ఈ కమిటి పర్యవేక్షించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకానికి జిల్లాలో 60,085 దరఖాస్తులు రాగా 57,985 డెస్క్‌లెవల్ వెరిఫికేషన్ జరిపి బ్యాంకులకు పంపడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పిడి వివి అప్పారావు, హౌజింగ్ పిడి ధర్మారెడ్డి, ఎస్‌సి కార్పోరేషన్ ఈడి శ్రీనివాస్‌నాయక్, డిఎండబ్లూవో జగదీశ్వర్‌రెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజర్ బాపూజీ, డిపివో యాదయ్య పాల్గొన్నారు.

## ఐవిఒ కృషి అభినందనీయం



**ప్రజాపక్షం/కోదాడ:** ప్రజల్లో దేశభక్తి పెంపొందించేందుకు ఇండియన్ వేటరన్ అర్గనైజేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని ప్రముఖ సినీ నటుడు సుమన్ అన్నారు. బుధవారం కోదాడ పట్టణంలోని సింగారం వెళ్లే దారిలో ఐవివో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వంద అడుగుల జాతీయ జెండాను సందర్శించి మాట్లాడారు. అనంతరం పహల్గాంలో మృతి చెందిన సైనికులకు రెండునిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐవివో సభ్యులు హీరో సుమన్‌ను ఘనంగా సన్మానించారు. హీరో సుమన్‌కు ఐవివో స్టేట్ అడ్వయిజర్ కమిటి మెంబర్‌గా రాష్ట్ర అధ్యక్షులు ఉజ్జిని రవీందర్‌రావు ఆమోదంతో నియమించారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల, డాక్టర్ మధుసూదన్‌రావు, డిసిప్లేవ్ కమిటి వెంకన్న, మహదేవ్, నవీన్, షేక్ రహీం, స్టాలిన్, నాగార్జున పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు అమ్మితే పిడి యాక్ట్ నమోదు

బయటి ప్రాంతం నుండి జిల్లాకు నకిలీ విత్తనాలను రానీయవద్దు

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేయాలని, నకిలీ విత్తనాలు అమ్మేవారి పై దాడులు నిర్వహించి కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఇతర ప్రాంతాల నుండి జిల్లాలోకి నకిలీ విత్తనాలు రాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని, ఎవరైనా బయటి ప్రాంతం నుండి ఎట్టి పరిస్థితులలో జిల్లాకు నకిలీ విత్తనాలను రానీయవద్దని ఆమె అన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వరి, పత్తితో పాటు ,ఇతర ఉద్యాన పంట లు, వాణిజ్య పంటలు పండించేందుకు ఎక్కువగా అవకాశం ఉందని ,ఈ సంవత్సరం ముందుగానే వ్యవసాయ సీజన్ ప్రారంభమైనందున రైతులు పంటలు వేసుకునేందుకు ముందే చర్యలు తీసుకుంటారన్నారు. మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, సహాయ సంచాలకులు , సబ్ ఇన్స్పెక్టర్లు వారివారి పరిధిలో నకిలీ విత్తనాల సంఘటనలు జరగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. రైతులు నకిలీ విత్తనాల బారిపడకుండా ముందుగానే అవసరమైన అవగాహన కల్పించాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో 140 మంది గజిటెడ్ అధికారులు వ్యవసాయ శాఖలో పని చేస్తుండగా ,జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి మేరకు మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి 97 మందిని అదనంగా జిల్లాకు నియమించేందుకు అంగీకరించడం పట్ల ఆమె కృతజ్ఞత తెలిపారు. జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ ఎక్కడైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు వ్యవసాయాధికారుల దృష్టికి వచ్చినట్లయితే పోలీస్ సహకారం తీసుకుని వారిని కట్టడి చేయాలని చెప్పారు. నకిలీ విత్తనాలమ్మే వారిపై పి డి యాక్ట్ నమోదు చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్ ,మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లాలో కల్తీ ఎరువులు, నకిలీ విత్తనాలు అమ్మిన, అధిక ధరలకు విక్రయించిన కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ శాఖ , ఉద్యానవన శాఖ అనుసంధానంతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో జిల్లాలోని ఎరువుల డీలర్స్, విత్తన డీలర్స్, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ ఎక్స్టెన్షన్ అధికారులు, తో ఆయిల్ ఫామ్ సాగుపై రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి తో కలిసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాన కాలం సీజన్ ప్రారంభమవుతున్నందున అందుకు అనుకూలంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఫర్టిలైజర్ షాపుల యాజమానులు షాపులలో లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, బిల్ రిజిస్టర్, యూరియా, డిఏపి, తదితర పురుగుల మందులు స్టాకులను సీడ్స్ డీలర్స్ పక్కాగా మెయింటైన్ చేయాలన్నారు. లేనిపక్షంలో సంబంధిత వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో నకిలీ విత్తనాలు తమ ఎరువులను అధిక ధరలకు ఇక్కడ కూడా విక్రయించారు. విక్రయిస్తే అట్టి వారిపై వీడి యాక్ట్ కింద కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం ఈపాస్ మిషన్లు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా డీలర్లకు అందజేశారు. తదుపరి ఆయిల్ ఫామ్ సాగు అనే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, ఉద్యాన శాఖ అధికారి సుభాషిణి, ఎడిఎ నీలిమ, మండల వ్యవసాయ అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

# 6న తుర్కపల్లికి సిఎం రేవంత్ రెడ్డి

బహిరంగ సభ స్థలాన్ని పరిశీలించిన ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో సుమారు రూ.1500 వందల కోట్ల నిధులతో చేపట్టే అభివృద్ధి పనులతో ఆలేరు నియోజకవర్గాని అగ్రగామిగా నిలుపుతామని ఆలేరు ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. వచ్చేనెల, జూన్ 6న ఆలేరునియోజకవర్గంలోని తుర్కపల్లి మండలానికి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రానున్నారని, మండలంలోని వాసాలమర్రి గ్రామం వద్ద సిఎం భారీ బహిరంగ సభా స్థల పరిశీలన చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కలెక్టర్ హనుమంతరావుతో కలిసి సీఎం సభ స్థలాన్ని గుర్తించి అక్కడి పరిస్థితులు, సభా స్థలి,హెలిప్యాడ్,పార్కింగ్ స్థలాలను అనుగుణమైన వాతావరణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని తుర్కపల్లి మండలంలో 700 కోట్లతో గంధమల్ల ప్రాజెక్టు నిర్మాణం, 183 కొట్లతో మెడికల్ కాలేజ్, 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్, 23 కోట్లతో వేద పాఠశాల, కొలనుపాక, కాల్వపల్లి, కల్వర్టు పనులు 15 కోట్లతో, మోటకొండూరు మండల ప్రభుత్వ కార్యాలయలు 10 కోట్లతో, గోదాములకు సంబంధించిన సుమారు 15 వందలకోట్ల పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. జూన్ 6వ తేదీన నిర్వహించే బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటుగా, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, హాజరువుతున్నారని తెలిపారు. ఈ మేరకు ఆలేరు నియోజకవర్గం నుండి సుమారు 50 వేల మందితో పెద్ద ఎత్తున్న తరలివచ్చి ఈ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# పోచంపల్లి ఇక్కత్ చేనేత కార్మికుల కళా నైపుణ్యం అద్భుతం

ఆఫ్రికన్ దేశాల మీడియా ప్రతినిధుల బృందం



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పోచంపల్లి ఇక్కత్ చేనేత కార్మికుల కళా నైపుణ్యం అద్భుతమని ఇక్కడి పర్యాటక ప్రాంతం అమేజింగ్ అని ఆఫ్రికన్ దేశాల మీడియా ప్రతినిధుల బృందం ప్రశంసిస్తూ కొనియాడుతూ అబ్బుర పడిపోయారు. కేంద్ర మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న హెరిటేజ్ టూర్ లో భాగంగా ఆఫ్రికా ఖండానికి చెందిన వివిధ దేశాల 25 మంది మీడియా ప్రతినిధుల బృందం, మిగిలిన ఎనిమిది మంది అధికారులు తో కలిపి 33 మంది బుధవారం పోచంపల్లి టూరిజం చేనేత ఇక్కత్ పరిశ్రమను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు టూరిజం పార్కులోని ఇక్కత్ చీరల చరిత్ర చేనేత మ్యూజియం మగ్గాల యూనిట్లు చేనేత తయారీ ప్రక్రియను వారు పరిశీలించి మగ్గాలపై కూర్చుని చీరలు వేసినట్లుగా ఫోటోలకు ఫోజులు ఇచ్చి కళాకారుల పనితీరును అభినందించారు. కొంతమంది ప్రతినిధులు రాట్నం తిప్పుతూ దారాన్ని వడికారు. మరి కొంత మంది మీడియా ప్రతినిధులు చీర తయారీలో డిజైన్ ఎలా తయారవుతుంది నిశితంగా పరిశీలించి ఫోన్లో బంధించారు. చేనేత వస్త్రాలను కళాకృతులను చూసి సెల్ఫీలు దిగారు. ప్రతినిధుల బృందానికి ఆర్డీవో శేఖర్ రెడ్డి, మంత్రిత్వ శాఖ అధికారులు పోలీస్ ఉన్నతాధికారులతో కలిసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రతినిధుల బృందం పట్టణంలోని సాయిని భరత్ భాస్కర్ సోదరుల కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ ను సందర్శించి చేనేత వస్త్రాల తయారీ పరిశీలించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేశారు. కాగా విదేశీ మీడియా ప్రతినిధుల బృందం పర్యటన సందర్భంగా సిఐ రాములు, ఎస్సై భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తును నిర్వహించారు. ఐఎఫ్‌ఎస్ ఉన్నతాధికారులు, ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి మున్సిపల్ కమిషనర్ అంజన్ రెడ్డి, హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్, డిప్యూటీ ఎమ్మార్వో నాగేశ్వరరావు, రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## నాణ్యమైన పత్తి విత్తనాల ఉత్పత్తికి కృషి

స్పీడ్ ఆర్గనైజర్లకు సూచించిన జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధిః** రైతులకు మెరుగైన విత్తనాలు అందించేందుకు అధికారులు, స్పీడ్ ఆర్గనైజర్లు, సీడ్ కంపెనీలు పరస్పరం సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. బుధవారం ఐడిఓసి సమావేశం హాల్‌లో పత్తి విత్తన ఉత్పత్తిపై వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వర్షాలు అనుకూలంగా ఉన్నాయి. కాబట్టి పంట నష్టం లేకుండా రైతులకు మంచి ఆదాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలో పత్తి విత్తనాలే ప్రధాన ఆదాయం మార్గం కావడంతో, సుమారు 30000 ఎకరాల్లో సాగు కొనసాగుతూ 35000 నుండి 40000 మంది రైతులు విత్తన ఉత్పత్తి చేస్తున్నారని తెలిపారు. అధికారులు, సీడ్ ఆర్గనైజర్లు సీడ్ కంపెనీలు పరస్పరం సమన్వయంతో పనిచేసి, రైతులకు మంచి దిగుబడి కలగడానికి, అందరికి లాభం చేకూరడానికి కృషి చేయాలని పేర్కొన్నారు. ఈ ఏడాది విత్తన ఉత్పత్తి సంబంధించి కంపెనీలు తమ కార్యాచరణ ప్రణాళికను సమర్పించాలని సూచించారు. గత సంవత్సరానికి చెందిన మొత్తం విత్తన ఉత్పత్తి వివరాలతో పాటు ఎంతమంది రైతుల విత్తనాలు జిఓటి పరీక్షలో ఉత్తీర్ణమయ్యిందో, ఎంత పరిమాణం విఫలమైందో వివరించిన జాబితాను సమర్పించాలని స్పష్టంగా ఆదేశించారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ జగ్గు నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, ఏడిఎ సంగీతలక్ష్మి, టెక్నికల్ ఏడీఏ రమేష్, మండల వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ కంపెనీల ప్రతినిధులు, సీడ్ ఆర్గనైజర్లు తదితరులు ఉన్నారు.




## ఆర్అండ్‌బి రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి : ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/ఉండవెల్లి :** అల్లంపూర్ నియోజకవర్గంలోని ఆర్అండ్‌బి రోడ్డు మరమ్మత్తులు పనులు నాణ్యతగా చేపట్టాలని అల్లంపూరు నియోజకవర్గం ఎమ్మెల్యే విజయుడు అన్నారు. బుధవారం నియోజకవర్గంలోని ఐజ నుండి కర్నూలు రోడ్డు మార్గమధ్యలో బ్రిడ్జి కల్వర్టు శిథిలావస్థలో ఉన్న పనులను పరిశీలించి బిజీ కల్వర్టులను ఆరు కిలో మీటర్ల వరకు బీటీ రోడ్డు మరమ్మత్తులు పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధాధికారులకు ఆదేశించారు. అట్టి పనులకు మూడు కోట్ల 50 లక్షల నిధులు మంజూరు చేసినట్లువారు తెలిపారు. పనులు ప్రారంభించి చాలా కాలం అవుతున్న పనులు ఎందుకు ఆలస్యంగా జరుగుతున్నాయని వారు అధికారులను ప్రశ్నించారు. వాహనాలు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, భారీ వాహనాలు వచ్చినప్పుడు సమస్య ఏర్పడుతుందని వారు తెలిపారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి ఆర్అండ్‌బి రోడ్డు పనులు వేగవంతంగా చేసి వాహనదారులకు సమస్య లేకుండా చూడాలని వారు తెలిపారు. ఎమ్మెల్సీ చల్లా వెంకటరామి రెడ్డి చొరవతో నిధులో మంజూరు అయినట్లు వారు తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమంలో ఆర్అండ్‌బి డిఈ సుభాష్ ఏఈ అల్తాఫ్ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 'కొడకండ్ల'కు ఇంటిగ్రేటెడ్ స్కూల్

**ప్రజాపక్షం/కొడకండ్ల:** మండలానికి రాష్ట్ర ప్రభుత్వం ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు చేయడాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ మండల శ్రేణులు హైదరాబాద్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిని, నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సి రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు, ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా వారికి శాలువాలు కప్పి నాయకులు సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరుతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న వలస కూలీ, వ్యవసాయ కార్మికుల పిల్లలకు నాణ్యమైన విద్య అందుబాటులోకి రానుందన్నారు. విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు కృతజ్ఞతలు తెలిపారు. సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, హమ్యా నాయక్, మండల ముఖ్య నాయకులు సునీల్‌రెడ్డి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు రాజేష్ నాయక్, మండల యూత్ అధ్యక్షులు యాకేష్ యాదవ్, మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండీ కలీం, మండల ప్రధాన కార్యదర్శి మోరారి శట్టి అంజయ్య, ఏఎంసీ డైరక్టర్ వెంకన్న, సీనియర్ నాయకులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## 'టీకాల'తోనే సంపూర్ణ ఆరోగ్యం

**ప్రజాపక్షం/సంగెం:** చిన్న పిల్లలను వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డీఎంఎంచ్ఓ డాక్టర్ సాంబశివరావు అన్నారు. బుధవారం సంగెం మండలంలోని కాపుల కనపర్తి గ్రామంలో చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సాంబశివరావు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. చిన్న పిల్లలకు సకాలంలో టీకాలు వేయించి వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి వెంట జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్



ప్రకాష్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ కొమురయ్య, మండల వైద్యాధికారి దేవేందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## వర్షాలు.. ధాన్యం జాగ్రత్త!



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం రాశులపై తగి జాగ్రత్తలు తీసుకోవాలని మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్‌ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రైతులకు సూచించారు. బుధవారం రఘునాథపల్లి మండలం కుర్చపల్లి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో నెలకొన్న ట్రాన్స్‌పోర్ట్ వంటి పలు సమస్యలపై ఆరా తీశారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలును పూర్తి చేయాలని నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్‌వో, ఎంపీడీవో, జిల్లా గ్రంథాలయ చైర్మన్, ఇతర అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## రామప్ప సన్నిధిలో..వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతంబా



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి:** ములుగు జిల్లా కోర్టు ఇన్‌చార్జిగా విధులకు హాజరైన వరంగల్ జిల్లా జడ్జి నిర్మల గీతంబా గట్టమ్మ తల్లిని, రామప్ప ఆలయంను సందర్శించారు. ములుగు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా జడ్జికి గౌరవ ప్రదంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ వేణుగోపాల్‌చారి, జనరల్ సెక్రటరీ రంగోజు బిక్షపతి, ఉపాధ్యక్షులు మేకల మహేందర్, ట్రెజరర్ బానత్ స్వామిదాస్, న్యాయవాదులు కన్నోజు సునీల్ కుమార్, మేకల మానస, రంగోజు సూర్యం, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు సంక్షేమానికి కృషి

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/గీసుకొండ:** రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. బుధవారం గీసుకొండ మండలం అనంతారంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖాధికారులతో కలిసి పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులు ఆధునిక వ్యవసాయ విధానంలో ఉత్పత్తి పెంచుకొని ఆదాయం పొందాలని, రైతులు కాలానికి అనుగుణంగా మారాలని, పంట మార్పిడితో అత్యధిక దిగుబడి వచ్చి లాభాలు ఆర్జించవచ్చన్నారు. రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయడం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. నిత్యం ఫర్టిలైజర్ ఎరువులపై ఆధారపడటం వల్ల భూసారం దెబ్బతింటుందన్నారు. రైతులు శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తీసుకోవడం వల్ల రైతులకు ఉపయోగం ఉంటుందన్నారు. ప్రతీ మండలంలో 125 ఎకరాల భూమిలో సేంద్రీయ వ్యవసాయం చేసి రైతులను చైతన్యం చేయబోతున్నామన్నారు. వ్యవసాయంలో నూతన సాంకేతిక ఉపయోగం పెరిగిందని రైతులు ఆవిధంగా ఆలోచన చేయాలన్నారు. పాడి పరిశ్రమల అభివృద్ధికి తాను కృషి చేస్తున్నానని, ఎరువులు సేంద్రీయ వ్యవసాయం లభ్యమవుతుందన్నారు.

## కమిషనరేట్ క్రైమ్స్ ఎసిపిగా సదయ్య



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మేరకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ క్రైమ్స్ నూతన ఏసిపి గా నియమించబడిన సదయ్య బుధవారం క్రైమ్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టారు. సిఐడి విభాగంలో పనిచేస్తూ బదిలీపై వచ్చిన సదయ్య గతంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలో వివిధ హోదాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించారు.

## స్వయం ఉపాధితోనే ఆర్థిక ఎదుగుదల

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్యూరిఫైయర్ వాటర్ తో వివిధ రోగాలను నివారించవచ్చని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మంజూరునగర్ లో అభిషేక్, రాజేష్ లకు చెందిన ప్రియా ఆక్వా వాటర్ ప్యూరిఫయర్స్ స్టోర్ ను ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరై ప్రారంభించారు. ముందుగా నిర్వాహకులు, కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి స్టోర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భూపాలపల్లి పట్టణవాసులకు ప్యూరిఫయర్స్ వాటర్ ను అందించాలనే ఉద్దేశంతో ఈరోజు స్టోర్ ను ప్రారంభించడం గొప్పవిషయన్నారు. అదే విధంగా, ఈ ప్యూరిఫయర్స్ తో నీటిలో ఉన్న కలుషితాలను తొలగించి, నీటి నాణ్యతను మెరుగుపరుస్తుందన్నారు. ప్యూరిఫయర్స్ వాటర్ కొన్ని రకాల వ్యాధులను నివారించడంలో సహాయపడుతుందన్నారు. యువత స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా అభిషేక్, రాజేష్ లను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతం

### వరంగల్ కలెక్టరు సత్యశారద



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి/ఖానాపూర్:** రైతులు అధైర్యపడద్దని, రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, అధికారులు క్షేత్రస్థాయిలో ధాన్యం కొనుగోళ్లు, రవాణా వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సత్య శారద వరంగల్ జిల్లా మండల కేంద్రంలోని ఖానాపూర్ ,పెద్దమ్మగడ్డ,మనుబోతులగడ్డ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, పర్వతగిరి మండలంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గల ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ధాన్యం సేకరణ, రవాణా తదితర అంశాలను పరిశీలించారు. జిల్లాలో అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలనుతనిఖీ చేసి రైతులు పండించిన వరిధాన్యం తడవకుండా తీసుకొంటున్న జాగ్రత్తలను పరిశీలించి సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల నుండి ధాన్యం పక్కాగా సేకరిస్తామని,ఆందోళనకు రైతులు గురికావద్దని కలెక్టర్ సూచించారు. మాయిచ్చర్ వచ్చిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపించే ఏర్పాటు చేయాలని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. రానున్న మూడు రోజుల్లో వర్షాలు పడే అవకాశం ఉన్నందున జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించాలనిఆదేశించారు. టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. సివిల్ సప్లయి, సహకార శాఖ, ఐకెపి, హార్టికల్చర్, తదితర సంస్థల ఆ ధ్వర్యంలో నిర్వహించే కొనుగోలు కేంద్రాలలో లక్ష్యానికి చేరువలో ఉన్నామని, రైతులు అనవసర వదంతులు నమ్మవద్దని కోరారు. తడిసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరగా జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకొంటామన్నా రు. డిఆర్‌డిఓ కౌసల్యదేవి, జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా పౌర సరఫరాల జిల్లా మేనేజర్ సంధ్యారాణి, జిల్లా పౌర సరఫరాలశాఖ అధికారి కిష్టయ్య, ఆర్‌డిఓ సత్యపాల్‌రెడ్డి, నర్సంపేట వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ శాఖమూరి హరిబాబు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే ముస్తఫా, పల్నాటి శ్రీను, తహసీల్దారు, మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా సంక్షేమ పథకాలు

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వివిధ సంక్షేమ పథకాలను జిల్లాలో సజావుగా అమలుచేసేందుకు వివిధ శాఖలకు చెందిన అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్‌తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ధాన్యం సేకరణ, 3 నెలల రేషన్ సరఫరా, భూ భారతి, ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం, వానాకాలం పంట సాగు, బడి బాట, సీజనల్ వ్యాధులపైన కలెక్టరేట్‌లోరివ్యూ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఈ సీజన్‌లో ఎన్నడు లేనివిధంగా పెద్ద ఎత్తున ధాన్యం కొనుగోలు చేసి రికార్డు సృష్టించామన్నారు. వర్షాల నేపథ్యంలో జూన్ 4లోగా అన్నికేంద్రాలలోఉన్న ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి అవ్వాలన్నారు. ఇప్ప టివరకు 1లక్ష 58వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుచేసి, 32,066 మంది రైతులుకు రూ.335కోట్ల నగదు జమ అయిందన్నారు. సన్నవడ్లకి 5345 మంది రైతులకు రూ.9.69కోట్ల నగదు చెల్లించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్, జులై, ఆగష్టు నెలలకు సంబంధించి బియ్యాన్ని ఒకేసారి పంపిణి చేయాలనినిర్ణయించిన నేపథ్యంలో 3నెలల రేషన్‌ని ఎలాంటి ఇబ్బం దులు రాకుండా సాఫీగా లబ్దిదారులకు అందించాలన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో మండలాలలో పెడుతున్న యూనిట్స్ వివరాల జాబితాను ఎంపీడీవోలు ఇవ్వాలన్నారు. భూభారతిని జూన్ 3నుండి 20వ తేదీ వరకు సదస్సులను నిర్వహించాలన్నారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌లు, ఆర్డీవోలు, సివిల్ సప్లై డీఎం ఉన్నారు.

# పశ్చిమ విద్యారంగంలో.. మరో మణిహారం

### రూ.200కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల

### ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** వరంగల్ పశ్చిమ విద్యా సిగలో మరో మైలురాయి దాటిందని,ఈ మహత్తర ఘట్టానికి 200 కోట్లతో జీఓ జారీ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు జిల్లా, నియోజకవర్గ ప్రజల పక్షాన ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలుపుతున్నట్లు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు.హనుమకొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో బుధవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రధానంగా విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉన్న వరంగల్ నగరంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేయడం ద్వారా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం విద్యాహబ్‌గా మారనున్నదని తెలిపారు. మన ప్రజాప్రభుత్వంలో జరుగుతున్నాయని, మెడికల్ హబ్ గా,ఎడ్యుకేషన్ హబ్ గా, ఆధ్యాత్మిక నగరం గా అభివృద్ధి చెందుతున్నదని, చరిత్రలోఎన్నడూ జరగని భద్రఖాళి అమ్మవారి మాడ వీధులు,చెరువు ప్రక్షాళన పనులు జరుగుతున్నాయన్నారు. కొడిగుడ్డు మీద ఈకలు పీకే పనిలో ప్రతిపక్ష నాయకులున్నారని, గతంలో వారి హయాంలో రహదారి చిరువ్యాపారుల కోసం షట్టర్ ఏర్పాటు చేసి కేవలం వారి బినామీలకు ఇచ్చుకున్నది వాస్తవం కదా అని ప్రశ్నించారు. రోడ్డు వెడల్పు కార్యక్రమంలో నష్టపోతున్న చిరు వ్యాపారాలకు వేజ్ అండ్ నాన్వేజ్ కాంప్లెక్స్ లో అవకాశాలు కల్పిస్తానని మీడియా ముఖంగా భరోసా కల్పించారు.పీసీసీ సభ్యులు ఈవి శ్రీనివాస్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మునిసిపల్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా అధ్యక్షులు బంక సరళ యాదవ్,జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షులు రామకృష్ణ, బ్లాక్ అధ్యక్షులు లక్ష్మి రెడ్డి, సంపత్ యాదవ్, అంబేద్కర్ రాజు పాల్గొన్నారు.

## 'సమన్వయంతోనే' పుష్కరాలు సక్సెస్

### జయశంకర్ కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో 12రోజుల పాటు నిర్వహించిన సరస్వతి పుష్కరాలు అన్ని శాఖల సమన్వయంతోనే సక్సెస్ చేయగలిగామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే తో కలిసి కాలేశ్వరం సరస్వతి పుష్కరాల సక్సెస్ మీట్ ఏర్పాటు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. పుష్కరాలకు 30.లక్షల మందికి పైగా భక్తులు వచ్చారని తెలిపారు. అనంతరం జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ 3 వేల మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం చిన్న గ్రామమని లక్షల్లో భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు రాకుండా చేశామని తెలిపారు. కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఎఎస్పీ బోనాల కిషన్, డిపిఆర్ఓ శ్రీనివాస్, కాటారం డిఎస్పీ రామిరెడ్డి తదితరులు. పాల్గొన్నారు.

## రైతులు అధైర్య పడొద్దు..

### కలెక్టర్ అద్వైత్‌కుమార్



**ప్రజాపక్షం/ తొర్రూరు :** ప్రభుత్వం సూచించిన ప్రకారం రైతుల నుంచి ధాన్యం పక్కాగా సేకరిస్తామని రైతులు అధైర్య పడవద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అన్నారు. బుధవారం మహబూబాబాద్ జిల్లాలోని మరిపెడ మండలం తండ ధర్మారం, పెద్దవంగర మండలం పోచంపల్లి, గంట్లకుంట, చిట్యాల, తొర్రూరు మండలం మాటేడు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ, రవాణా తదితర అంశాలపై పర్యటించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం ఉత్పత్తి అయినా అందుకు అనుగుణంగా కేంద్రాల నిర్వహణ చేశామన్నారు. రెండు, మూడు రోజుల్లో పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేసేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక అధికారులు, అదనపు కలెక్టర్, తాను స్వయంగా పర్యటించడం జరుగుతుందన్నారు. టార్పాలిన్ అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా సహకార శాఖ అధికారి వెంకటేశ్వర్లు, సంబంధిత మండలాల తహశీల్దార్లు, సంబంధిత శాఖ సిబ్బంది ఉన్నారు.

## ఆపద సమయాల్లో వలంటీర్లు సేవలందించాలి

### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

### అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఆపదమిత్ర వలంటీర్లకు శిక్షణ



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్:** ఆపదమిత్ర వాలంటీర్లు ప్రకృతి విపత్తులు, ఆపద సమయాల్లో బాధ్యతతో తమ సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. బుధవారం హనుమకొండ జిల్లా మడికొండ శివారులోని దుర్గభాయి మహిళా శిశు వికాస కేంద్రం ప్రాంగణంలో జిల్లా అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో ఆపద మిత్ర వలంటీర్ల శిక్షణ ప్రారంభించారు. కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ ఏదైనా విపత్తులు, ఆపద సమయంలో ప్రాణ,ఆస్తి నష్టం వాటిల్లకుండా కాపాడేలా ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య, మత్స్య, అగ్నిమాపక శాఖలను భాగస్వామ్యం చేస్తూ ఆ శాఖ ల అధికారులు సీపీఆర్ చేయడం, అగ్నిప్రమాదాల నుండి కాపాడడం, వరదలు సంభవించినప్పుడు ఎలా రెస్క్యూ చేస్తారనే వివరాలను తెలియజేస్తారని అన్నారు. జిల్లా అగ్నిమాపక అధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు, ఇతర ఆపద సమయంలో ప్రాణ, ఆస్తి నష్టం కలగకుండా కాపాడేందుకు ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, మెప్మా కోర్డినేటర్ రజిత రాణి, మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ జయశ్రీ పాల్గొన్నారు.

### విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు స్థల పరిశీలన

హనుమకొండ లో విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. బుధవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్ సమీపంలోని పాత ఆర్ అండ్ బీ క్వార్టర్స్ భవన సముదాయం ఆవరణలో ప్రతిపాదిత 33/11కెవి సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ఆర్ అండ్ బీ, విద్యుత్, రెవెన్యూ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు. స్థల విస్తీర్ణం, భవన వివరాలను ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబును అడిగి తెలుసుకున్నారు. స్థలానికి సంబంధించిన మ్యాపును పరిశీలించారు.విధ్యుత్ శాఖ ఎస్ఈ మధుసూదన్, డీఈ సాంబరెడ్డి, రెవెన్యూ, ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

## తడిసిన పంటలకు ప్రభుత్వానిదే బాధ్యత

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎస్.వీరయ్య




**ప్రజాపక్షం/మరిపెడ:** అకాల వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యానికి ప్రభుత్వమే బాధ్యత వహి ంచాలని సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు ఎస్. వీరయ్య డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా శిక్షణ తరగతుల్లో భాగంగా మరిపెడలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన విలేకర్లతో మా ట్లాడారు. పంట కొనుగోలు కేంద్రానికి తెస్తే నిర్లక్ష్యం వల్ల ధాన్యం బస్తాలు తడిసి రైతులు ఇబ్బంది పడుతున్నా పట్టించుకోడం లేదన్నారు. అంతేకాక ఈ సంవత్సం ఇప్పటికే 10రోజుల ముందురుతుపవనాలువచ్చాయి కానీ ప్రభుత్వం దగ్గర వ్యవసాయ ప్రణాళికలు లేకపోవడం సిగ్గుచేటన్నారు. వ్యవసాయ ప్రణాళికలు, రుణ ప్రణాళిక లేకుండా కలెక్టర్లను సిఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గునిగంటి రాజన్న, సూర్నపు సోమయ్య, ఆకుల రాజు, అల్వాల వీరయ్య, కుంట ఉపేందర్, కందనూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి మధుసూధన్, నాయకులు బాణాల రాజన్న, బోడపట్ల రాజశేఖర్, కొండ ఉప్పలయ్య, కందాల రమేష్, గార్ల మండల కార్యదర్శి అలవాల సత్యవతి, దొంతు మమత, పాల్వాయి ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వరదలపై అప్రమత్తంగా ఉండాలి

### తహసీల్దార్ శ్రీనివాస్

**ప్రజాపక్షం/వాజేడు :** రానున్న వరదలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తహసిల్దార్ శ్రీనివాస్ అన్నారు. వాజేడు మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం మండల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో రానున్న వర్షాకాలంలో వరదల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు సమాచారం అందించేలా ఉండాలన్నారు. వరదలలో ప్రజలకు ఎటువంటి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టి, ప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని అన్నారు. వరదలలో రోడ్లు తెగిన చెరువులు తెగిన, ఇల్లు కూలిన ఎప్పటికప్పుడు సమాచారం తెలపాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ సర్దార్ సింగ్, ఎంపీడీవో విజయ, వాజేడు ఎస్సై రాజ్ కుమార్, ఎంపీఓ శ్రీకాంత్, విద్యుత్ శాఖ ఏఈ, వైద్య శాఖ, గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

# సమగ్రాభివృద్ధి కోసం సిపిఐ రాజీలేని పోరాటాలు

### సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



**ప్రజాపక్షం/హసన్ పర్తి:** జిల్లా సమగ్రాభివృద్ధికై సిపిఐ రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని, హసన్ పర్తి మండల కేంద్రంలో సిపిఐ హనుమకొండ జిల్లా 2వ మహాసభలు విజయవంతంగా ముగిసాయని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. బుధవారం హసన్ పర్తి మండల కేంద్రంలో సిపిఐ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి మాట్లాడుతూ కామ్రేడ్ గంగిళ్ళ లింగారెడ్డి నగర్‌లో మే 26, 27 తేదీల్లో రెండు రోజుల పాటు సిపిఐ హనుమకొండ జిల్లా 2వ మహాసభలు విజయవంతంగా జరిగాయని, ఈ మహాసభలో ప్రజా సమస్యలపై పలు తీర్మానాలు చేసిందని, జిల్లా సమగ్రాభివృద్ధికై సిపిఐ పోరాటాలు ఉధృతం చేయడంతో పాటు రాజీలేని పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. రైతాంగ సమస్యలను పరిష్కరించాలని, ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద తాలు తరుగు పేరిట మిల్లర్లు ఒక క్వింటా ధాన్యానికి 5 కిలోల వరకు తరుగు తీస్తున్నారని అన్నారు. ఈ మిల్లర్ల దోపిడీని అరికట్టి తరుగు పేరుతో కోత పెట్టిన ధాన్యానికి డబ్బులని తిరిగి రైతులకు చెల్లించాలని, అసంపూర్తిగా ఉన్నా దేవాదుల ప్రాజెక్టు, గండిపల్లి, గౌరవెల్లి వరద కాల్వను పూర్తి చేయాలని, మడికొండ రాంపూర్‌లో ఉన్న డంపింగ్ యార్డును ఎత్తివేయాలని, ప్రైవేట్ హాస్పిటల్ లో విచ్చల విడి దోపిడీని అరికట్టాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని నియంత్రించాలని, రైల్వే కోచ్ పరిశ్రమకు భూములుకోల్పోయినవారికి ఇంటికో ఉద్యోగం కల్పించాలని పలు తీర్మానాలు చేసిందన్నారు. వాటి అమలు కోసం జిల్లా సమగ్రాభివృద్ధికై సిపిఐ రానున్న రోజుల్లో రాజీలేని పోరాటాలు చేస్తుందని తెలిపారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు నూతన జిల్లా కౌన్సిల్ ను ప్రకటించరాని, ఏకగ్రీవంగా నూతన జిల్లా కౌన్సిల్ ను ఎన్నుకోవడం జరిగిందని తెలిపారు.

### హనుమకొండ జిల్లా సిపిఐ నూతన కౌన్సిల్

45 మందితో నూతన సిపిఐ జిల్లా కౌన్సిల్, 19 మందిలో జిల్లా కార్యవర్గం ఎన్నిక జరిగిందని వారు తెలిపారు. జిల్లా కార్యదర్శిగా కర్రె బిక్షపతి, సహాయ కార్యదర్శులుగా తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, కార్యవర్గ సభ్యులుగా సిరబోయిన కరుణాకర్, అదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, నద్దునూరి అశోక్ స్టాలిన్, ఉట్కూరి రాములు(రైతు సంఘం), కర్రె లక్ష్మణ్(వ్యవసాయ కార్మిక సంఘం), నకీర్తి ఓదెలు, భాషబోయిన సంతోష్(విద్యార్థి సంఘం), మంచాల రమాదేవి(మహిళ సమాఖ్య), జక్కు రాజు గౌడ్(ఎఐటియూసి), ఎదునూరి వెంకట్రాజం, బత్తిని సదానందం, కొట్టేపాక రవి, మునగాల బిక్షపతి, నేదునూరి రాజమౌళి లతో పాటు 45 మంది జిల్లా కౌన్సిల్ సభ్యులను ఎన్నుకున్నారు.సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, ఆహ్వాన సంఘం అధ్యక్షుడు నేదునూరి రాజమౌళి, రాష్ట్ర సమితి సభ్యులు నద్దునూరి అశోక్ స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల బిక్షపతి, బత్తిని సదానందం, ఎదునూరి వెంకట్రాజం, జక్కు రాజు గౌడ్, కొట్టేపాక రవి, మండల కార్యదర్శి మెట్టు శ్యామ్ సుందర్ రెడ్డి, నాయకులు రాజు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## కాలువ నిర్మాణ పనులు వేగవంతం

### కమిషనర్ అభిషేక్ అగస్త్య

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాలువ నిర్మాణ పనులు వేగవంతంగా చేపట్టాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలోని 10వ డివిజన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యటించారు. ఐటి హబ్ వద్ద నుంచి చేపట్టిన కాలువ నిర్మాణ పనులను కమిషనర్ పరిశీలించారు. కాలువ నిర్మాణానికి సంబంధించి వెడల్పు, లోతు వంటి వివరాలను తెలుసుకున్నారు. నిర్మాణంలో జాప్యం లేకుండా పనులు వేగవంతంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలువ నిర్మాణానికి విద్యుత్ స్తంభాలు అడ్డురాకుండా పక్కకు తరలించాలన్నారు. కార్పొరేటర్ చావా మాధురి నారాయణరావు, ఇంజనీరింగ్ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/కరకగూడెం:** మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుసయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ద్వితీయ పుత్రుడి వివాహం కరకగూడెం మండలంలో ఇటీవల జరిగింది. బుధవారం రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క వారి స్వగృహానికి వెళ్ళి నూతన వధూవరులకు పట్టు వస్త్రాలు అందించి, నిండు నూరేళ్ల పిల్లాపాపలతో సుఖ సంతోషాలతో జీవించాలని మనసారా ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ తన తోబుట్టుతో సమానమైన నా ఆడపడుచు అని మంత్రి సీతక్క కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, కుటుంబ సభ్యులు, యువకులు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ భూమికి హద్దులు గుర్తింపు...



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మంరూరల్ మండలం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని ఏదులాపురం రెవిన్యూలోని సర్వే నెంబర్ 87లో ఉన్న ప్రభుత్వ భూమికి రెవెన్యూ ఆధ్వర్యంలో బుధవారం హద్దులను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా తహశీల్దార్ రాంప్రసాద్ స్వయంగా ఫీల్డ్‌పై సర్వేయర్‌తో హద్దుల గుర్తింపు ప్రక్రియను పరిశీలించారు. కాగా పక్కన వెంచర్లవారు ఫ్లాట్ రాళ్లను ఏర్పాటు చేసుకోగా వాటిని తొలగించారు. అలాగే 8చోట్ల పాయింట్ రాళ్లతో పాటు, ప్రభుత్వ భూమిగా బోర్డును ఏర్పాటు చేపించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడారు..రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్యాక్రాంతం కాకుండా స్వాధీన పరుచుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వ భూమి కబ్జాకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుని జైలుకు సైతం పంపించడం జరుగుతుందని హెచ్చరించారు. ఖమ్మంరూరల్ మండలంలో పూర్తి స్థాయి సర్వేను చేసి ప్రభుత్వ భూములను గుర్తించి స్వాధీన పరుచుకోవడంతో పాటు ఆక్రమణలు ఉంటే తొలగించడం జరుగుతుందన్నారు. ఇకార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్‌రూం సముదాయాన్ని పరిశుభ్రం చేసిన అధికారులు

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ నేలకొండపల్లి :** ఎట్టకేలకు అధికార యంత్రాంగం స్పందించింది. దశాబ్ద కాలం క్రితం పనులు ప్రారంభించిన డబుల్ బెడ్‌రూం ఇండ్ల సముదాయ పరిసరాలను శుభ్రం చేశారు. నేలకొండపల్లి మండల పరిధిలోని గువ్వలగూడెం గ్రామంలో 30 డబుల్‌బెడ్‌రూం ఇండ్ల సముదాయాన్ని ప్రారంభించారు. కొన్నింటికి శ్లాబ్ వేయగా మరికొన్ని శ్లాబ్ దశలో ఉన్నాయి. ఏమి జరిగిందో కానీ పదేళ్ల నుంచి వాటిని పట్టించుకోలేదు. ఈనెల 12న మేము ఏమి చేశాం పాపం మాకెందుకి శాపం అనే పేరుతో కథనాన్ని 'ప్రజాపక్షం' దినపత్రిక ప్రచురించింది. దీనికి స్పందించిన అధికారులు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధుల నుంచి పరిసరాలను శుభ్రం చేశారు. రోడ్లను నిర్మించారు. ఆలస్యంగానైనా స్పందించిన అధికారులు వెంటనే పనులు పూర్తి చేసి లబ్దిదారులకు అందించాలని గువ్వలగూడెం ప్రజలు కోరుకుంటున్నారు.

## మహిళ మిస్సింగ్

### పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన తల్లిదండ్రులు

**ప్రజాపక్షం/వైరా:** వైరాలో షారోన్ చర్చికి ప్రార్ధన కోసం వచ్చిన మట్టే కళ్యాణి వయసు 25 సంవత్సరాలు, ఆమె కూతురు రుతిక వరసు 5 సంవత్సరాలు, కనిపించకపోవడంతో ఆమె తండ్రి మట్టే రాములు వైరా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తిరుమలాయపాలెం మండలం జూపెడ గ్రామానికి చెందిన మట్టే కళ్యాణికి గత కొన్ని రోజుల నుంచి మానసిక పరిస్థితి బాగోలేక ఖమ్మంలోని మానసిక వైద్యశాలలో, దర్గాల వద్ద చూపించిన తగ్గలేదని దాంతో బుధవారం వైరాలోని షారోన్ చర్చికి ప్రార్ధన చేపిద్దామని తల్లిదండ్రులు తీసుకొని వచ్చారు. చర్చిలో ప్రార్ధనకి హాజరైన కళ్యాణి సాయంత్రం నాలుగు ఒంటల సమయంలో తన కూతురితో బయటికి వెళ్లింది. కొద్దిసేపటికి గమనించిన తల్లిదండ్రులు బయటకు వచ్చి వెతుకులాడగా ఎక్కడ కనిపించలేదు. చర్చి పరిసర ప్రాంతాల్లో ఉన్నవారు ఆటో ఎక్కి తల్లాడ వైపు వెళ్లిందని చెప్పినట్లు వారు తెలిపారు. కళ్యాణి పింక్ డ్రెస్ బ్లాక్ లెగ్గిన్ దుస్తులు ధరించి ఉంది. వివరాలు తెలిసిన వారు వైరా పోలీసులకు సమాచారం అందించగలరు. వైరా ఏసిపి 8 712659146, వైరా సిఐ 8712659147, వైరా ఎస్సై 871 26 5 9148 నెంబర్లను సమాచారం అందించాలని వైరా పోలీసులు తెలిపా రు.

## నేడు ముగ్గురు మంత్రుల పర్యటన

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం జిల్లాలో నేడు ముగ్గురు మంత్రులు పర్యటించనున్నారు. గురువారం ఖమ్మం సమీకృత కలెక్టరేట్‌లో జరిగే ధాన్యం సేకరణ, ఇందిరమ్మ ఇండ్లు, భూ భారతి, వానాకాలం సాగుకు సంబంధించి నిర్వహించే సమీక్షా సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, జిల్లా ఇంచార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లతో పాటు ఎంపి రామసహాయం రఘురాంరెడ్డి, ఎంఎల్‌ఏలు, ఎంఎల్‌సి లు తదితరులు పాల్గొంటారు.

## కండక్టర్ల నియామక ప్రచారం నమ్మొద్దు

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** టిజిఎస్ ఆర్టిసి ఖమ్మం రీజియన్ పరిధిలో అవుట్ సోర్సింగ్ పద్ధతిలో కండక్టర్ల నియామక ప్రచారాన్ని నమ్మవద్దని రీజినల్ మేనేజర్ ఎ. సరిరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటువంటి అవుట్‌సోర్సింగ్ పద్ధతుల్లో కండక్టర్లను నియమించడం జరగడం లేదని ఇవి పూర్తిగా తప్పుడు ప్రకటనలని ప్రజలునమ్మవద్దని సూచిం చారు.

## సిపిఐ మణుగూరు పట్టణ, మండల ముఖ్యుల సమావేశం

**ప్రజాపక్షం/మణుగూరు:** సిపిఐ మణుగూరు పట్టణ, మండల ముఖ్యుల సమావేశం సిపిఐ పార్టీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పినపాక నియోజకవర్గం కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మహిళా సమైక్య జిల్లా కార్యదర్శి మున్నా లక్ష్మి కుమారి, సిపిఐ మణుగూరు మండల కార్యదర్శి జంగం మోహన్ రావు, పట్టణ కార్యదర్శి , జిల్లా సమితి సభ్యులు ఎస్కే సర్వర్, సొందే కుటుంబరావు,ఎఐటియుసిమణుగూరుమండలఅధ్యక్ష కార్యదర్శులు, మాజీ ఎంపిపి, గౌరవ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి చట్టం 2025అమలు చేసేందుకు జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశాల మేరకు జూన్ 3 నుండి 20రోజుల వరకు మండలంలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం నందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు భూమి రికార్డుల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటే తప్పనిసరిగా రెవెన్యూ సదస్సులో తమకున్న సమస్యలను అనుమానాలను నివృత్తి చేసుకోవాలని ఆయన అన్నారు. భూ రికార్డులలో పేర్లు లేకుండా పేర్లు నమోదు చేయాలన్న భూమి మీద యజమాని ఉండి పాస్ బుక్‌లను రాకపోయినా అలాంటి ఏ సమస్యలున్న భూ భారతి రెవెన్యూ సదస్సులో రైతుల వద్ద నుండి దరఖాస్తులు స్వీకరించబడతాయని ఆయన అన్నారు. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

### మహిళా సంఘాల ఉత్పత్తులకు

# డిమాండ్ సృష్టించాలి



### జన సంచారం ఉన్న ప్రదేశాలలో ఉత్పత్తులను ప్రదర్శించాలి

### ఖమ్మం మహిళా మార్ట్‌ను ప్రారంభించిన మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహిళాసంఘాలు తయారు చేసే ఉత్పత్తులకు ప్రణాళికాబద్ధంగా డిమాండ్ సృష్టించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఖమ్మం నగరంలో రూ. 30లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మహిళా మార్ట్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాలు తయారు చేసిన పరికరాలు, వస్తువులు, విక్రయం కూడా వారి ద్వారానే జరగాలని పట్టుదలతో కలెక్టర్ మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశారన్నారు. దళారులకు లాభం వెళ్లకుండా మహిళా సంఘాలు లాభపడాలనే ఆకాంక్షతో ప్రభుత్వం మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేసిందన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళా సంఘాలు తయారు చేసే వస్తువులను విక్రయించేందుకు హైదరాబాద్‌లోని శిల్పకళారామం వేదికలో అవకాశం కల్పించారన్నారు. అదేవిధంగా ఖమ్మం నగరంలో ప్రయోగాత్మకంగా మహిళా మార్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఖమ్మం నగరంలో నలువైపులా ఉన్న నాలుగు మార్కెట్లలో కూడా మహిళా సంఘాల కోసం ప్రత్యేకంగా మార్ట్ లాంటి సౌకర్యాలను కల్పించాలన్నారు. ముదిగొండ మహిళలు బ్యాగులు తయారు చేశారని బ్రాండెడ్ షాపుల కంటే చాలా బాగున్నాయన్నారు. మనం తయారు చేసిన వస్తువుకు వ్యాపారం జరగాలంటే అన్ని చోట్ల ప్రదర్శన చేయాలన్నారు. బస్టాండ్, రైల్వే స్టేషన్ వంటి జన సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కూడా చిన్న చిన్న స్టాల్స్ వంటివి ఏర్పాటు చేసుకోవాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాలు ప్రజలు వాడుకునేలా వస్తువులు తయారు చేయాలన్నారు. పిల్లలను లింగ బేదం లేకుండా ఉన్నత చదువులు చదివించాలని అప్పుడే మనం పేదరికం నుంచి బయటకు వస్తామన్నారు.

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మహిళలను ప్రత్యేకంగా, ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఖమ్మంజిల్లాలో ప్రత్యేకంగా టీ స్టాల్, షీ రాక్స్ సెంటర్స్, మహిళలకు లాభం కలిగేలా అనేక కార్యక్రమాలను ప్రత్యేకంగా అమలు చేస్తున్నామన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ఉత్పత్తి చేసే 20 రకాల వస్తువులు మన జిల్లా బ్రాండింగ్‌తో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకాష్ నగర్ 29వ డివిజన్ టియుఎఫ్ఐడిసి నిధులు రూ. 60 లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పనులు నాణ్యతతో పది కాలాల పాటు ఉండేలా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, డిఆర్‌డివో సన్యాసయ్య, ఆర్డివో జి. నర్సింహారావు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకటరెడ్డి, వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలను యాజమాన్యానికి తెలిపిన గుర్తింపు సంఘం నాయకులు

**ప్రజాపక్షం/ఇల్లెందు:** ఎఐటియుసి అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గుర్తింపు సంఘం నాయకులు ఇల్లెందు ఏరియాలోని కార్మికుల సమస్యలను యాజమాన్యానికి తెలిపారు. స్థానిక ఏరియా జిఎం కార్యాలయంలో బుధవారం ఏర్పాటుచేసిన నెలవారి జిఎం స్థాయి సమావేశంలో గుర్తింపుసంఘం శాఖాకార్యదర్శి మహమ్మద్ నజీర్ అహ్మద్ యాజమాన్యంతో మాట్లాడారు. కెఒసిలో యాక్టింగ్ చేస్తున్న ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్ పదోన్నతులివ్వాలని, కేటీసీ ఫిట్1ఏరియాలో కార్మికుల సౌకర్యార్థం వాహనాలకు షెడ్ ఏర్పాటు, ఫిట్టర్‌గది, ల్యాంపు గదిపై రేకులు మార్చాలని, రీడిప్లాయ్‌మెంట్, బదిలీలపై వివరణ ఇవ్వాలని తెలిపారు. 24సివిల్ ఏరియా రిజర్వాయర్ చుట్టూ కంచె ఏర్పాటు, మరుగుదొడ్లు నిర్మాణం, బోర్‌వెల్స్ వద్ద పంపు ఆపరేటర్లు ప్రస్తుతం సబ్‌స్టేషన్ నందు ఉంటున్నారని వారికి ప్రత్యేక గది ఏర్పాటు చేసి లైటింగ్ కూడా ఏర్పాటు చేయాలని ఏరియా జీఎంకు విన్నవించారు. ఏరియా పరిధిలో అన్నిగనుల్లో, విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న మహిళాఉద్యోగులకు క్రిచ్, డ్రెస్సింగ్‌గదులు, టూల్‌బాక్సులు ఏర్పాటు చేయాలని పలు సమస్యలను ఏరియా యాజమాన్యాలకు విన్నవించగా వారు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలోఏఐటియుసి ఉపాధ్యక్షుడు దాసరి రాజారాం, క్లర్క్ స్టాఫ్ ఇంచార్జీ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ సతీమణి ప్రసవం



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం:** పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సతీమణి పురుడుపోసుకుని పండంటి బిడ్డకు జన్మనించ్చారు. తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. గర్భందాల్చిన నాటి నుండి ఆమె పాల్వంచ ప్రభుత్వ ఆస్పత్రిలోనే వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ప్రసవం బిడ్డను ఎత్తుకున్న కలెక్టర్ ఆనందాన్ని వ్యక్తం చేస్తూ వైద్యులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. స్వయానా కలెక్టర్ సతీమణి ప్రభుత్వాస్పత్రిలో పురుడుపోసుకోవడంతో పలువురు ప్రశంసలు కు రిపిస్తున్నారు. దీంతో ప్రభుత్వవైద్యంపై ప్రజలకు నమ్మకాన్ని పెంచిదని చర్చించుకుంటున్నా రు.

**అభినందించిన సీతక్క:** ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ సతీమణికి కాన్పు చేయించడంపై మంత్రి దనసరి అనసూయ సీతక్క స్వయంగా అభినందించారు. కలెక్టరేట్‌లో జరుగుతున్న సమావేశంలో ఆయనకు షాలువా కప్పి సత్కరించారు. ఉన్నతాధికారులు తీరు ప్రజల్లో నమ్మకాన్ని పెంచుతాయని, కలెక్టర్ సతీమణి గవర్నంట్ ఆస్పత్రిలో ప్రసవించడం అభినందనీయమని, ఇది ఎంతో మందికి ఆదర్శంగా ఉండటంతో పాటు ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లోనమ్మకాన్ని సైతం పెంచిందన్నారు.

**ఎంఎల్ఏ కూనంనేని అభినందన**

పాల్వంచ ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ సతీమణి పురుడు పోసుకోవడం అభినందనీయమని, వీరి తీరు ప్రభుత్వాస్పత్రులపై ప్రజలకు నమ్మకం కలిగేలా చేసిందని కొత్తగూడెం ఎంఎల్ఏకూనంనేని సాంబశివరావు అన్నారు. ఈ మేరకు కలెక్టర్ దంపతులకు శుక్షా కాంక్షలు తెలిపిన ఆయన నవజాత శిశువుకు దీవెనలు అందించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రభుత్వాస్పత్రుల్లో కార్పోరేట్ స్థాయి వైద్యం అందించడానికి సకల సదుపాయా లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ అస్పత్రిలో మోకాలు చికిత్సలు, కవలల జననా లు అనేకం జరిగాయని, ప్రజలకు మెరుగైన సే వలు అందించేందుకు వైద్యాధికారులు కృషి చేస్తున్నారన్నారు. వైద్య సిబ్బంది మరింత బాధ్యతగా వ్యవహరించి పేద ప్రజల మెప్పు పొందే విధంగా మంచి సేవలు అందించాలని సూచిస్తూ డిసిహెచ్ఎస్ డా.రవిబాబునుప్రత్యేకంగాఅభినందించారు.

## ప్రతి మండల కేంద్రంలో 'షీ రాక్స్' సెంటర్లు

### ప్రారంభించిన కలెక్టర్



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** ప్రతి మండల కేంద్రంలో దివ్యాంగ మహిళలచే షీ రాక్స్ సెంటర్ ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. బుధవారం రఘునాథపాలెం మండల తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళల ఆర్థిక ఉన్నతిని కాంక్షిస్తూ గార్లపాటి రమాబాయికి మంజూరైన షీ రాక్స్ సెంటర్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలకు ఆర్థిక భద్రత కల్పిస్తూ దివ్యాంగులకు ఉపాధి కల్పించేలా షీ రాక్స్ పేరిట ప్రభుత్వ కార్యాలయాల వద్ద కంప్యూటర్లతో కూడిన జిరాక్స్ సెంటర్ల ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇందులో భాగంగా రఘునాథపాలెం తహసీల్దార్ కార్యాలయం వద్ద షీ రాక్స్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. తహసీల్దార్ ఎంపిడివో కార్యాలయాల వద్ద జిరాక్స్ షాపుకు మంచి డిమాండ్ ఉందని దివ్యాంగులకు సౌకర్యవంతంగా ఉపాధి పొందే అవకాశం ఉందన్నారు. సిటీజన్ సర్వీస్ సెంటర్, స్కానింగ్, ల్యామినేషన్ వంటి సౌకర్యాలతో భవిష్యత్తులో విస్తరణకు కూడా అవకాశం ఉంటుందన్నారు. సిటీజన్ సర్వీస్ సెంటర్, జిరాక్స్ షాపులను ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద దివ్యాంగులైన మహిళలకు ప్రతి మండల కేంద్రంలో తహసీల్దార్, ఎంపిడివో కార్యాలయాల వద్ద ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ముందుగా దివ్యాంగులకు కేటాయించి జిరాక్స్ కేంద్రాలు ప్రారంభిస్తామని అనంతరం దశల వారీగా మహిళలకు జన సంచారం అధికంగా ఉండే ప్రాంతాలలో షీ రాక్స్ సెంటర్లను కేటాయిస్తామన్నారు. డిఆర్‌డిఒ , రఘునాథపాలెం తహసీల్దార్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.


## మరో సైబర్ నేరస్తుడు అరెస్ట్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** సైబర్ నేరస్తుల వలలో పడి ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టి కోటి అరవైరెండు లక్షల రూపాయల నగదు నష్టపోయిన బోనకల్లు మండలం రాయన్నపేట గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి చెందిన కేసులో మరో నిందితుడి నలువాల అర్జున్‌ను ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. ఈనెల 26 న విజయవాడలో షేక్ సుభాని, దాసరి సునీల్‌కుమార్, సుదలగుంట్ల సాయికృష్ణలను అరెస్ట్ చేయగా ఇదే కేసులో మరో నిందితుడు అర్జున్‌ను బుధవారం సిద్దిపేటలో అరెస్ట్ చేసి ఖమ్మం తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం డిఎస్‌పి సిహెచ్ఆర్‌వి ఫణిందర్ తెలిపారు.

## తెలుగుజాతి ఆణిముత్యం ఎన్‌టిఆర్

### సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** తెలుగు జాతి ఆణిముత్యం స్వర్గీయ నందమూరి తా రక రామారావు అని కొనియాడారు. సత్తుపల్లి శా సనస భ్యురాలు డా.మ ట్టా రాగమయి దయాన ంద్‌విజయ్‌కుమార్. బుధవారం సత్తుపల్లి పట్టణం లో నట విఖ్యాత, మాజీ ము ఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ స్థాపకులు నందమూరి తారకరామారా వు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి శాసనసభ్యురాలు డా.మట్టా రాఘమయి ద యానంద్ పూలమాల వేసి, ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దో మ ఆనంద్, పట్టణ అధ్యక్షుడు గా దే చెన్నకేశవరావు, సీనియర్ నా య కులు తదితరులు పాల్గొన్నారు.


## బంగారం షాపులో చోరీ చేసిన అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్




**ప్రజాపక్షం/మణుగూరు:** ఈ నెల 23వ తేదీ మధ్యాహ్నం రెండున్నర గంటల ప్రాంతంలో మణుగూరు మెయిన్ రోడ్ నందు గల శ్రీవారి జ్యూయలర్స్ షాపులో ఒక్కరు మాత్రమే ఉండడం గమనించి ఒక వ్యక్తి మాస్క్ వేసుకొని షాపు లోపలికి వెళ్లి షాప్‌లో పనిచేస్తున్న ఆమెతో మాటల్లో పెట్టి షాప్‌లో నుండి బంగారు ఆభరణాలు సుమారు 132 గ్రాములు గల బాక్స్ ను దొంగిలించాడు. షాప్ యజమాని దేవతా శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మణుగూరు డిఎస్‌పి రవీందర్ రెడ్డి పర్యవేక్షణలో ఈ బయ్యారంసిఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్ఐ ప్రసాద్, సిసిఎస్ ఎస్ఐ రామారావులు మూడు బృందాలుగా ఏర్పడి నిందితుని కోసంసిసిటివి ఫుటేజీ, లాడ్జిలు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో 27వ తేదీ మంగళవారం ఎస్ఐ ప్రసాద్ తన సిబ్బంది రామారావు, కొర్ర బాలులతో హనుమాన్ టెంపుల్ దగ్గర్లో వాహన తనిఖీలు చేస్తుండగా ఒక వ్యక్తి పోలీస్ వారిని చూసి భయపడి పారిపోవుటకు ప్రయత్నించగా అతనిని వెంబడించి, పట్టుకొని విచారించగా తన పేరు గొర్రెల సత్యనారాయణ, గ్రామం ఆకివీడు, భీమవరం జిల్లా ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన వాడని చెప్పి తాను మణుగూరు శ్రీవారి జువెలరీ షాప్ లో చేసిన దొంగతనం ఒప్పుకొని అందులో నుండి తీసిన బంగారం చైన్లు 6 నల్లపూసల గొలుసు 1, బేబీ రింగ్స్ 5, సుమారు 132 గ్రాముల బరువుగలవి తీసి చూపించాడు. అంతేగాక తాను అంతకు ముందు వరంగల్ సాయి గణేష్ జ్యూయలరీ షాపులో దొంగతనం చేసిన చిన్న చిన్న బంగారం చెవి కమ్మలు 20 జతలు, సుమారు 30 గ్రాములు కూడా చూపించాడు. గొర్రెల సత్యనారాయణ సుమారు 35 పైగా రెండు రాష్ట్రాలలో బంగారు షాప్‌లలో దొంగతనం కేసులు నమోదు అవ్వడం జరిగింది. మణుగూరు, వరంగల్ తో పాటు తిరుపతి, కర్నూల్‌లో కూడా దొంగతనాలు చేసినట్టు నేరాలు ఒప్పుకోవడం, బుధవారం నిందితుణ్ణి మణుగూరు కోర్టులో ప్రవేశపెట్టడం జరుగుతుందని డిఎస్‌పి రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ కేసు ఛేదించిన ఈ బయ్యారంసిఐ వెంకటేశ్వర్లు, మణుగూరు ఎస్ఐ ప్రసాద్, సిసిఎస్ఎస్ఐరామారావు, మణుగూరు సిబ్బంది రామారావు, బాలు, సిసిఎస్ సిబ్బంది వెంకట్ నారాయణ, విజయ్‌లను మణుగూరు డిఎస్‌పి అభినందించారు. ఇటీవల కాలంలో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున ఎవరైనా ఊరు వెళ్తున్నప్పుడు పోలీస్‌లకు తెలియజేయాలని, అదే విధంగా ఇంట్లో విలువైన వస్తువులు, ఆభరణాలు లేకుండా చూసుకోవాలని, ప్రజలందరూ వారి ఏరియాలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని డిఎస్‌పి సూచించారు.

## అశ్రునయనాల మధ్య మదన్‌లాల్ అంత్యక్రియలు

### జనసంద్రమైన ఈర్లపుడి * పాడెమోసి అభిమానాన్ని చాటుకున్న వద్దిరాజు, పువ్వాడ





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గుండెపోటుతో మంగళవారం మరణించిన మాజీ శాసన సభ్యులు, వైరా నియోజక వర్గ బిఆర్‌ఎస్ ఇంచార్జి బానోత్ మదన్‌లాల్ అంత్యక్రియలు బుధవారం వేలాది జనం అశ్రునయనాల మధ్య ముగిశాయి. ఖమ్మంలోని ఆయన స్వగృహం నుంచి స్వగ్రామమైన రఘునాథపాలెం మండలంలోని ఈర్లపుడికి మృతదేహాన్ని తరలించారు. దారి పొడవునా ప్రజలు మదన్‌లాల్‌కు నివాళులర్పించారు. ఖమ్మంజిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు ఈర్లపుడికి చేరుకున్నారు. ఈర్లపుడి జనసంద్రమైంది. మృతదేహాన్ని చూసేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో ప్రజలను నిలువరించడం ఓ దశలో పోలీసులకు ఇబ్బందికరంగా మారింది. రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో గిరిజనులు మదన్‌లాల్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు ఈర్లపుడికి చేరుకున్నారు. మదన్‌లాల్ మృతదేహంపై రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, పలువురు బిఆర్‌ఎస్ నాయకులు బిఆర్‌ఎస్ పతాకాన్ని ఉంచి నివాళులర్పించారు. అంతిమ యాత్ర ప్రారంభం కాగానే రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, పువ్వాడ అజయ్ కుమార్ మదన్‌లాల్ పాడే మోసి మదన్‌లాల్ పట్ల తమకు ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. బిఆర్‌ఎస్ నాయకులు, శాసన సభ్యులు పల్లా రాజేశ్వరరెడ్డి, రాకేష్‌రెడ్డి, కూరాకుల నాగభూషణం, పలువురు మాజీ శాసన సభ్యులు, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. మదన్‌లాల్ తనయుడు మృగేందర్‌లాల్ అంతిమ సంస్కారాలను నిర్వహించారు.

**తుమ్మల నివాళి :**

మాజీ శాసన సభ్యులు బానోత్ మదన్‌లాల్ మృతి పట్ల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సంతాపం తెలిపారు. ఈర్లపుడి గ్రామంలో వారి స్వగ్రామంలో ఉంచిన మదన్ లాల్ భౌతికాయాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. మదన్ లాల్‌తో ఉన్న సన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఓ గొప్ప నాయకున్ని కోల్పోయామని మంత్రి తెలిపారు.

ఫోకస్

# కళారంగం

## నాటకం.. ఓ కళ.. ఓ ప్రేరణ







నాటకం సర్వజనసీయం, సర్వకాలీనం. ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కళల్లో నాటక కళ ఒకటి. ఇది కళ మాత్రమే కాదు... ప్రజలకు ప్రేరణ కూడా. రంగస్థల కళ అనేది మానవ సమాజంలో అతి పురాతనమైన కళారూపాల్లో ఒకటి. మాటలు, భావాలు, శరీర భాష, సంగీతం, నృత్యం మొదలైన ఎన్నో కళారూపాల సమ్మిళితంగా ఇది రూపుదిద్దుకుంది. ఆది మానవుడు తన జీవితంలో జరిగిన సంఘటనలను, భయాలను, ఆశలను, దేవతల పూజలను అనుకరిస్తూ నాట్య రూపంలో పరిణతమైందని చరిత్రకారులు అంటున్నారు. రంగస్థల కళారూపాన్ని గ్రీకు నాటకాల నుండి మొదలు పెట్టినా, అది భారత దేశంలో నాట్యశాస్త్రం ద్వారా ఇంకా శాస్త్రీయంగా అభివృద్ధి చెందింది. శతాబ్దాల క్రితమే ఉన్న నాటక కళ, స్వతంత్రంగానే ఎదిగింది. దాదాపుగా ఒకే కాలంలో పాశ్చాత్య దేశాల్లోనూ, భారతదేశంలోనూ నాటక ప్రక్రియ మొదలయ్యింది. కాలాన్ని బట్టీ, ప్రదేశాన్ని బట్టీ, సంస్కృతిని బట్టీ నాటకం రూపం మారుతుందేగానీ అంతర్లీనంగా దాని మూల సూత్రం మాత్రం ఒక్కటే. అందువల్లే నాటకం బహుళాదరణ పొందిన రంగస్థల ప్రక్రియగావిరసిల్లుతుంది. ప్రస్తుతమున్న నాటకం కాలక్రమేణా రూపం మార్చుకుంటూ విశ్వజనసీయమయ్యింది. ఇటీవల కాలంలో కనుమరుగవుతున్న నాటక రంగాన్ని కాపాడుకోవాల్సిన ప్రతి కళాభిమానిపైనా ఉంది. ప్రపంచవ్యాప్తంగా అనేక రూపాలలో నాటకాన్ని ప్రభుత్వాలు, ప్రజలు సమష్టిగా ప్రోత్సహించాలి. ప్రజలకు నాటక ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలి. విస్తృత స్థాయిలో నాటక సంస్థలకు ప్రోత్సహించడంలో ప్రభుత్వాలు, ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలి. నాటకరంగాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి. మానసిక ఉల్లాసంకోసం నాటకాన్ని ఆస్వాదింపజేయడం అవసరం. అదే విధంగా నాటకం ద్వారా పొందుతున్న మానసిక ఉల్లాసాన్ని ఇతరులతో పంచుకోవడం కూడా తక్షణావసరమే. ప్రాంతాలు, భాషలు, మతాలు, కులాల పేరుతో మారణహోమాలు కొనసాగుతున్న ఈ రోజుల్లో, సంస్కృతుల మధ్య వారధిగా రంగస్థలాన్ని మలచాలి. శాంతి, సమరసతకు రంగస్థలాన్ని మాధ్యమంగా ఉపయోగించాలి. ఎందుకంటే, రంగస్థల కళ సామాజికంగా ఎంతో ప్రభావవంతమైన సాధనం. ఇది ప్రజల హృదయాల్లో మార్పు తీసుకురాగలుగుతుంది. అణచివేత, అన్యాయాలను బహిర్గతం చేస్తుంది. ప్రేమ, శాంతి, మానవతా విలువలను వ్యాప్తి చేస్తుంది. అయితే, నేటి డిజిటల్ యుగంలో రంగస్థల కళ కొంతవరకు చెదరిపోయిన పరిస్థితిలో ఉంది. టెలివిజన్, సినిమా, ఒటిటి మాధ్యమాలు ప్రజలను ఆకర్షిస్తున్నాయి. అయినా, రంగస్థల కళ ప్రత్యేకంగా నిలుస్తుంది, ఎందుకంటే:

ఇది ప్రత్యక్ష అనుభూతిని కలిగిస్తుంది. కళాకారుడు, ప్రేక్షకుడు నేరుగా పరస్పర బంధాన్ని ఏర్పరుచుకుంటారు. సామాజిక సమస్యలను రియలిస్టిక్‌గా, తక్షణంగా ప్రతిబింబించగలిగే శక్తి ఉంది. నాటకాలను ప్రోత్సహించడం ద్వారా స్థానిక సంస్కృతి పరిరక్షణ జరుగుతుంది. యువతలో అభినయ శక్తి, సామాజిక అవగాహన పెరుగుతుంది. ప్రస్తుతం రంగస్థల కళలో ప్రయోగాత్మక నాటకాలు, స్ట్రీట్ థియేటర్, ఇంటరాక్టివ్ థియేటర్, సోషియోపాలిటికల్ థియేటర్ వంటి రూపాలు అభివృద్ధి చెందుతున్నాయి. వీటిని ప్రోత్సహించాలి. అప్పుడే రంగస్థలానికి కొత్త ఊపిరి. నాటకాలకు సరైన గుర్తింపు... నిజమైన గౌరవం.

## ప్రేక్షకులపై బలమైన ముద్ర..




'ఇంటరాక్టివ్ థియేటర్' ప్రేక్షకులపై బలమైన ముద్ర వేస్తుంది. ఇది ఒక సజీవమైన, శక్తివంతమైన ధోరణి. ఇందులో ప్రేక్షకులు కేవలం చూడడానికే కాకుండా, నాటక ప్రదర్శనలో ప్రత్యక్షంగా పాల్గొనే అవకాశం ఉంటుంది. ఇది ప్రేక్షకుడిని ఒక పాత్రధారుడిగా మార్చే నూతన రంగస్థల శైలి. ఇది ఒక ప్రయోగాత్మక రూపం. ఇందులో ప్రేక్షకులు కథనంలో మమేకమవుతారు. తమతమ అభిప్రాయాలు వెల్లడిస్తారు. కథలో... కథనంలో మార్పులు చేస్తారు. ఈ ప్రక్రియలో ప్రేక్షకులు నేరుగా పాత్రలతో మాట్లాడగలగడం విశేషం. అందుకే, ప్రేక్షకుల సూచనలతో కథకు వేర్వేరు ముగింపులు ఉండవచ్చు. అలాగే, ప్రేక్షకుల స్పందనల ఆధారంగా నటులు తమ అభినయాన్ని మలచుకుంటారు. స్థిరమైన స్క్రిప్ట్ లేకపోవడంతో, నటులు పరిస్థితుల్ని బట్టి స్వేచ్ఛగా స్పందించవలసి ఉంటుంది. ఫోరమ్ థియేటర్ అనేది ఇంటరాక్టివ్ థియేటర్‌లో ఒక భాగం. దీనిని ఆగస్టో బోయల్ అభివృద్ధి చేశాడు. సామాజిక అన్యాయంపై కథ చూపించి, ప్రేక్షకుల నుంచి పరిష్కార సూచనలు తీసుకోవడం ఈ శైలికి ప్రత్యేకం. ఇమ్మెన్సివ్ థియేటర్‌లో ప్రేక్షకులు ఒక ప్రదేశంలో తిరుగుతూ, కథలో భాగమైనట్లు అనుభూతి చెందుతారు. అమెరికాలో అత్యంత ప్రసిద్ధమైన, ప్రజాదరణ పొందిన 'స్లీప్ నో మోర్' నటకాన్ని ఇందుకు ఉదాహరణ. కథ ఎలాంటి మలుపులు తిరగాలో... ఏ విధంగా ముగియాలో ప్రేక్షకులే నిర్ణయిస్తారు. ప్రేక్షకులు కథపై అభిప్రాయం తెలపడం, పాత్రలను తాత్కాలికంగా స్వీకరించడం... ప్రదర్శించడం గొప్ప అనుభూతినిస్తుంది. విద్యార్థుల ఆలోచనా శక్తి పెరగడానికి, సామాజిక మార్పుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుంది. సామాజిక చైతన్యం కలిగించేందుకు, పాఠశాలలు, కాలేజీలు, గ్రామాల్లో చర్చలకు వేదికగా ఈ కళారూపాన్ని ప్రదర్శిస్తారు. మానసిక చర్చ, భావోద్వేగ వికాసం కోసం, సామాజిక సమస్యలపై పరిష్కార మార్గాల అన్వేషణ కోసం కూడా ఇది ఉపయోగపడుతుంది. అయితే, పూర్తి నియంత్రణ లేకపోవడం వల్ల కథ అసలు లక్ష్యం పక్కనపడే ప్రమాదం ఉంది. కథనం వివిధ దిశలకు విస్తరించి, మూల భావాన్ని మింగేసే ప్రమాదం లేకపోలేదు. నైపుణ్యంలోని నటులు ఉంటే, సమయస్ఫూర్తితో స్పందించకుంటే, నాటకం నవ్వులపాలవుతుంది. నాటకీయ నిర్మాణంలో అనిశ్చితి ఏర్పడుతుంది. అందుకే, ఇలాంటి ప్రదర్శనలకు అన్ని విధాలా సంసిద్ధలై ఉండాలి. ఆచితూచి వ్యవహరించాలి. సదరు నాటకం ప్రాథమిక లక్ష్యానికి దూరంగా వెళ్లకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తపడాలి.

## దృశ్యాన్ని అనుభూతిగా మార్చే ఇన్‌స్టలేషన్ ఆర్ట్

ఒక దృశ్యాన్ని అనుభూతిగా మార్చడం అనేది సులభం కాదు. అయితే, అలాంటి ప్రయత్నం 20వ శతాబ్దం మధ్య కాలం నుంచి క్రమంగా అభివృద్ధి చెందుతూ, ఒక ప్రత్యామ్నయ కళారూపంగా ఎదిగింది. ఇది పర్యావరణం, దృశ్యాన్ని అనుభూతిగా మార్చే ప్రయత్నం చేస్తుంది. ప్రేక్షకుడిని కళాకృతిలో భాగస్వామిగా మారుస్తుంది. స్థూలంగా చెప్పాలంటే, ఇది శిల్ప కళ, వాస్తుశిల్పం, ధ్వని, వీడియో, లైటింగ్, ప్రత్యక్ష వస్తువులు, స్థల ప్రాముఖ్యత వంటి అనేక అంశాలను కలగలిపిన సమగ్ర కళారూపం. ఇందులో ప్రదర్శన స్థలం కళాకృతిలో భాగమే అవుతుంది. ఆ గదిలో, ఆ ప్రదేశంలో మాత్రమే అర్థవంతంగా ఉంటుంది. ప్రేక్షకుడు లేదా సందర్శకుడు ఈ కళను చూడడమే కాదు... వినేలా, స్పర్శించేలా, అందులో నిడచేలా రూపొందిస్తారు. అయితే ఇవి శాశ్వత రూపాలు కావి. కొన్ని రోజులు లేదా కొన్ని నెలలు మాత్రమే ఉంటుంది. ప్రొజెక్షన్లు, స్పీకర్లు, వెలుతుర్లు, వీడియోలు మొదలైన ఆధునిక మాధ్యమాలను ఉపయోగిస్తారు. నిరసన, గుర్తింపు, గుర్తుచేసుకోవడం వంటి భావాలను సృష్టించేందుకు ఇన్‌స్టలేషన్ ఆర్ట్ మెరుగైన విధానం. ఉదాహరణకు యాయోయి కుసామా (Yayoi Kusama) 'ఇన్ఫినిటీ రూమ్స్' అనేవి మనస్సు లోతుల్లోకి తీసుకెళ్లే అనుభూతిని కలిగిస్తాయి. అధికార దుర్వినియోగం, మానవ హక్కుల గురించి స్పందిస్తాయి. భారత మూలాలున్న ఈ బ్రిటిష్ కళాకారుడు అనిష్ కపూర్ విస్తృతస్థాయి శిల్పాలు, స్థలఆధారిత కళలతో ప్రపంచ ప్రఖ్యాతిని ఆర్జించాడు. వలస కార్మికులు, వనరుల దోపిడీ, పర్యావరణ సమస్యలు వంటి సామాజిక అంశాలపై ఇన్‌స్టలేషన్ ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి. పర్యావరణ నాశనాన్ని తెలియజేసేలా నీటిలో మునిగిన గృహ నిర్మాణాల ప్రదర్శన... పింక్ బుట్టలు, గుడ్డ బొమ్మలు ఉపయోగించి నిర్బంధిత మాతృత్వాన్ని సూచించే ప్రదర్శన వంటివి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. కళా రంగంలో విప్లవాత్మక మార్పులను మోసుకొచ్చిన ఇన్‌స్టలేషన్ ఆర్ట్స్‌పై విమర్శలు లేకపోలేదు. కళా విలువ లేకుండా, ఆలోచన మాత్రమే ఉందంటూ కొందరు విమర్శిస్తున్నారు. అర్థం పట్టుకోలేకపోతే తికమకపెట్టే అనుభూతి మాత్రమే మిగులుతుందని మరికొందరి వ్యాఖ్య. పాత లేదా తక్కు కింద పారేయాల్సిన వస్తువులను యథాతథంగా తిరిగి వినియోగించడం వల్ల వ్యర్థాల సమస్య... పర్యావరణ నష్టం తప్పవన్న వాదన కూడా ఉంది. ఏదిఏమైనా ఇన్‌స్టలేషన్ ఆర్ట్ అనేది ప్రత్యామ్నయ కళలలో ఒక శక్తివంతమైన రూపం. ఇది దృశ్యాన్ని ఊహను మించిపోయేలా చేసి, కళను 'వీక్షించడాన్ని' కాదు, 'అనుభవించడాన్ని' చేస్తుంది. శబ్దం, వెలుగు, దృశ్యాలు – అన్నిటిని కలిపి ఒక విప్లవాత్మక మానసిక ప్రేరణగా రూపొందే ఈ కళ, భావావేశంతో కూడిన ప్రత్యామ్నయ ప్రకటనగా నిలుస్తోంది.








## ఉపాధి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులపై చర్యలు

బికెఎంయు జిల్లా కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న డిమాండ్



**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలో ఉపాధి కూలీలను మస్టర్లు వేయకుండా, డబ్బులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం(బికెఎంయు) జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకుంట్ల వెంకన్న డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని సంతులాల్‌బోడ్ గ్రామంలో బికెఎంయు మండల మహాసభ బిచ్చనాయక్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉపాధి కూలీలకు పనులు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని ఆయన ఆరోపించారు. సంవత్సరానికి 200రోజులు పనిదినాలు కల్పించి రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనులు చేసిన ఉపాధి కూలీలకు తక్షణమే డబ్బులు చెలించాలని డిమాండ్ చేశారు. తొర్రూర్ డివిజన్ కేంద్రంలో జూన్ 8న వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా 3వ మహాసభలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు. నిరంతంర వ్యవసాయ, ఉపాధి హామీ కార్మికులు, రైతాంగం, పేద ప్రజల కోసం పోరాటాలు చేసే వ్యవసాయ కార్మిక సంఘాన్ని ఆదరించాలని ఆయన కోరారు. సమావేశంలో బికెఎంయు జిల్లా అధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి సారిక శ్రీనివాస్, నాదెండ్ల పద్మ, నాయకులు గంగరబోయిన రాజు, కాంతమ్మ, రవి తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి : పల్లా నర్సింహారెడ్డి



**ప్రజాపక్షం/దేవరకొండ :** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ దేవరకొండ మండల కౌన్సిల్ సమావేశం జక్కా మాధవరెడ్డి అధ్యక్షతన పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ వర్షాలు వస్తున్నందున కల్లాల్లో వడ్లు ఇంకా ఉన్నాయని , తక్షణమే అధికారులు స్పందించి లారీలు, హమాలీలను ఎక్కువగా పంపించి రైతులకు ఎలాంటి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలన్నారు. మిల్లర్లు తాలు పేరుతో ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడం లేదని, రైతులకు ఎలాంటి సమస్యలు లేకుండా కలెక్టర్ స్పందించాలని ఆయన కోరారు. వానాకాలం ప్రారంభమైన సందర్భంగా వ్యవసాయానికి సంబంధించి రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని, నకిలి విత్తనాలు అరికట్టాలన్నారు. రైతు బంధు పడని రైతులకు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి దేప సుదర్శన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి నూనె రామస్వామి, కార్యవర్గ సభ్యులు వెంకట్రాములు రాంరెడ్డి, యాదయ్య, గోవర్ధన్, యాదయ్య, లింగమయ్య, పుల్లయ్య, శ్రీను, మల్లేష్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో ఎన్‌కౌంటర్‌పై స్పందించడం అమానుషం

మావోయిస్టులను చంపి సంబురాలా..!

ఆపరేషన్ కగార్‌పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి :** శత్రుదేశంపై విజయం సాధించిన రీతిలో మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై ప్రధానమంత్రి మోదీ, హోంశాఖ మంత్రి అమిత్‌షాలు స్పందించడం అమానుషమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు విమర్శించారు. చత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్ సంఘటనను సుప్రీంకోర్టు సుమోటగా తీసుకోవాలని కోరారు. బుధవారం జనగామలోని సిపిఐ కార్యాలయంలో గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశం జరిగింది. సమావేశానికి కావాటి యాదగిరి అధ్యక్షత వహించగా తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న ఎన్‌కౌంటర్‌పై న్యాయ విచారణకు కేంద్రప్రభుత్వం ముందుకు రాకుంటే సుప్రీంకోర్టు ఈ కేసును సుమోటాగా తీసుకోవాలన్నారు. సిపిఐ మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాల ఎన్‌కౌంటర్‌పై అనేక సందేహాలు వ్యక్తం అవుతున్నాయని, ఈ వయస్సులో అడవిలో ఉన్నారా.. లేక పట్టుకెళ్లి మట్టుపెట్టారా అనే సందేహాలు ఉన్నాయన్నారు. ఆపరేషన్ కగార్ మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు వరకు జరిగిన ఎన్‌కౌంటర్‌పై విచారణ చేయాలని కోరారు. స్థానిక ప్రజల హక్కులు, వనరుల దోపిడికి వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్న వారిని ఏకపక్షంగా ఎన్‌కౌంటర్‌ల పేరుతో చంపడం సమంజసం కాదన్నారు. ఇది శాంతిభద్రతకు విఘాతం కలిగించే చర్యగా చూడాల్సి వస్తుందన్నారు. 2026 మార్చి 31 వరకు నక్సలైట్లను అంతమొందిస్తామని లక్ష్యంగా పెట్టుకొని మరీ ఎన్‌కౌంటర్లు చేస్తున్నారని ఆరోపించారు. శాంతి చర్చలకు తాము సిద్ధమని మావోయిస్టులు ప్రకటించినా కేంద్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే ఎన్‌కౌంటర్లకు పాల్పడుతుందని మండిపడ్డారు. ఇది దేశంలో ప్రజల ప్రజాస్వామిక హక్కులకు విఘాతం కలిగించే అంశమన్నారు. వీట్టన్నింటిని పరిగణలోని తీసుకొని సుప్రీంకోర్టు న్యాయ విచారణ చేపట్టవలసిన అవసరం ఉందన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కమ్యూనిస్టులు ప్రజలను చైతన్య పరచాలని తక్కెళ్లపల్లి పిలుపునిచ్చారు.

### జూన్ 3,4 తేదీల్లో సిపిఐ జిల్లా మహాసభలు

జూన్ 3,4 తేదీల్లో సిపిఐ జనగామ జిల్లా మహాసభలు నర్మెట మండలంలో జరగనున్నాయని పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి తెలిపారు. ఈ మహాసభలను విజయవంతం చేయాలని, మహాసభలకు డెలిగేట్స్ రావడంతో పాటు పలు అంశాలపై తీర్మానాలు చేయాలన్నారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిలర్ సభ్యురాలు పాతూరి సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాసు, నాయకులు చామకూర యాకూబ్, కె యాదగిరి, చొప్పరి సోమయ్య, జువారి రమేష్, రావుల సదానందం, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేలా ఉద్యమాలు

సిపిఐ సూర్యాపేట జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** అన్నివర్గాల ప్రజలకు న్యాయం చేసేలా సిపిఐ ఉద్యమిస్తుందని పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు అన్నారు. బుధవారం సిపిఐ నాయకులు మామిడి వెంకయ్య, సుందరి పద్మ, జక్కుల రమేష్ అధ్యక్షతన పట్టణ మహాసభ హుజూర్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలు, కార్మికులు, రైతుల పక్షాన వారి సమస్యల పరిష్కారానికి సిపిఐ ఉద్యమిస్తుందన్నారు. దేశ స్వాతంత్ర్యోద్యమంలో, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో సిపిఐది కీలకపాత్ర అని గుర్తుచేశారు. మొదటి నుంచి నిజమైన దేశభక్తులు కమ్యూనిస్టులే అని పలు సందర్భాల్లో నిరూపించుకున్నారన్నారు. దేశంలో బిజెపి అనుసరిస్తున్న విధానాలపై అప్రమత్తంగా ఉండాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు ఎం.వెంకటేశ్వర్లు, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉస్తేల నారాయణరెడ్డి, ధూళిపాళ ధనుంజయ్ నాయుడు, పోకల వెంకటేశ్వర్లు, దేవరం మల్లీశ్వరీ, మండవ వెంకటేశ్వర్లు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్, కొప్పోజు సూర్యనారాయణ, సోమగాని కృష్ణ, మామిడి నర్సయ్య, జడ వెంకన్న, ఇందిరాల వెంకటేశ్వర్లు, చక్రాల స్టాలిన్, చెన్నగాని సైదులు, పొనుగుపాటి వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.



## ప్రశ్నిస్తే దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్న మోదీ

ట్రంప్ చెబితే పాకిస్థాన్‌తో యుద్ధాన్ని నిలిపేశారు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంత్‌రావు





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** యుద్ధానికి వ్యతిరేకమని కమ్యూనిస్టులు చెబితే తమని దేశద్రోహులుగా చిత్రీకరిస్తున్నా మోదీ, ట్రంప్ చెబితే మాత్రం పాకిస్థాన్‌తో యుద్ధాన్ని నిలిపివేసి ద్వంద వైఖరిని ప్రదర్శించాడని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు భాగం హేమంతరావు అన్నారు. బుధవారం ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్ క్రాస్ రోడ్‌లో గల మా కాంప్లెక్స్‌లోని పోటు ప్రసాద్, వెంపటి సూర్యనారాయణ మీటింగ్ హాల్లో శాఖ సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. డిబిఆర్ సర్కిల్లోని అరుణ పతాకాన్ని సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. పహల్గాం ఉగ్రదాడిలో మృతులతో పాటు ఇటీవల పలు కారణాలతో మృతి చెందిన సిపిఐ సభ్యులు, సానుభూతిపరులకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. సురేందర్, సైదిరెడ్డి, రాజు, యోబు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో భాగం హేమంతరావు మాట్లాడారు బిజెపి మతతత్వ రాజకీయాలు చేస్తూ ప్రజల్లో విద్వేశాలు రెచ్చగొడుతుందన్నారు. దేశాన్ని హిందూ దేశంగా మార్చాలనే కాంక్షతో క్రిస్టియన్, ముస్లింలను శత్రువులుగా చిత్రీకరిస్తుండడం ఎంతవరకు సమంజసమన్నారు. గిరిజన హక్కుల కోసం పోరాటం చేసే నక్సలైట్లను ఆపరేషన్ కగార్ పేరుతో హతమార్చడం సరికాదన్నారు. వారేమి దేశ ద్రోహులు కాదని, వారి కోసమని గొంతెమ్మ కోర్కెలు కోరడం లేదన్నారు. బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఎదురు తిరుగుతారనే నక్సలైట్లను ఎరివేస్తున్నారని ఆయన ఆరోపించారు. లౌకికి దేశంలో అధికారకాంక్షతో సాగిస్తున్న కేంద్ర చేస్తున్న దమనకాండ ప్రమాదకరమైందని ఆందోళన వ్యక్తం చేశారు. సోషలిజంతో సమసమాజాన్ని స్థాపించాలనుకునే కమ్యూనిస్టులు బిజెపి చేస్తున్న మత రాజకీయాలపై ప్రజలను చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. అనంతరం సభలో 28,29,30 డివిజన్లకు సంబంధించిన సిపిఐ, ఎఐవైఎఫ్, మహిళా సమాఖ్య నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభలో సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్ రెడ్డి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చెరుకుపల్లి భాస్కర్, యడ్లపల్లి శంకరయ్య, బానోత్ రాంకోటి, సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, గిరిజన సమాఖ్య నాయకులు పాల్తీయ శ్రీను తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## చిన్నారులపై వీధి కుక్కల దాడి



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన కలవేన వెంకటేష్ కుమారుడు మనుహర్షి నాలుగు సంవత్సరాలు అలాగే కటకం పోచమ్మ కూతురుపై వీధికుక్కలు బుధవారం దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులపై వీధికుక్కలు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డారని, ఈ ఘటన గమనించిన స్థానికులు చిన్నారులను కాపాడి ఆసుపత్రికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో పిచ్చికుక్కలు గుంపులుగా తిరుగుతుంటాయని చిన్నారులు బయటకు వెళ్లేందుకు భయాందోళనకు గురికావలసిన పరిస్థితి నెలకొందని ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పిచ్చి కుక్కలను అదుపు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## స్మశానవాటికలో సౌకర్యాల కల్పనకు చర్యలు

ప్రజాపక్షం ఎఫెక్ట్

ప్రజాపక్షం/కొత్తపల్లి : 'విలీన గ్రామాల్లో స్మశాన వాటికల్లో సౌకర్యాలేవీ'? శీర్షికన ఈ నెల 27న ప్రజాపక్షం దినపత్రికలో ప్రచురించిన కథనానికి మున్సిపాలిటీ అధికారులు స్పందించారు. ఈ మేరకు స్మశానవాటికలో సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపట్టారు. బుధవారం దుర్శేడ్ డివిజన్‌లో శానిటేషన్ ప్రత్యేక అధికారి, పశువైద్య అధికారి డా.దుర్గా ప్రసాద్ రెడ్డి, వార్డు అధికారి మణిదీప్ స్మశాన వాటికలో డ్రైనేజీలను పరిశీలించారు. స్మశాన వాటికలో గడ్డిని శానిటేషన్ సిబ్బందితో తొలగించారు. నీటి పైప్‌లైన్‌లో చెడిపోయిన భాగం తొలగించి విద్యుత్ దీపాల పునరుద్దరణ పనులను మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి రిపేరు చేయిస్తామన్నారు. సమస్యను ప్రచురించిన ప్రజాపక్షం దినపత్రికకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.
వార్తకు ఫోటో ఉంది

## ఇండ్లు రాలేదని గ్రామస్థుల ధర్నా



ప్రజాపక్షం/జమ్మికుంట : జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లలో అవతవకలు జరుగుతున్నాయని రోడ్డుపై గ్రామస్తులు ధర్నా చేశారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ జమ్మికుంట మండలంలోని మడిపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇషానుసారంగా తమ బంధువులకు వారికనుగుణంగా ఉన్నవారికి ఇందిరమ్మ ఇళ్లను కేటాయించడం జరిగిందన్నారు. నిజమైన లబ్దిదారులకు ఇందిరమ్మ ఇల్లు కేటాయించలేదని గ్రామస్తులు గ్రామ కార్యదర్శిని నిలదీయగా ఇందిరమ్మ కమిటీ ఇచ్చిన వారిని ఎంపిక చేయడం జరిగిందని, తమ చేతిలో ఏమీ లేదని తెలుపడంతో గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించారు. కార్యక్రమాల్లో దూడపాక సుశీల, తాళ్లపల్లి నాగరాజు, ఎండి షాన్ పాషా, నేరెళ్ల తిరుపతి, అంబాల సమ్మక్క, దేవునూరి విజయ, అంబాల భారత, సంధగళ్ల మమత తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

ప్రజాపక్షం/రామడుగు : పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం మండలంలోని అన్ని గ్రామాల్లో దాదాపు 737 మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు మంజూరు పత్రాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికారులతో కలిసి అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేదవాడి చిరకాల స్వప్నమైన స్వంత ఇంటి నిర్మాణం కోసం గత ప్రభుత్వం పది సంవత్సరాల కాలంలో సహాయం అందించిన పాపాన పోలేదన్నారు. కానీ తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చేపడుతున్న అనేక సంక్షేమ పథకాలతో పాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. ఈ రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించాలన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా చొప్పదండి నియోజకవర్గంలో గూడు లేని పేదలకు ఇళ్లు ఇచ్చే బాధ్యత మాదేనన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవ్వాజి హరీష్, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుమల, సింగిల్ విండో చైర్మన్ ఒంటె మురళీకృష్ణారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పంజాల శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ కోల రమేష్, పులి ఆంజనేయులు, మండల ప్రత్యేక అధికారి, తహసీల్దార్, ఎంపిడివో, ఎంపివో, అధికారులు తదితరులున్నారు.

## రాజన్న ఆలయ హుండీ ఆదాయం రూ.కోటి నలబై నాలుగు లక్షలు



ప్రజాపక్షం/వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రాజన్న ఆలయంలో బుధవారం నిర్వహించిన 13 రోజుల నుండి ఆదాయం ఒక కోటి, నలపై నాలుగు లక్షల, ఇరవై ఐదు వేల,ముప్పై ఒక్క రూపాయలు. బంగారం ఒక వంద ఏడు గ్రాముల 500 మిల్లి గ్రాములు వెండి ఏడు కిలోల తొమ్మిది గ్రాములు హుండీ లెక్కింపు నందు సమకూరినట్లు కార్యనిర్వహణాధికారి వినోద్ రెడ్డి, తెలిపారు. ఈ హుండీ లెక్కింపులో ఏసీ కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏ ఈ ఓ లు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. ఎస్పీఎఫ్ మరియు హోమ్ గార్డు సిబ్బంది భద్రతా ఏర్పాట్లు చూసారు. హుండీ కౌంటింగ్ నందు శ్రీ శివరామకృష్ణ భజన మండలి వారు పాల్గొన్నారు.

## మృతదేహాలను కుటుంబసభ్యులకు ఇవ్వకపోవడం రాజ్యాంగ విరుద్ధం



హైకోర్టు ఆర్డర్ పాటించని కేంద్రం, ఛత్తీస్‌గఢ్, ప్రభుత్వాలు

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : నారాయణపూర్ బూటకపు ఎన్‌కౌంటర్ మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు ఇవ్వకపోవడంపై నిరసిస్తూ పెద్దపెల్లి జిల్లా కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి వివిధ ప్రజా సంఘాల నాయకులు హాజరై మాట్లాడుతూ ఈనెల 21 నాడు నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మావోయిస్టులు మృతదేహాల అప్పగింతపై ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ఆర్డర్ ఇచ్చినప్పటికీ ఛత్తీస్‌ఘడ్ రాష్ట్ర ప్రభుత్వం అక్కడి పోలీస్ వర్గాలు కుటుంబ సభ్యులకు మావోయిస్టు మృతదేహాలను ఇవ్వకుండా నాలుగు రోజులుగా ఇబ్బందులకు గురిచేస్తూ చివరకు పోలీసులే దహన సంస్కారాలు నిర్వహించడం చట్టవిరుద్ధమని అన్నారు. ఆర్టికల్ 19 భావ ప్రకటన స్వేచ్ఛ, ఆర్టికల్ 21ప్రకారం మృత దేహాలకు కూడా మానవ హక్కులు ఉంటాయని వాటిని పాటించకుండా కుటుంబ సభ్యులకు మృతదేహాలను అప్పగించకుండా వేధింపులకు గురి చేసారని ఆరోపించారు. కుటుంబ సభ్యులు, ప్రజాసంఘాలు, ప్రజలు, ప్రజాస్వామిక వాదు లు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవ రావు, సహచరుల మృతిపై అనుమానాలు వ్యక్తపరుస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవ రావు, ఇతర సహచర సభ్యుల బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్ట్ సిట్టింగ్ జడ్జ్‌చే న్యాయ విచారణ జరిపించాలని, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, మావోయిస్టు పార్టీతో కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మాధన కుమారస్వామి పౌర హక్కుల సంఘం ఉమ్మడి కరీంనగర్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొంకురి లక్ష్మ ణ్, బొడ్డుపల్లి రవి, తెలంగాణ ప్రజాఫ్రంట్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుమ్మడి కొమురయ్య, పులిపాక రవీందర్ విప్లవ రచయితల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య దళిత లైబరేషన్ ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మర్వాడీ సుదర్శన్, కెవిపిఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కళ్లేపల్లి అశోక్, మోదుంపల్లి శ్రవణ్ ఉద్యమ కారుల టిజెఎసి రాష్ట్ర నాయకులు ఆంజనేయ శర్మ సుచరిత, పర్వతాలు, సత్యనారాయణ, గాండ్ల మల్లేశం, సుధాకర్, జగన్, సంతోషిని, బండి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరి పత్రాల పంపిణీ ని వేములవాడ నియోజకవర్గంలో జగిత్యాల జిల్లాలోని మేడిపల్లి మండలం మరియు భీమారం మండలం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ పాల్గొన్నారు. జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం పిఎన్ఆర్ గార్డెన్‌లో ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ పత్రాల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. మేడిపల్లి మండలంలో మంజూర్ అయిన 246 ఇందులో మంజూరి పత్రాలు 154 పంపిణీ చేయగా, భీమారం మండలంల 151 మంజూర్ కాగా128 మంజూరు పత్రాలు పంపీణీ చేసినట్లు తెలిపారు. వేములవాడ శాసనసభ్యులు ప్రభుత్వ విప్ శ్రీనివాస్ జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ చేతుల మీదుగా ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాలను లబ్దిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల మరియు మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ అధికారి జివాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మేడిపల్లి మండలం భీమారం మండలం ఎంఆర్‌వోలు, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు

## పశువుల అక్రమ రవాణా నియంత్రణకు చెక్‌పోస్టు ఏర్పాటు

జగిత్యాల ఎస్పీ అశోక్‌కుమార్



ప్రజాపక్షం/జగిత్యాలటౌన్ : పశువుల అక్రమ రవాణాను నిరోధించడానికి జగిత్యాల జిల్లాలో ప్రత్యేక చర్య లు తీసుకోవడం జరుగుతుందని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా చెక్ పోస్టులను ఏర్పా టు చేసి నిరంతరగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. బుధవారం ఎస్పీ విలేఖరులతో మాట్లాడుతూ ఈ చెక్‌పోస్టులలో 24 గంటలు నిరంతర నిఘాలో ఉంటాయని, పోలీసుశాఖ పశు సంవర్ధక శాఖ సిబ్బంది షిఫ్టుల వారీగా సమన్వయంతో పనిచేస్తార ని ఎస్పీ వివరించారు. పశువుల రవాణా అనేది నియమ నిబంధనల ప్రకారమే జరగాలని, అనుమతి పత్రాలు లేకుండా ఆవులు దూడలను రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చారించారు. పశువులను రవాణా చేసే ప్రతి వాహనంతో చెల్లుబాటు అయ్యే పత్రాలు తప్పనిసరిగా ఉండాలని, ఎవరు తమ ఆధారాలు లేకుండా రవాణాలో పాల్గొనరాదని సూచించారు. వ్యక్తి సంస్థ స్వయంగా వాహనాలను ఆపకూడదని ఈ విషయంలో ప్రజ లు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఎవరైనా అనుమానాస్పద రవాణా గమనించిన పక్షంలో వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. సోషల్ మీడియాలో ద్వేషపూరిత, రెచ్చగొట్టే అసభ్యకరమైన పోస్టులు పెడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి మీడియా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేసినట్టు ఎస్పీ అశోక్‌కుమార్ పేర్కొన్నారు.

## కార్మికవర్గ శ్రేయస్సు కోసం ఎఐటియుసి నిరంతర కృషి

ఎఐటియుసిలో వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు చేరిక

ఎఎల్‌పి గేట్ మీటింగ్‌లో ఎఐటియుసి నేతలు సమ్మయ్య, వై.వి.రావు




ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణిలో కార్మిక వర్గ శ్రేయస్సు కోసం ఏఐటియుసి నిరంతరం కృషి చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శులు ముస్కె సమ్మయ్య, వై.వి.రావులు పేర్కొన్నారు. సింగరేణి ఆర్జీ త్రీ ఏరియాలోని ఏఎల్‌పీ గనిలో ఫిట్ సెక్రటరీ గంగాధర్ అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో వారు పాల్గొని ప్రసంగించారు. సింగరేణిలో ఏడవసారి జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికుల అనేక సమస్యల్ని పరిష్కరించడం కోసం యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి కృషి చేయడం జరిగిందని వారు పేర్కొన్నారు. కార్మికులు తమ పిల్లల విద్య కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయుచున్నారని, దీనిని దృష్టిలో పెట్టుకొని సింగరేణి యాజమాన్యంతో స్ట్రక్చర్ సమావేశంలో మాట్లాడి సెంట్రల్ సిలబస్ విద్యను అందించాలని చేసిన డిమాండ్ మేరకు యాజమాన్యం అంగీకరించి భూపాల్ పల్లి, కొత్తగూడెం రామగుండంలో సెక్టార్ త్రీ పాఠశాలలలో సిబిఎస్ఇ సిలబస్ ను ప్రారంభించారని వారు తెలిపారు. అదేవిధంగా కార్మికులకు ప్రమోషన్ పాలసీలో భాగంగా ప్రమోషన్ వచ్చిన ప్రతి కార్మికుడికి ప్రమోషన్ ఇంక్రిమెంట్ల ఇప్పించడం జరుగుతుందని వారు తెలిపారు. సింగరేణిలో కార్పొరేట్ వైద్యం కోసం హైదరాబాదులో సింగరేణి కార్పొరేట్ వైద్యశాలను ఏర్పాటు చేయించడం జరుగుతుందని వారు తెలిపారు. అదేవిధంగా సొంతింటి పథకాన్ని అమలు చేయడానికి ఏఐటియుసి కృషి చేస్తుందని వారు అన్నారు. ఏఎల్పి కార్మికులకు 150 మందికి సర్ఫేస్ లో జనరల్ మజ్దూర్ లు గా ఇప్పించడం జరిగిందని వారు పేర్కొన్నారు. అదేవిధంగా సింగరేణి లో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్ ను జనరల్ అసిస్టెంట్ గా మార్పు చేయించడం జరిగిందని వారు తెలిపారు. ఏఐటియుసి కార్మికుల కు చేస్తున్న సేవలను గుర్తించి ఏ.ఎల్.పి కి చెందిన వివిధ యూనియన్ ల నాయకులు కార్యకర్తలు ఏఐటియుసి లో చేరారని వారికి ఏఐటియుసి కండువాలు కప్పి యూనియన్ లోకి ఆహ్వానించడం జరిగిందని వారు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి నాయకులు జూపాక రాంచందర్, ఎం.ఆర్.సి రెడ్డి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ ప్లానిటేషన్‌కు అధికారులు సిద్ధం కావాలి

జూన్ 5న వనమహోత్సవాన్ని జిల్లాలో అట్టహాసంగా ప్రారంభించాలి

జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి : పచ్చని ప్రకృతి ఆస్తిని భవిష్యత్ తరాలకు అందించే దిశగా జిల్లాలో పండుగ వాతావరణంలో మోడల్ ప్లానిటేషన్ కొరకు అధికారులు సన్నద్ధం కావాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పిలుపునిచ్చారు. బుధవారం ఐడిఓసి సమావేశ మందిరంలో ఎంపిడిఓలు, పంచాయతీ కార్యదర్శులతో మొక్కలు నాటే కార్యక్రమంపై దిశ నిర్దేశం చేశారు. ఈసందర్భంగా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ మాట్లాడుతూ జిల్లాలో పోతారెడ్డిపేట నుండి హుస్నాబాద్ వరకు, దుద్దెడ క్రాస్ రోడ్డు నుండి వీరన్నపేట వరకు నేషనల్ జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న రోడ్డుకు ఇరువైపుల రెండు వరుసలతో మొక్కలునాటే కార్యక్రమాన్ని నేటి నుండి ప్రారంభించాలన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో ప్రతిరోజు గుంతలు తీసే పనులు జూన్ 5లోగా పూర్తి చేయాగలిగితే, జూన్ 5న వనమహోత్సవాన్ని కార్యక్రమాన్ని జిల్లాలో ఘనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు వర్షాలు బాగ పడుతున్నాయని, ఇప్పటి నుండి స్ట్రేంచ్ ఏర్పాటు చేసుకోవాలని, అధికారులు వెంటనే పనులు ప్రారంభించేలా చేయటంతో పాటు, ప్రతిరోజు క్షేత్ర స్థాయిలో పనులు పర్యవేక్షించుకోవాలన్నారు. విద్యుత్ స్థంబాలు. విద్యుత్ వైర్ల కింద మొక్కలు నాటకుండ జాగ్రత్త వహించాలన్నారు. పెద్దగా పెరిగే మర్రి, రావి, చింత. వేప, గుల్మార్గ్ లాంటి మొక్కలు మొదటి వరసలో కొంత చిన్నవిగా పెరిగే మొక్కలు రెండవ వరులో నాటేలా చూసుకోవాలన్నారు. అదేవిధంగా నాటిన మొక్కలను సంరక్షించేలా ఏ ర్పాట్లు చేయాలన్నారు. రోడ్డు మార్గంలో రకరకాల మొక్కలునాటకుండ ఒకే విధమైనపెద్ద మొక్కలు నాటేలా చూడాలన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయటం కొరకు ప్రతి మండలానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించటం జరుగుతుందన్నారు. మొక్కలు నాటడంలో ఏవైన సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోవాలన్నారు. ఈకార్యక్రమంలో డిఆర్డీఓ జైదేవ్ ఆర్య, నేషనల్ హైవే అధికారులు, ఎంపిడిఓలు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 30 రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం ప్రారంభించాలి

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

పెట్టుబడి లేని నిరుపేదలకు స్వయం మహిళ సంఘాల ద్వారా రూ.లక్ష రుణం మంజూరు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు 30 రోజుల లోగా తప్పనిసరిగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లబ్ధిదారులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ బోయిన్ పల్లి మండలంలో ప్రభుత్వ పాఠశాల గ్రౌండ్ లో రెండో విడత క్రింద 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యంతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, బోయిన్‌పల్లి మండలం అనంతపల్లి గ్రామంలో పైలెట్ గ్రామంగా ఎంపిక చేసుకొని మొదటి విడత క్రింద 109 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయగా నేడు 50 శాతం వరకు పూర్తయ్యాయని, ప్రభుత్వం వారికి చెల్లింపులు కూడా చేస్తుందని అన్నారు. రెండో విడత కింద మండల వ్యాప్తంగా 709 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి నేడు ఇందిరమ్మ ఇండ్ల ఉత్తర్వులు పంపిణీ చేస్తున్నామని, వీరు కూడా ఇంటి నిర్మాణం పనులు 30 రోజుల లోగా తప్పనిసరిగా ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం 400 నుంచి 600 చదరపు అడుగులు లో మాత్రమే నిర్మించాలనో అన్నారు. ఇండ్ల నిర్మాణం పనులు పూర్తి చేసుకొని రానున్న పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాలని కలెక్టర్ సూచించారు.ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని అన్నారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత 1లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే 1లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తర్వాత 2 లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం మాట్లాడుతూ,పేదలకు ఇచ్చిన మాట ప్రకారం సోంత స్థలం ఉన్న నిరు పేదలను గుర్తించి బోయిన్ పల్లి మండలంలో 709 ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ప్రజల హృదయాల్లో స్పష్టమైన ముద్ర వేసుకునేలా సిరిసిల్ల కలెక్టర్ పని తీరు ఉందని ఎమ్మెల్యే ప్రశంసించారు. బోయినపల్లి మండలంలో ఇటీవల పేద మహిళ ఇళ్ళు కాలిపోతే సాయంత్రం వరకు 50 వేల రూపాయల ప్రభుత్వ సహాయంగా చెక్కు మంజూరు చేశారని, నీరోజపల్లి గ్రామంలో కూడా విద్యుత్ షాక్ తో మరణిస్తే ఆ కుటుంబానికి కూడా కలెక్టర్ సహకరించారని, మానవీయ కోణంతో పని చేస్తున్న జిల్లా కలెక్టర్ కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, పిఏసి చైర్ పర్సన్ వెంకట రామారావు, సెజ్ సంచాలకులు సుధాకర్, పిడి హౌసింగ్ శంకర్, మండల ప్రత్యేక అధికారి వినోద్, ఎంపీడీవో జయశీల సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు సురేందర్ రెడ్డి రమణారెడ్డి సుధాకర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం యొక్క బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో రైతులతో, రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం బుధవారం రైతు వేదిక కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతులకు ఈ 6 అంశాలపై అవగాహన కల్పించారు. పంటలకు సిఫారసు చేసిన మోతాదులోనే యూరియాను ఉపయోగించడం, పచ్చిరొట్ట ఎరువులు, వర్మి కంపోస్ట్, పశువుల ఎరువు వాడటం, భూసార పరీక్ష ఫలితాలను బట్టి పంటకు ఎరువులను అందించటం, రసాయన ఆధారిత పురుగు మందులను అవసరం మేరకు మాత్రమే ఉపయోగించటం మరియు పంటల్లో సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించడం పంట వైఫల్యాల సమయంలో పంట బీమా పొందడానికి మరియు నష్టపరిహారం కోసం పంట కోసం కొనుగోలు చేసిన వివిధ విత్తనాలు, రసాయనిక ఎరువులు మరియు రసాయనిక మందుల కొనుగోలు రసీదులను భద్రపరచడం, సాగునీటి యాజమాన్యం, బిందు మరియు తుంపర సేద్యం, మల్చింగ్ పద్ధతులు, సుస్థిరమైన వ్యవసాయం కోసం పంట మార్పిడి పంట వైవిధ్యీకరణ, పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలను నాటడం, పిజెటిఏయు యూట్యూబ్ ఛానల్, పిజెటిఏయు వారి చేను కబుర్లు రేడియో కార్యక్రమాన్ని ఉపయోగించడం ద్వారా వ్యవసాయ సంబంధిత సమాచారాన్ని తెలుసుకోవడం. వర్మీ కంపోస్ట్ తయారీ, పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన, పంట బీమా పథకాలు, వెదురు మొక్కల ఆయిల్ పామ్ సాగు. ఈ కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ కళాశాల, సిరిసిల్ల, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఎం.డి. రజియా సుల్తానా మరియు పి.మాధవి, ఏఎంసీ ఛైర్మెన్ ఆర్. రాజు,ఏఎంసీ డైరెక్టర్ జి. విద్యాసాగర్, వ్యవసాయ డివిజనల్ అధికారి రామారావు, జి.సాయికిరణ్ మండల వ్యవసాయాధికారి, ఉద్యాన శాఖ అధికారి లోకేష్, వ్యవసాయ విస్తరణ అధికారులు ఎం.డి. ఇనామిల్, డి. రాజు, వ్యవసాయ కోర్సును అభ్యసిస్తున్న విద్యార్థులు, జి. మణికంఠ, బి.షాలిని రైతులు, మహిళలు పాల్గొన్నారు.

## రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

ప్రజాపక్షం/ వేములవాడ: వేములవాడ నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూలు 200 కోట్లతో మంజూరు చేయించినందుకు ప్రభుత్వ విప్ శాసనసభ్యులు ఆది శీనివాస్ చిత్రపటానికి బుధవారం వేములవాడ రూరల్ మండల్ అధ్యక్షులు వక్లాభరణం శీనివాస్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేస్తూ పెద్ద ఎత్తున బాణాసాంచలు పేలుస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు మాట్లాడుతూ వేములవాడ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడం లక్ష్యంగా అన్ని శాఖలను అభివృద్ధి చేయడానికి నిధులు కేటాయిస్తూ నేడు 200 కోట్లతో ఇంటిగ్రేడ్ స్కూలు కొరకు నిధులు మంజూరు చేయించినందుకు చాలా సంతోషంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వకులాభరణం శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాలకుర్తి పరశురాములు, చికోటి నాగరాజు, ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ నేదూరి రమేష్, యూత్ అధ్యక్షులు రోమాల ప్రవీణ్, మాజీ ఎంపిటిసి గోవర్ధన్ రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షులు అదిల్ పాషా, వేములవాడ రూరల్ మండలం ఉపాధ్యక్షులు బత్తిని ఎల్ల గౌడ్, మండల ఉపాధ్యక్షులు సోహినేని కరుణాకర్, సల్ల సురేష్, నూకల మర్రి మాజీ సర్పంచ్ పిట్టల వెంకటేష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సోమినేని బాలు దానే వేణు ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి విష్ణు కొమ్ము రాధాకృష్ణ చింతల కోటి రాజు నేదూరి దేవరాజు నేదూరి రాకేష్ పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## సిద్దాపూర్ గ్రామంలో భూములను పరిశీలించిన సబ్ కలెక్టర్



**ప్రజాపక్షం/బోధన్ :** వర్ని మండలం సిద్దాపూర్ గ్రామంలోని ప్రభుత్వ ఫారెస్ట్ భూములను బుధవారం బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో పరిశీలించారు. సిద్దాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న రిజర్వాయర్ నిర్మాణానికి అడ్డంకులు లేకుండా భూమిని కేటాయించాలని రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి సూచనల మేరకు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో రెవెన్యూ, ఫారెస్టు భూములను పరిశీలించి గ్రామంలో నిర్మిస్తున్న రిజర్వాయర్ కు భూమి సర వే నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, ఫారెస్ట్ భూములలో మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వర్ని తహసీల్దార్ సాయిలు, రెవెన్యూ స్టిబంది, ఫారెస్టు అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు విగ్రహప్రతిష్ఠ ఆహ్వానపత్రిక అందజేత



**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం గూడురు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీగురుపీఠంలోని శ్రీదత్తాత్రెయమహాస్వామి, శ్రీషిరిడిసాయిబాబా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం జూన్ 2వ తేది నుంచి ఉండడంతో శ్రీగురుపీఠం ఛైర్మన్ శివకుమార్‌గౌడ్ బుధవారం పలువురు ప్రముఖులకు ఆహ్వానపత్రికలు అందజేశారు. మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు, అదనపు కలెక్టర్ నగేశ్‌కు ఛైర్మన్ శివకుమార్‌గౌడ్ అందజేశారు. తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్‌కు, సీఐ రంగ కృష్ణలకు ట్రస్టు సభ్యులు రమణాగౌడ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, రాజ్యం భిక్షపతియాదవ్ తదితరులు ఉన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ఏర్గట్ల మండలం బట్టాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మానానికి గ్రామపంచాయతీ కార్యదర్శి ఆకుల రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలే శ్రీనివాస్, షేక్ కరీం లబ్ధిదారులతో కలిసి బుధవారం భూమిపూజ చేసి ముగ్గు పోశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు రమేష్‌నాయక్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన ప్రతిఒక్కరూఇళ్ల నిర్మాణం పూర్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గంగాధర్ పాల్గొన్నారు.

## విత్తన దుకాణాలను తనిఖీ చేసిన ఎంఏ



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పలు విత్తన దుకాణాలను బుధవారం మండల వ్యవసాయ శాఖ అధికారి హరీష్ కుమార్ తనిఖీ చేశారు. దుకాణ దారులు విత్తనాలకు సంబంధించిన స్టాక్ బోర్డుపై వివరాలు రాయాలని, ప్రతి రైతుకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని, అన్ని లైసెన్సులకు సంబంధించిన రిజిష్టర్లను విధిగా మెయింటెనెన్స్ చేయాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే శాఖ పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విత్తన డీలర్లు దేవరాజ్, శ్రీనివాస్, మల్లేష్, సునీల్ పాల్గొన్నారు.

## కరెంట్‌షాక్‌తో పాడిగేదె మృతి

**ప్రజాపక్షం/శివ్వంపేట :** శివ్వంపేట మండలం లింగోజిగూడ గ్రామానికి చెందిన కొమిరగారి యాదయ్యకు చెందిన పాడిగేదె బుధవారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. రోజులాగే పొలానికి మేతకు తీసుకెళ్లగా పొలంలో విద్యుత్‌వైర్లు తెగి గేదెపై పడడంతో గేదె అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో తాము రూ. 80వేల విలువ చేసే గేదెను కోల్పోయామని బాధితులు రోధించారు. ప్రభుత్వం తమకు ఆదుకోవాలని కోరారు.

## లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/బోధన్ :** బోధన్ నియోజకవర్గంలోని సాలూరా మండల కేంద్రంలో మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు బుధవారం పలు గ్రామాల లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందచేశారు. పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రజల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీలు కులమతాలకు అతీతంగా సంక్షేమ ప థకాలు అందించడం ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మందర్న రవి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ రెడ్డి, బోధన్ ఏఎంసీ ఛైర్మన్ చీల శంకర్, సాలురా పిఎసిఎస్ ఛైర్మన్ అల్లె జనార్ధన్, సీనీయర్ నాయకులు రమేష్, శంకర్, అనిల్ పాల్గొన్నారు.

## బిసిలు సగం... బిసిలకు సగం...




**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** బిసిలు సగం బిసిలకు సగం అనే నినాదంతో బిసి హక్కుల సాదన సమితి జిల్లా నూతన కమిటి పనిచేయాలని బిసి హక్కుల రాష్ట్ర కార్యదర్శి ధనుంజయ నాయుడు అన్నారు. బుధవారం బిసి రాష్ట్ర నాయకులు ధనుంజయ నాయుడు ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటిని ఎన్నుకొని అభినందించారు. ఈ సందర్భంగా నూతన కమిటిని ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడిగా డి.శ్రవణ్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఏ.విఠల్ గౌడ్, గోవర్ధన్ యాదవ్, రంజిత్, జిల్లా ప్రధాన కార్యదర్శి తోపునూరు చక్రపాణి, జిల్లా కార్యదర్శిలు పి.హనుమాండ్లు, రేవతి, ఉప్పల నాందేవ్, కోశాధికారిగా రాధాకుమార్, జిల్లా కమిటి సభ్యులుగా జి.సాయన్న, సాయిలత, సాయితేజ, ఎస్‌కె . సలీం, వడ్ల శ్రీనివాస్, రాఘవేందర్, ఏ.నవీన్ కుమార్, వెలగందుల ఉమామహేశ్వరరావు, ఇతర సభ్యులతో కలిసి మొత్తం 25మంది సభ్యులతో కమిటిని ఏర్పాటు చేశారు.

# మహిళా శక్తికి ప్రధాని గుర్తింపు




జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు,

**ప్రజాపక్షం /సంగారెడ్డి ప్రతినిధి :** కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఇందిరా మహిళా శక్తి అధికారులతో బుదవారం జిల్లా కలెక్టర్ క్రాంతివల్లూరు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ జిల్లా మహిళలను ప్రదాని మంత్రి నరేంద్రమోడీ మాన్ కీ బాత్ కార్యక్రమంలో జిల్లా మహిళలను స్కై వారియర్స్ గుర్తించడం చాలా ప్రొత్సాహంగా ఉందన్నారు. ప్రధాన మంత్రి ఉపన్యాసంలో సంగారెడ్డి జిల్లా మహిళల గురించి స్కై వారియర్ గా అభివర్ణించడం చాలా గొప్ప విషయం అన్నారు. జిల్లాలో ఇందిరా మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా 33 మంది మహిళలు డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోగా అందులో 28 మంది మహిళలు డ్రైవింగ్ శిక్షణకు అర్హత ఆదించారన్నారు. అర్హత సాదించిన డ్రైవింగ్ మహిళలకు ఉద్యోగ ఉపాది అకాశాల కోసం ఎయిర్ పోర్టులో కంపెనీలలో సర్వీస్ టాక్సీలలో ప్రైవేట్ సంస్థలో ఉపాది అవకాశాలు కల్పించాలని గ్రామీణ మహిళ అభివృద్ధి సంస్థను ఆదేశించారు. మహిళా సమాఖ్య సభ్యులు, విద్యార్థులకు పాఠశాలలు తెరవక ముందే ఏకరూప దుస్తులు అందిచాలని ఏకరూప దుస్తులు కోసం క్లాత్ రెడిగా ఉందన్నారు. నరేంద్ర మోడీ డ్రోన్ పథకం ద్వారా డ్రోన్ ట్రైనింగ్ పూర్తి చేసిన 52 మందినీ స్కై వారియర్స్ గుర్తించబడి అనేక ఉపాది అవకాశాలు పొందుతున్నరన్నారు. డ్రోన్ శిక్షణ పొందిన మహిళలకు మహిళ గ్రూపుల్లో సబ్సిడీ పైన డ్రోన్ అందించే అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. డ్రోన్ శిక్షణ పొందిన మహిళలు ఎకరానికి రూ. 500 లు పొందుతున్నారని ఒక ఎకరం మందులు పిచికారి చేయడానికి అత్యల్పంగా పది నిమిషాల సమయం మాత్రమే పడుతుందని డ్రోన్ ద్వారా మందులు పిచికారి చేయడంతో సమయము డబ్బు నీరు, ఆదా అవుతాయని డ్రోన్ శిక్షణ పొందిన మహిళలకు నెలకు దాదాపు పదివేల వరకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ ,పిడిడిఆర్‌డిఏ జ్యోతి అదనపు డిఆర్‌డిఏ జంగారెడ్డి, అధికారులు డిఆర్‌డిఏ సిబ్బంది ఎస్ హెచ్, జి గ్రూప్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర బృందం సభ్యుల పర్యటన



**ప్రజాపక్షం/ఎడపల్లి :** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని పలు గ్రామాల్లో కేంద్ర బృందం సభ్యులు పర్యటిస్తున్నారు. బుధవారం జాన్కంపేట్, జైతాపూర్ గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో అమలు చేస్తున్న కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు చేపట్టిన అభివృద్ధి పనులు, పెన్షన్‌లు, గ్రామ పంచాయతీల్లో రికార్డులు, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి కింద అమలు చేసిన పథకాలు, ఉపాధి హామీ పథకంపై గ్రామాల్లో పర్యటించి వివరాలు తెలుసుకున్నారు. తెలంగాణలో ప్రభుత్వం ఏర్పాటైన తరువాత జరిగిన అభివృద్ధి పనులు, పథకాల అమలుపై, అభివృద్ధిలో భాగంగా నిర్మించిన సీసీ రోడ్డు, మురికి కాలువలు, కేంద్ర ప్రభుత్వం,రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఎలాంటి పథకాలు అమలు అవుతున్నాయో అనే విషయాలపై అధికారులతో, మహిళా సంఘాలతో గ్రామ ప్రజలతో మాట్లాడి ఆరా తీశారు. రికార్డులకు అనుగుణంగా పనులు నిర్వహించారా..?లేదా..? చేపట్టిన ప్రాంతాలకు వెళ్లి తమ కెమెరాల్లో ఫోటోలు తీసుకున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు అందించిన పని దినాలు, గ్రామాల్లో నర్సరీల నిర్వహణ, క్రీడా ప్రాంగణాలు వంటివి పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించి అంతకుముందు ఆయా గ్రామాలకు చేరుకున్న సభ్యులకు గ్రామ పంచాయతీ సెక్రెటరీలు వివరాలు అందించారు. వారి వెంట ఎడపల్లి ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, ఏపీఓ గంగారాం, పంచాయతీ కార్యదర్శులు ప్రేమ్‌దాస్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి కార్యకర్తకూ పార్టీయే ముఖ్యం.. వ్యక్తులు కాదు

కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల

**ప్రజాపక్షం/బాన్సువాడ :** ప్రతి కార్యకర్తకు పార్టీ ముఖ్యమని వ్యక్తులు ముఖ్యం కాదని, పార్టీ సిద్ధాంతాలు నమ్మి పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమని కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని శ్రీనివాస గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల విస్తృత సమావేశానికి ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, కైలాస్ శ్రీనివాస్‌రావు, పార్టీ పర్యవేక్షకులు వేణుగోపాల్ యాదవ్, సత్యనారాయణ గౌడ్, మాజీ డిసిసిబి అధ్యక్షులు పోచారంభాస్కర్ రెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేషన్ ఛైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ తనకు కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలే శిరోధార్యమని, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పని చేయడమే తన లక్ష్యమన్నారు. వ్యక్తులు వస్తుంటారు.. పోతుంటారు పార్టీ బాగుంటేనే మనమందరం బాగుంటామన్నారు. నియోజకవర్గంలో అందరం కలిసి సమన్వయం చేసుకొని పార్టీని ముందుండి నడిపించుకుందామని, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొన్నామని, అధికారం వచ్చిన తర్వాత దూరంగా ఉండి లాభం లేదన్నారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నిజమైన కాంగ్రెస్ కార్యకర్తకు న్యాయం చేసేందుకు పార్టీ అధ్యక్ష పదవులను అప్పగించేందుకు నూతన ఒరవడిని సృష్టించారని, పార్టీ అబ్యున్నతికి పాటుపడిన ప్రతి ఒక్కరికి అవకాశాలు వస్తాయని, పార్టీ అధికారంలోకి రావడంతోనే తనకు కార్పొరేషన్ పదవి దక్కిందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి ఛైర్మన్‌లు సురేష్ బాబా, దుర్గం శ్యామల, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు కాలేక్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మదుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు కూనిపూర్ రాజారెడ్డి, నార్ల రత్న కుమార్, నార్ల సురేష్ గుప్తా, పార్టీమండలాల అధ్యక్షులు తోట అరుణ్, శంకర్, గురువినయ్, ఎజాస్, కృష్ణారెడ్డి, శ్రీనివాస్ గౌడ్, మన్సూర్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు



**ప్రజాపక్షం/మోర్తాడ్ :** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని ఆయా గ్రామాలలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు కొనసాగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల అభివృద్ధిని కోరుతూ ప్రతి ఒక్క రైతుకు గుర్తింపు కార్డు ఉండాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను మండలంలోని అన్నీ గ్రామాలలో వ్యవసాయ శాఖ అధికారులు కొనసాగిస్తున్నారు. బుధవారం మోర్తాడ్ మండల కేంద్రంలోని ఎస్సీ వాడ సంఘంలో ఎఈఓ శ్రీలత, లక్‌పతి రైతులతో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేశారు. జూన్ 4వ తేదీ వరకు కొనసాగే నమోదు ప్రక్రియలలో రైతులు బ్యాంకు లీంకేజీ ఫోన్ నంబర్, ఆధార్, కార్డుతో వచ్చి తమ తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఎఈఓ శ్రీలత సూచించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు రైతు గుర్తింపు కార్డు ప్రభుత్వం అందచేస్తుందన్నారు. ఈ గుర్తింపు కార్డు వల్ల రైతులకు ఎంతో ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఐపిఎల్ బెట్టింగ్ పై పోలీసుల దాడులు

**ప్రజాపక్షం /హత్నూర :** హత్నూర మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులో గల వి.ఎస్.ఆర్ పామ్ హౌస్ లో ఆర్ధరాత్రి క్రికెట్ ఐపిఎల్ బెట్టింగ్ ఆడుతున్న ముఠాను హత్నూర ఎస్సై శ్రీధర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి ఫామ్ హౌస్ పై దాడులు నిర్వహించారు. 9 మంది క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ముఠాను సభ్యులను అదుపులో తీసుకున్నట్లు ఎస్సై శ్రీదర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపిఎల్ క్రికెట్ బిట్టింగ్ ను కొంత మంది వ్యక్తులు ఆనైన్లో డబ్బులు పెట్టి బెట్టింగ్ ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం మేరకు వి.ఎస్.ఆర్ ఫామ్ హౌస్‌లో దాడులు నిర్విహించామని తెలిపారు. ఈ దాడుల్లో 9 మంది వ్యక్తులను అదుపులో తీసుకొని విచారించగా ఐపిఎల్ క్రికెట్ మ్యాచ్ పై ఆన్లైన్ ద్వారా డబ్బులు పెట్టుబడి పెట్టి బెట్టింగ్ ఆడుతున్నారనీ తెలిపారు. 1.అల్లగడ్డ శ్రీనివాస్‌రెడ్డి, 2. ఈర్ల బాస్కర్, 3 తుమ్మలి సంగమేశ్వర్, 4. మాసెపల్లిరాజు, 5 రేగోడు, మణికంఠ , 6 కటకం చిన్నకృష్ణ గౌడ్ , 7, పైడి శ్రీనివాస్, 8. మద్దూరి దుర్గయ్య, 9 ఔసలి శ్రీనివాస్‌లను ఆదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ. 5590లు నగదు, ఒక ల్యాప్ టాప్ , ఒక ఎల్‌ఈడి స్మార్ట్ టీవీ 13 మొబైల్ పోన్లు ఐదు కార్లను అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని ఎస్సై తెలిపారు.

## నియోజకవర్గంలో పార్టీ సమస్యలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్తా..



**ప్రజాపక్షం/బాన్సువాడ :** బాన్సువాడ నియోజకవర్గంలో పార్టీలో జరుగుతున్న పరిణామాలను, కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాలను అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లి జెండా మోసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేసేవిధంగా కృషి చేస్తానని నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ రావు అన్నారు. బుధవారం బాన్సువాడ పట్టణంలోని శ్రీనివాస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశానికి పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవిందర్ రెడ్డి వర్గీయులు సమావేశానికి వస్తున్నారని ముందస్తు సమాచారంతో పోలీసులు గేటు బయట నిలిపివేయడంతో, ఉమ్మడి జిల్లాల అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, కైలాస్ శ్రీనివాస్ రావు విచ్చేసి కార్యకర్తల సమస్యలను తెలుసుకుని నియోజకవర్గ కార్యకర్తలకు సమావేశం అనంతరం మార్కెట్ కమిటి ఆవరణలో ఏర్పాటు చేసిన పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవిందర్ రెడ్డి వర్గీయుల సమావేశానికి జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ మోహన్ రెడ్డి, కైలాస్ శ్రీనివాస్ రావు, ఎన్నికల పరిశీలకులు వేణుగోపాల్ యాదవ్, సత్యనారాయణ గౌడ్ విచ్చేసి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవిందర్ రెడ్డి వర్గానికి చెందిన కార్యకర్తలు తమకు ఇందిరమ్మ కమిటిలు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, పార్టీ కోసం జెండా మోసిన కార్యకర్తలకు నియోజకవర్గంలో అవమానాలు ఎదుర్కొంటున్నామని వారి దృష్టికి తీసుకురావడంతో, జిల్లా అధ్యక్షులు నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లి జెండా మోసిన కార్యకర్తలకు న్యాయం చేసేవిధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్ కమలాకర్ రెడ్డి, నాయకులు మాసాని శ్రీనివాస రెడ్డి, కొత్తకొండ భాస్కర్, పార్టీ మండల అధ్యక్షులు మంత్రి గణేష్, నందు పటేల్, పట్టణ అధ్యక్షుడు మాసాని శేఖర్ రెడ్డి, జిల్లా ఎస్‌టి సెల్ కో ఆర్డినేటర్ అంబర్ సింగ్, నాయకులు కిషోర్ యాదవ్, వెంకట రెడ్డి, బాడి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సాయిలు, నారా గౌడ్, శ్రీనివాస్ గౌడ్, బండి సాయిలు యాదవ్, రఫిక్, రవిందర్ రెడ్డి, దేవేందర్ రెడ్డి, హైమద్ తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టులుగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

పోలీసు కమిషనర్ సాయి చైతన్య



**ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ :** జర్నలిస్టులుగా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని చట్టాలపై అవగాహన ఉన్నప్పుడే జర్నలిస్టులుగా రాణించగలుగుతారని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య అన్నారు. బుధవారం స్తానిక శ్రీరామ గార్డెన్లో జిల్లా పోలీసు కమిషనర్ ఆధ్వర్యంలో కమిషనరేట్ పరిధిలో జర్నలిస్టులకు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు శతాబ్దాల నాడు బ్రిటిష్ ప్రభుత్వం వారికి అనుకూలమైన చట్టాలను ప్రవేశపెట్టి భారతదేశంలో అమలు చేశారని, స్వతంత్ర భారతంలో మన పౌరులకు అవసరమైన చట్టాలను మనకు మనముగా తయారుచేసుకున్నదే నూతన చట్టాలన్నారు. జర్నలిస్టులు రెండు రకాలుగా ఉంటారని ఒకరు రిపోర్టింగ్ చేసేవారు, మరొకరు విషయ విశ్లేషణ చేసే జర్నలిస్టులు గాను ఉంటారని అన్నారు. జర్నలిస్టులుగా ఎదిగే విలేకరికి తప్పనిసరిగా నూతన చట్టాలపై అవగాహన కలిగి వార్తల పట్ల జాగ్రత్తలు తీసుకొని వార్తా ప్రచురణ గావించాలన్నారు. విలేకరులుగా మీ బాధ్యత తెలుసుకొని మసలుకోవాలని అన్నారు. ప్రస్తుత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు యుగంలో జర్నలిస్టుల ప్రాముఖ్యత తగ్గకుండా ఉండాలంటే వార్త ఇచ్చే ముందు అన్ని రకాల విషయ సేకరణ గావించి వార్తలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. నిజామాబాదులో పోలీసులకు జర్నలిస్టులకు మంచి సంబంధాలు ఉన్నాయని, నూతన చట్టాలపై అవగాహన ఉంటే సమాజానికి గణనీయంగా ఈ ఇరువురి ద్వారా మంచి సేవలు అందించవచ్చన్నారు. వాటిని పెంపొందించుకొనే ఉద్దేశంతో నూతన చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. దేశ చట్టసభల్లో చేసిన చట్టాలను అమలు చేసే బాధ్యత పోలీసులది మాత్రమేనన్నారు. ప్రస్తుత తరుణంలో ఎవిడెన్స్ ఇంప్లిమెంటేషన్ యాక్టు అనేది చాలా ముఖ్యమని జర్నలిస్టులు ప్రతి విషయంలో ఎవిడెన్సు ఉండేలా చూసుకోవాలన్నారు. ఈ సందర్భంగా అడిషనల్ సిపి (అడ్మిన్) బస్వారెడ్డి మాట్లాడుతూ చట్టాలు ప్రజల విచక్షణ ఆధారంగా చేసుకోబడేవని అన్నారు. కనుక భారతదేశ ప్రజలకు ఏది అవసరమో అవి ఉంచి, అనవసరమైన పాత చట్టాలను తీసివేయుట ద్వారా కొత్త చట్టాల ద్వారా ప్రజలకు మంచిని అందించాలన్న లక్ష్యంతో కొత్త చట్టాలని తెచ్చారన్నారు. ఇందుకు ప్రత్యేక ఉదాహరణగా పూర్వము బ్రిటిష్ చట్టాలలో రాజద్రోహం నేరంగా పరిగణించి, దాని ఆధారంగా చేసుకొని భారతీయ ప్రజలపై అనేక నేరాలను మోపి శిక్షలు అమలు చేశారు. ప్రస్తుత తరుణంలో ఇలాంటి రాజద్రోహం అనే చట్టాన్ని పూర్తిగా తీసివేయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ అసిస్టెంట్ పోలీసు కమిషనర్ రాజా వెంకటరెడ్డి మాట్లాడుతూ 1882 నాడు బ్రిటిష్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐపిసి చట్టాలను, భారత శిక్షాస్మృతి వంటి చట్టాలను 1992లో సిఆర్‌పిలుగా మార్చడం జరిగిందన్నారు. తదనంతర కాలంలో అనగా 40 సంవత్సరాల అనంతరం 2023లో నూతన చట్టాలను కేంద్ర ప్రభుత్వం బిఎన్ఎస్. బిఎన్ఎస్ఎస్, బిఎస్ఏ వంటి చట్టాలను తీసుకొని వచ్చిందని వీటి యొక్క అమలు 2024 జులై 1 నుండి దేశంలో అమలు చేస్తున్నామన్నారు. దీని అనుగుణంగా లీగల్ ప్రేమ్ వరకు అనేక మార్పు వచ్చాయని కోర్టులు ఇచ్చే సమన్లలో కానీ అరెస్టు ప్రాసెస్‌లో కానీ ఎఫ్ఐఆర్ చేసే విదానంలో కానీ పలు మార్పులు వచ్చాయని, నూతన భారతీయ చట్టాల ప్రకారం పూర్వపు చట్టాలకు కొత్త చట్టాలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను వివరించి తెలియజేశారు. ఈ సందర్భంగా బోధన్ ఏసిపి శ్రీనివాసులు మాట్లాడుతూ భారతీయ సాక్షి అభియాన్ బిఎంఎస్ గతంలోని ఇండియన్ ఎవిడెన్సు యాక్టు ప్రస్తుత బిఎంఎస్ మధ్య ఉన్న సెక్షన్లను వాటి విధానాలను తెలియజేశారు. ముఖ్యంగా బిఎస్ఏ ద్వారా ఏ నేరానికి ఎలాంటి, ఎంత శిక్షలు విధించాలి అన్న విషయాన్ని తెలియజేస్తుందన్నారు. న్యాయస్తానాలకు రుజువులు చాలా మఖ్యమని రుజువులు సమర్పిస్తే అవి సాక్ష్యాలుగా కోర్టులు పరిగణిస్తాయని అన్నారు. ప్రస్తుత పరిస్తితుల్లో కోర్టులు తీర్పులు వివరించడానికి వీలుగా ఎలక్ట్రానిక్ విధానాన్ని అతి ముఖ్య ఎవిడెన్సుగా స్వీకరించడం జరిగిందన్నారు. ఆర్మూర్ ఏసిపి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఐపిసి యాక్టులకు కొత్త భారతీయ న్యాయ సంహిత 2023లకు మధ్య ఉన్న సెక్షన్లు వివరించారు. ఇందులో ముఖ్యంగా కమిటి సర్వీసెస్ చేర్చడం వాటి యొక్క విశ్లేషణలను అదేవిధంగా ఆర్గనైజర్ స్కామ్స్ తదితర విషయాలను కొత్త చట్టాల అనుగుణంగా వాటి సెక్షన్లను తెలియజేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ డిప్యూటి పోలీసు కమిషనర్ అడ్మిన్ బస్వారెడ్డి, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసిపిలు రాజా వెంకట రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్ రెడ్డి, ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ, కమిషనరేట్ పరిధిలోని అన్ని మండలాల జర్నలిస్టులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిదులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడ

# ఫైనల్‌లో తలపడనున్న జట్లు

## పంజాబ్, ఆర్సీబీ, గుజరాత్, ముంబై.. ఐపిఎల్‌లో ఇలా?



ఐపిఎల్ 2025లో లీగ్ రౌండ్‌లో 70 మ్యాచ్‌లు పూర్తయ్యాయి. లీగ్ మ్యాచ్‌ల తర్వాత ప్లేఆఫ్స్‌కు 4 జట్లు నిర్ణయించబడ్డాయి. 58 మ్యాచ్‌ల వరకు ఎవరు ప్లేఆఫ్‌కు చేరుకుంటారని ఖచ్చితంగా చెప్పలేకపోయారు. కానీ దీని తర్వాత మే 18న జరిగిన డబుల్ హెడర్ అన్ని సమీకరణాలను పరిష్కరించిది. ఇప్పుడు క్వాలిఫయర్1, ఎలిమినేటర్ మ్యాచ్‌లు నిర్ణయించబడ్డాయి. మే 29న జరిగే మొదటి క్వాలిఫయర్‌లో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న రెండు జట్లు అంటే పంజాబ్ కింగ్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడతాయి.

అదే సమయంలో మే 30న జరిగే ఎలిమినేటర్‌లో గుజరాత్ టైటాన్స్ ముంబై ఇండియన్స్‌తో తలపడనుంది. ఈ నాలుగు జట్లు ఇంతకు ముందు ప్లేఆఫ్‌కు చేరుకున్నాయి కానీ ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్ ఎప్పుడూ టైటిల్ గెలవలేదు. ఈ రెండు జట్లు తమ మొదటి టైటిల్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ 2022లో టైటిల్‌ను గెలుచుకుంది. ముంబై ఐదు సార్లు టైటిల్‌ను గెలుచుకుంది. ఈ జట్లు ఇతంకు ముందు ఎప్పుడు ప్లేఆఫ్స్‌కు చేరుకున్నాయో, లీగ్ రౌండ్‌లో ఏ స్థానంలో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించాయో తెలుసుకుందాం.

### 1.పంజాబ్ కింగ్స్

పంజాబ్ కింగ్స్ ప్లేఆఫ్స్‌కు చేరుకుంది ఇది మూడో సారి మాత్రమే. అంతకు ముందు ఆ జట్టు 2008, 2014లో ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. 2008లో పంజాబ్ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో నిలిచింది. 2014లో ఆ జట్టు మొదటి స్థానాన్ని దక్కించుకుంది. అయితే 2008లో పంజాబ్ సెమీఫైనల్స్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు చేతిలో ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. అదే సమయంలో 2014లో ఫైనల్లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జట్టు ఓటమిని ఎదుర్కోవలసి వచ్చింది. ఇప్పుడు 2025లో పంజాబ్ జట్టు మరోసారి అగ్రస్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఈ సారి పంజాబ్ కింగ్స్ తన టైటిల్ కరువును అంతం చేసుకోగలదా లేదా అనేది చూడాలి. శ్రేయస్ అయ్యర్ గతంలో కేకేఆర్ జట్టు తరఫున ఆడి టైటిల్ గెలుచుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ వరుసగా రెండో ఏడాది టైటిల్ గెలుచుకోవాలని ప్రయత్నిస్తున్నాడు.

### 2.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు పదోసారి ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. గతంలో ఆ జట్టు 2009, 2010, 2011, 2015, 2016, 2020, 2021, 2022, 2024లలో కూడా ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. ఆ జట్టు 2009, 2011, 2016లలో రన్నరప్‌గా నిలిచింది. 2011లో ఆర్సీబీ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. 2016లో రెండో స్థానంలో నిలిచింది. 2009, 2015, 2021లో ఆ జట్టు మూడో స్థానంలో నిలిచింది. 2010, 2020, 2022, 2024లలో ఆ జట్టు నాల్గవ స్థానంలో నిలిచి ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఇప్పుడు మరోసారి ఆర్సీబీ రెండో స్థానంలో నిలిచింది. కాబట్టి ఆర్సీబీ తమ మునపటి రికార్డును బ్రేక్ చేయాలనుకుంటోంది. ఫైనల్ కు చేరుకోవడంతో పాటు ఎలాగైనా ఈ సారి టైటిల్ ను గెలుచుకోవాలని గట్టి పట్టుదలతో ఉంది.

### 3.గుజరాత్ టైటాన్స్

గుజరాత్ టైటాన్స్ జట్టు 2022లో ఉనికిలోకి వచ్చింది. అప్పటి నుంచి నాలుగు సీజన్లలో ఈ జట్టు ప్లేఆఫ్స్‌కు చేరుకున్న తర్వాత స్థిరమైన జట్టుగా నిలిచింది. 2022లో తన తొలి సీజన్‌లోనే ఆ జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. దీని తర్వాత 2023లో కూడా ఆ జట్టు ఫైనల్‌కు చేరుకుంది. కానీ సీఎస్కే చేతిలో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. ఈ రెండు సీజన్లలో గుజరాత్ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది. దీని తర్వాత 2024లో గుజరాత్ జట్టు లీగ్ రౌండ్‌లోనే నిష్క్రమించింది. ఆ జట్టు అప్పుడు 8వ స్థానంలో ఉంది. ఈ సారి గుజరాత్ జట్టు మూడో స్థానంలో నిలిచి అర్హత సాధించింది.

### 4. ముంబై ఇండియన్స్

ఐపీఎల్ చరిత్రలో ముంబై ఇండియన్స్ ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచింది.2013, 2015, 2017, 2019, 2020 సంవత్సరాల్లో ఐపీఎల్ టైటిల్ గెలుచుకుంది. ఈ ఐదు సీజన్లలో ఆ జట్టు మొదటి రెండు స్థానాల్లో నిలిచింది. ఇప్పటివరకు ఆ జట్టు మూడవ లేదా నాల్గవ స్థానంలో నిలిచి టైటిల్ గెలవలేదు. ఈ సారి ఆ ప్రకటన తప్పు అని నిరూపించడానికి జట్టు ప్రయత్నిస్తోంది. ముంబై జట్టు మొత్తం 11 సార్లు ప్లేఆఫ్స్‌కు చేరుకుంది. అయితే ఈ సీజన్లన్నింటిలోనూ ఆ జట్టు మూడు లేదా నాల్గవ స్థానంలో నిలిచింది. ఫైనల్‌కు చేరుకోలేకపోయింది. హార్దిక్ కెప్టెన్సీలో ముంబై జట్టు ఆరోసారి ఛాంపియన్‌గా నిలిచింది.

## పంత్‌కు జరిమానా.. రూ.30 లక్షలు



లక్నో సూపర్ గెయింట్స్ కెప్టెన్ రిషబ్ పంత్‌కు .. 30 లక్షల జరిమానా విధించారు. ఐపీఎల్‌లో ఆర్సీబీతో జరిగిన మ్యాచ్‌లో లక్నో జట్టు స్లో ఓవర్ రేట్‌తో బౌలింగ్ చేసింది. ఈ నేపథ్యంలో లక్నో జట్టుకు ఫైన్ వేశారు. అయితే లక్నో ప్లేయర్లకు కూడా 12 లక్షల జరిమానా విధించారు. దీంట్లో ఇంపాక్ట్ ప్లేయర్ కూడా ఉన్నాడు. ఈ సీజన్‌లో ప్రవర్తనా నియమావళిని మూడో సారి లక్నో జట్టు ఉల్లంఘించినట్లు ఐపీఎల్ తన ప్రకటనలో తెలిపింది. అందుకోసమే పంత్‌కు 30 లక్షలు ఫైన్ వేసినట్లు చెప్పింది. లక్నో జట్టులోని మిగితా ఆటగాళ్లకు 12 లక్షలు లేదా 50 శాతం ఫీజులో కోత విధించనున్నారు. హై స్కోరింగ్ గేమ్‌లో ఆర్సీబీ జట్టు ఆరు వికెట్ల తేడాతో లక్నోపై విజయం సాధించింది. రిషబ్ పంత్ సెంచరీ చేసినా తమ జట్టుకు విక్టరీని అందించలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో అతను 61 బంతుల్లో 118 రన్స్ చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఆర్సీబీ ఈ గెలుపుతో క్వాలిఫయర్ 1కు వెళ్లింది. గురువారం చండీఘడ్‌లో ఆ జట్టు పంజాబ్ కింగ్స్‌తో ఆడనున్నది.

# రీల్

## ఆసక్తికరంగా 'మిరాయ్' టీజర్




యువ నటుడు తేజ సజ్జా ప్రధానపాత్రలో రూపొందుతోన్న చిత్రం 'మిరాయ్'. కార్తిక్ ఘట్టమనేని దర్శకత్వంలో పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. నేడు దీని టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. 'కలియుగంలో పుట్టిన ఏశక్తీ దీన్ని ఆపలేదు..' ఆసక్తికర డైలాగులతో టీజర్ ఆకట్టుకునేలా ఉంది. ఇందులో మంచు మనోజ్ కీలకపాత్రలో కనిపించనున్నారు. విజువల్స్ భారీ స్థాయిలో ఉన్నాయి. సెప్టెంబర్ 5న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది.

## ఐదు పదాల్లో కథ చెప్పొచ్చు

### కమల్‌హాసన్



కమల్‌హాసన్ కీలకపాత్రలో మణిరత్నం దర్శకత్వంలో రూపొందిన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామా 'థగ్‌లైఫ్'. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ జూన్ 5న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రబృందం ఓ ఇంటర్వ్యూలో పాల్గొంది. అందుకు సంబంధించిన ప్రోమో విడుదలైంది. ఆ ప్రోమోలో కమల్ మాట్లాడుతూ.. 'థగ్‌లైఫ్' కథను ఐదు పదాలతో చెప్పేయచ్చు అన్నారు.

## మనసు చెప్పేదే వింటా

### దీపికా పదుకొణె



ఎప్పుడూ తన మనసు చెప్పేదే వింటానన్నారు బాలీవుడ్ నటి దీపికా పదుకొణె. ఏ కార్యక్రమంలోనైనా సెంటర్ ఆఫ్ ఎట్రాక్షన్‌గా నిలిచే ఆమె.. తాజాగా ఓ ఫ్యాషన్ షోలో హొయలొలికించారు. అక్కడ మీడియాతో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ''జీవితంలో బ్యాలెన్స్‌డ్‌గా ఉండాలంటే నిజాయతీ ముఖ్యం. నేను దానికే ప్రాధాన్యతనిస్తాను. క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడల్లా నా మనసు చెప్పేది వింటాను. ఆ తర్వాతే నిర్ణయాలు తీసుకుంటాను. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాను'' అని దీపికా చెప్పారు. రెండు రోజులుగా దీపికా పేరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన విషయం తెలిసిందే. తన సినిమాను లీక్ చేసే ప్రయత్నం చేస్తున్నారంటూ ఒక స్టార్ డైరెక్టర్ చేసిన కామెంట్స్ ఆమెను ఉద్దేశించే అంటూ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో నిజాయతీ గురించి దీపికా చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా ఆ వివాదాన్ని ఉద్దేశించే అనుకుంటున్నారు. దీపికా చివరిసారిగా 'సింగం అగైన్'లో కనిపించారు. రోహిత్ శెట్టి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో అజయ్ దేవ్‌గణ్, కరీనాకపూర్ ఖాన్, రణ్‌వీర్‌సింగ్, అక్షయ్‌కుమార్‌లు కీలకపాత్రలు పోషించారు. దీనితో పాటు గతేడాది 'కల్కి 2898 ఏడీ'లో సుమతి పాత్రలో కనిపించి సందడి చేశారు. ప్రస్తుతం దీని సీక్వెల్ పనులు జరుగుతున్నాయి.

## సస్పెన్స్ థ్రిల్లర్‌తో వస్తున్న 'మార్గన్'




తమిళ నటుడు విజయ్ ఆంటోని నటించే సినిమాలకు తెలుగులోనూ మంచి క్రేజ్ ఉంటుంది. ఆయన నుంచి ఓ సినిమా వస్తుందంటే అది ఎలాంటి కంటెంట్‌తో రాబోతుందా అనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంటుంది. ఇక ఆయన నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మార్గన్' ఇప్పటికే షూటింగ్ పనులు ముగించుకుని రిలీజ్‌కు రెడీ అయ్యింది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ ట్రైలర్ ఆద్యంతం సస్పెన్స్ థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో ఆసక్తికరంగా కట్ చేశారు. థ్రిల్లింగ్ అంశాలకు పెద్దపీట వేస్తూనే ఇన్వెస్టిగేటివ్ ఎలిమెంట్స్‌తో ప్రేక్షకులను స్టన్ చేసేందుకు ఈ చిత్రం రెడీ అవుతుంది. ఇక విజయ్ ఆంటోని మరోసారి తనదైన యాక్టింగ్‌తో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయడం ఖాయం. ఈ ట్రైలర్‌లో సూపర్ న్యాచురల్ అంశాలు కూడా కనిపించడంతో అసలు ఈ సినిమా ఎలాంటి కథతో రాబోతుందా అనే ఆసక్తి క్రియేట్ అవుతుంది.

ఈ సినిమాలో దీప్షిక, అజయ్ దిషన్, సముద్ర ఖని తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు. ఈ చిత్రానికి విజయ్ ఆంటోని సంగీతం అందించగా, లియో జాన్ పాల్ దర్శకత్వం వహించారు. ఈ సినిమాను జూన్ 27న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

## రైతు భరోసా జమ (మొదటి పేజీ తరువాయి)

ఎరువులు, పురుగు మందులు లేని పంటలను పండించాలని ఆయన సూచించారు. ఎల్లప్పుడూ ఒకే పంటకు ప్రాధాన్యత ఇవ్వకుండా పంట మార్పిడికి రైతులు ప్రయత్నించాలని, పామాయిల్ తోటల వైపు రైతులు మొగ్గు చూపాలని, జిల్లాలో ఆయిల్ ఫామ్ పరిశ్రమ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. దేశంలోనే అత్యధిక ధాన్యం ఉత్పత్తి చేసిన రాష్ట్రంగా తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచిందని అన్నారు. ధాన్యం పండించిన రైతులకు రూ. 1150 కోట్లను వారి ఖాతాలలో వేయడం జరిగిందని వెల్లడించారు. రైతు భరోసా, రైతు భీమా, ఎరువులు, విత్తనాలు సకాలంలో రైతులకు అందించినపుడే వ్యవసాయాన్ని పండగలా చేయగలుగుతారని, ఆ దిశలో తమ ప్రభుత్వం పనిచేస్తుందని తుమ్మల అన్నారు.

శాసనమండలి సభ్యులు గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేయాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించుకోవాలని, రైతులకు ఇది శుభపరిణామమని అన్నారు. పార్లమెంట్ సభ్యులు కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామానికి ప్రజాపాలన అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తుందని, అపార అనుభవమున్న మంత్రుల పర్యవేక్షణలో పరిపాలన కొనసాగుతుందన్నారు. శాసనసభ్యులు వేముల వీరేశం మాట్లాడుతూ చౌటుప్పల్ మార్కెట్ యార్డు పరిధిలో ఉన్న చిట్యాల మండలంలోని 8 గ్రామాలను చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డులో కలపాలని, నార్కట్‌పల్లి సబ్ మార్కెట్‌ను పూర్తి స్థాయి మార్కెట్ యార్డుగా రూపొందించాలని మంత్రిని కోరారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరీ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి, ఎంఎల్‌సి శంకర్‌నాయక్, జిల్లా అదనపు కలెక్టర్ జె శ్రీనివాస్, ఆర్‌డిఓ వై అశోక్‌రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి శ్రీనివాస్, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకు ఛాయాదేవి, పిఎసిఎస్ చైర్మన సుంకరి మల్లేష్‌గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి చిన వెంకట్‌రెడ్డి, నాయకులు నర్రా మోహన్‌రెడ్డి, పోకల దేవదాసు, కాటం వెంకటేశం, వనం వెంకటేశ్వర్లు, మారగోని అంజనేయులు, గుడిపాటి లక్ష్మినర్సింహ్మా, జడల చినమల్లయ్య, ఎద్దులపురి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కౌమార బాలికలకు ఇందిరమ్మ అమృతం

### ఆడపిల్లల్లో శక్తి పెంచేందుకు పౌష్టికాహారం

### నేడు భద్రాద్రి జిల్లాలో ప్రారంభించనున్న మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** కౌమార బాలికల్లో రక్తహీనత తగ్గించి శక్తిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ అమృతం పేరిట కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకాన్ని పైలెట్ ప్రాజెక్ట్ క్రింద నేడు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ,శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖా మంత్రి దనసరి అనసూయ సీతక్క లాంఛనంగా ప్రారంభించనున్నారు. అనేక కార్యక్రమాలు విజయవంతంగా అమలు చేస్తున్న ప్రభుత్వం తాజాగా ఆడపిల్లలకు శక్తినిద్దాం, ఆరోగ్య తెలంగాణ నిర్మిద్దాం అనే నినాదంతో ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. స్త్రీ,శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఇందిరమ్మ అమృతం పేరిట 1418 ఏళ్ల వయస్సున్న కౌమార బాలికలకు ఈ పథకాన్ని వర్తింపజేస్తారు. పల్లి, చిరుధాన్యాలతో తయారుచేసిన పట్టీలు ప్రతి నెలా అంగన్వాడీ కేంద్రాల్లో నెలకు రెండు సార్లు ఉంచితంగా పంపిణీ చేయనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతో పాటు జయశంకర్ భూపాలపల్లి, కొమరంభీం ఆసీఫాబాద్ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు క్రింద ప్రారంభిస్తున్నారు. జాతీయకుటుంబ ఆరోగ్య సర్వే ప్రకారం రాష్ట్రంలో 64.5 శాతం కౌమార బాలికలు రక్తహీనతతో బాధపడుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ సమస్య నుండి భావితరానికి మేలు చేసేందుకు ప్రభుత్వం ముందడగు వేసింది. నెలకు సరిపోను రెండుసార్లు కిట్ల రూపంలో అందిస్తారు. ఒక్కొక్క చిక్కీలో 600 కేలరీలు, 20 గ్రాముల ప్రోటీన్లు ఉండే విధంగా సిద్ధం చేస్తున్నారు. బాలికల ఆరోగ్యాన్ని అంచనా వేసేందుకు అన్ని రకాలు రక్త పరీక్షలు నిర్వహించనున్నారు. మరింత మెరుగైన ఆరోగ్యం కోసం ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు కూడా అందివ్వనున్నారు. సెర్ఫ్ సహకారంతో బాలికల జీవన నైపుణ్యాలు అభివృద్ధి చేసేందుకు పలు రకాల కార్యక్రమాలు కూడా చేపట్టనున్నారు. పోషకాహారం, ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రతం, బాలికా వివాహాలపై అవగాహన కల్పిస్తారు.

పథకం ప్రారంభం ఇక్కడే కౌమార బాలికల్లో రక్తహీనత తగ్గించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ అమృతం పథకరం భద్రాద్రి జిల్లాలోనే మంత్రి సీతక్క గురువారం ప్రారంభిస్తారు. పైలెట్ ప్రాజెక్టు క్రింది ఎంపికైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 23,399, కొమరంభీం ఆసీఫాబాద్ జిల్లాలో 18,230, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 8,640 మంది కౌమార బాలికలు ఉన్నారు. మొత్తంగా ఉన్న 50,269 మంది కౌమార బాలికలు ఇందిరమ్మ అమృతం పథకం ద్వారా లబ్ధిపొందబోతున్నారు.

### బాలసదన్ చిన్నారులతో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్

# రూ.2 కోట్ల చెక్కు అందజేసిన దాతలు



**ప్రజాపక్షం / హైదరాబాద్:** హైదరాబాద్‌లోని హోటల్ ట్రిడెంట్ వేదికగా మిస్ వరల్ పోటీదారులతో 'హార్ట్ ఆఫ్ గోల్డ్' పేరిట ఓ వినూత్నమైన చారిటీ ఈవెంట్‌ను బుధవారం నిర్వహించారు. వికారాబాద్, నారాయణపేట జిల్లాల ప్రభుత్వ ఐసిడిస్ బాలసదన్‌లలోని అనాథ చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌ను కలిసే అవకాశం చిన్నారులకు కలిపించాలని ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్ చిన్నారులతో ముచ్చటిస్తూ, వారితో కలిసి ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. చిన్నారులను తమ ఒడిలో కూర్చోబెట్టుకొని సెల్ఫీ, వీడియోలు తీసుకుంటు ఆనందం వ్యక్తం చేశారు. మిస్ వరల్డ్ పోటీదారుల్లో చాలా వరకు సామాజిక సేవలో ఉన్నవారు అయినందున చిన్నారులతో ఆసక్తిగా ముచ్చటించారు. లైవ్ బ్యాండ్ సంగీతానికి వారు చిన్నారులతో కలిసి ఉత్సాహంగా డాన్సు చేయడం, సెల్ఫీలు తీసుకోవడం కార్యక్రమం అంతా సందడిగా సాగింది.

**200 విద్యార్థులకు ఏడాది పాటు సహకారం.. రూ.2 కోట్ల చెక్కు అందవేత**

ఫార్చ్యున్ హాస్పిటాలిటీ, సుదీక్ష ఎస్టేట్స్ సంస్థలు మిస్ వరల్డ్ సంస్థతో కలిసి బాలసదన్‌లలోని 200 మంది అనాథ పిల్లలకు ఏడాది పాటు సహాయం చేసేందుకు స్పాన్సర్‌షిప్ ప్రోగ్రామ్‌ను ప్రకటించాయి. విద్యా, పాఠ్యపుస్తకాలు, పోషకాహార, నెలవారీ రేషన్ సరఫరా, దుస్తులు, స్వెటర్లు, రెయిన్ కోట్లు, డ్రెస్సులు, స్కూల్ కిట్లు (స్కూల్ బ్యాగ్లు, వాటర్ బాటిళ్లు, టిఫిన్ బాక్సు), టాయిలెట్రీలు, బాత్రూమ్ అవసరాలు, డిజిటల్ వాచ్లు, విద్యా ఆట బొమ్మలు, వ్యక్తిగత వస్తువుల కోసం ట్రాలీ బ్యాగ్లు, ప్రోటీన్ పౌడర్, సప్లిమెంట్లుతో కూడిన 200 కిట్లను చిన్నారులకు అందించారు. ఒక్కో చిన్నారికి పోటీదారులు చేతులమీదగా ఈ కిట్లని అందజేశారు. ఈ సహాయం ఏడాది పాటు చేస్తామని దాతలు ప్రకటించారు. అదేవిధంగా విక్టోరియా మెమోరియల్ పాఠశాల పూర్తిస్థాయి పునరుద్ధరణను కూడా దాతలు ముందుకు వచ్చారు.

## కృషి స్ఫూర్తిదాయకం (మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధరక భవన్‌లో గల సురవరం ప్రతాప రెడ్డి ఆడిటోరియంలో జరిగింది. శాంతా వసంతా ట్రస్ట్ సౌజన్యంతో సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్వర్యంలో సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ ఎల్లూరి శివా రెడ్డి అధ్యక్షతన జరిగిన పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి శ్రీధర్‌బాబు, విశిష్ట అతిథులుగా శాంతా వసంతా ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ కె.ఐ.వర ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2025 సంవత్సరానికి గాను ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ అనుమాండ్ల భూమయ్య, ప్రముఖ రచయిత, పరిశోధకులు డాక్టర్ సంగి శెట్టి శ్రీనివాస్ కు సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి సాహితీ పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. సభలో మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణ కోసం ఏనలేని కృషి చేసి సురవరం ప్రతాప రెడ్డి భావి తరాలకు గుర్తు ఉండే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన పేరును తెలుగు విశ్వ విద్యాలయానికి పెట్టడం ద్వారా ఆమహోనీయుడిని సముచితంగా గౌరవించిందన్నారు. తెలంగాణ భాషా, యాసకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు ప్రభుత్వం ప్రతాప రెడ్డి ప్రముఖ రచనలను పుస్తక రూపంలో తీసుకురానున్నామని, ఇందుకు సంబంధించి సలహాలు, సూచనలు ఇవ్వాలని సాహితీవేత్తలను మంత్రి కోరారు. కె.ఐ.వర ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ సురవరం ప్రతాప రెడ్డి నిజమైన హీరో అని కొనియాడారు. నిజాం కాలంలో తెలుగును చదువుకోవడం పక్కన పెడితే, కనీసం ఉచ్చరించే పరిస్థితి కూడా లేని విపత్కర పరిస్థితుల్లో తెలుగు భాష కోసం పోరాటం చేసిన మహా యోధుడన్నారు. తెలంగాణ భాష, యాసను ఆంధ్ర ప్రాంతంలో కొంత మంది అవహేళన చేసే విధంగా మాట్లాడితే తమకు భాష, యాస ఉందని చాటిచెప్పిన గొప్ప వైతాళికులన్నారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపి సురవరం సుధాకర్ రెడ్డి, సురవరం ప్రతాప రెడ్డి సాహిత్య వైజయంతి ట్రస్ట్ కార్యదర్శి సురవరం పుష్పలత, ట్రస్టు సభ్యులు సురవరం కృష్ణవర్ధన్ రెడ్డి, సురవరం రఘువర్ధన్ రెడ్డి, సురవరం విజయభాస్కర్ రెడ్డి, సురవరం రంగా రెడ్డి, సురవరం అనిల్ కుమార్ రెడ్డి, సురవరం కపిల్, పలువురు కవులు, సురవరం ప్రతాప రెడ్డి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మరోసారి చంద్రబాబు ఎన్నిక

(మొదటి పేజీ తరువాయి)

మహానాడులో చంద్రబాబును మరోసారి టిడిపి జాతీయ అధ్యక్షుడిగా పార్టీ నాయకులు ఎన్నుకున్నారు. మహానాడు రెండవ రోజున పార్టీ అధ్యక్ష పదవికి సంబంధించి చంద్రబాబు నామినేషన్‌ను అనేక మంది నేతలు ప్రతిపాదించగా పార్టీ నేతలంతా మద్దతు తెలిపారు. దీంతో చంద్రబాబు నాయుడు టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చంద్రబాబు పార్టీ పగ్గాలు చేపట్టిన తర్వాత కడపతో కలుపుకుని ఇప్పటి వరకు 25 మహానాడులు నిర్వహించారు. కరోనా నేపథ్యంలో రెండేళ్లు జూమ్ ద్వారా మహానాడు నిర్వహించారు. చంద్రబాబును ప్రస్తుతం 12వ సారి టీడీపీ అధినేతగా మహానాడు ఎన్నుకుంది. జాతీయ పార్టీ అధ్యక్షుడిగా చంద్రబాబుతో వర్ల రామయ్య ప్రమాణం చేయించారు. టీడీపీ ఎన్నికల కమిటీ అధ్యక్షుని హోదాలో తనకు ఈ అవకాశం కల్పించినందుకు చంద్రబాబుకు వర్ల రామయ్య కతజ్ఞతలు తెలిపారు.

**వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్‌కు బాధ్యతలు అప్పగించాలి**

రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు అప్పగించాలంటూ మహానాడులో సీనియర్ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, మంత్రి పయ్యావుల కేశవ్, దూళిపాళ్ల నరేంద్ర తదితరులు ప్రతిపాదించారు. టీడీపీ మరింత బలోపేతం కావాలంటే లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ ఇవ్వాలన్నది సహేతుకమైన నిర్ణయమని మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. లోకేశ్ వర్కింగ్ ప్రెసిడెంట్ కావాలన్నది నీడ్ ఆఫ్ ది అవర్ అని అభిప్రాయపడ్డారు. అందరి అభిప్రాయాలకు అనుగుణంగా సరైన సమయంలో పార్టీ సరైన నిర్ణయం తీసుకుంటుందని ఆకాంక్షించారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పార్టీ శ్రేణుల సంక్షేమానికి పాటుపడటంతో పాటు యువగళం ద్వారా ప్రజలకు మరింత చేరువై, మంత్రిగా లోకేశ్ సక్సెస్ అయ్యారని సోమిరెడ్డి కొనియాడారు. పార్టీలో యువరక్తం పెంపొందించి టీడీపీని మరింత బలోపేతం చేసేందుకు ఆయనకు వర్కింగ్ ప్రెసిడెంట్‌లాంటి కీలక బాధ్యతలు అప్పగించాలని కోరారు. కడపలో జరుగుతున్న మహానాడు వేదికగా లోకేశ్‌కు కీలక పదవి ఇవ్వాలని పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర ప్రతిపాదించారు. లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని తాము గుంటూరు మినీ మహానాడులో తీర్మానించామని సీఎం చంద్రబాబు నాయుడుకు ఈ సందర్భంగా దూళిపాళ్ల నరేంద్ర చెప్పారు. పార్టీ శ్రేణులందరూ కోరుకుంటున్న విధంగా నారా లోకేశ్‌కు వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వాలని సీఎంకు నరేంద్ర విజ్ఞప్తి చేశారు.

## అంగన్‌వాడీ భవనాలు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులను కన్న బిడ్డల్లా చూసుకోవాలని, వారి ఆలనాపాలన బాధ్యత సిబ్బందిదే అని, దేశ భవిష్యత్ పిల్లల చేతుల్లో, వారి భవిష్యత్ మీ చేతుల్లో ఉందన్నారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాలను గుర్తించి అంగన్వాడీ కేంద్రాలను వాటిల్లోకి మార్చాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఖాళీను భర్తీ చేస్తామని, ఉద్యోగులు, సిబ్బంది సమస్యలను కూడా పరిష్కరిస్తామన్నారు. అంగన్‌వాడీ అధికారులు చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుండి జీతాలు పొందుతున్న అంగన్వాడీ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలను గుర్తించి పరిష్కరించాలని, స్థానికంగా ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సిబ్బంది పనితీరు ప్రభుత్వ ప్రతిష్టను పెంచడంతో పాటు తమ ప్రతిష్టను కూడా పెంచుతుందని తెలిపారు. నాణ్యత లేని ఆహార పదార్థాలు సరఫరా చేస్తే తిరస్కరించాలని, నాణ్యత లేని ఆహార పదార్థాల ద్వారా పిల్లల్లో పౌష్టికాహారం లోపాలు సంభవించే ప్రమాదం ఉందని, సిబ్బంది బాధ్యతాయుతంగా ప్రవర్తించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లల ఆలనా పాలన చూసుకునేందుకు త్వరలో క్రష్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నామని, పైలెట్ ప్రాజెక్టు క్రింది ముందు కొన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. వయో వృద్ధుల సంక్షేమానికి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో అతిత్వరలో ఫిజియోథెరపీ సేవలు అందుబాటులోనికి తెస్తామని, వేసవి సెలవుల అనంతరం అంగన్వాడీ కేంద్రాల ప్రారంభం సెల్ఫీ విత్ అంగన్వాడీ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఆస్తులను తీసుకుని తల్లిదండ్రులను చూడని పిల్లలపై కేసులు నమోదు చేయాలని, ఇందులో ఎంతటి వారినైనా ఉపేక్షించేంది లేదన్నారు. వయోవృద్ధుల కోసం వారి ఆలనాపాలనా చూసుకునేందుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. వికలాంగులకు ఇందిరమ్మ ఇళ్లను ప్రథమ ప్రాధాన్యత క్రమంగా మంజూరీ చేయాలన్నారు. వ్యవస్థలో ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు ప్రజలకు సేవచేసేందుకే ఉన్నారని, ప్రజాపాలనలో ప్రతీ ఒక్కరికీ మేలు జరిగే కార్యక్రమాలను ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తోందని, వీటి ఫలాలలు క్రిందిస్థాయికి సైతం చేరాలంటే అధికారులంతా సమన్వయంతో విధులు నిర్వహించిన నాడే సాధ్యమవుతుందని, ఇందుకోసం కృషి చేసి పిల్లల అభివృద్ధితో పాటు దేశాభివృద్ధికి తోడ్పడాలని సీతక్క కోరారు.

ఈ కార్యక్రమంలో ఎంపి పోరిక బలరామ్ నాయక్, కొత్తగూడెం, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు, వైరా, సత్తుపల్లి ఎంఎల్‌ఏలు కూనంనేని సాంబశివ రావు, డా.తెల్లం వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లు, జారే ఆదినారాయణ, కోరం కనకయ్య, రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కలెక్టర్ జితేష్ వి పాటిల్, అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, లెనినాతోపాటు ఉమ్మడి జిల్లాలోని అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com